

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

26-1-2026 సోమవారం సంపుటి: 31 సంచిక: 355 పేజీలు: 10+4 వెల: 6.50




శుభాకాంక్షలు
77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా మా పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు
-డా. గిరీష్ కుమార్ సంఘీ
'వార్త' చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్


## విరిసిన 'పద్మా'లు

### ధర్మేంద్రకు పద్మవిభూషణ్, నోరి దత్తాత్రేయుడుకు పద్మభూషణ్



పద్మవిభూషణులు: ధర్మేంద్ర - అచ్యుతానందన్ | పద్మభూషణులు: నోరి దత్తాత్రేయుడు - మమ్ముట్టి










### మొత్తం 131 మందికి పురస్కారాలు ప్రకటించిన కేంద్రం

### పద్మవిభూషణ్-5, పద్మభూషణ్-13, పద్మశ్రీలు - 113

### తెలుగు రాష్ట్రాలనుంచి 11 మందికి పద్మశ్రీ

### ఢిల్లీ కోటాలో మామిడాల జగదీష్‌కు పురస్కారం



పద్మశ్రీలు: రాజేంద్ర ప్రసాద్, మురళీమోహన్, గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్, రామా రెడ్డి, కుటుంబ శాస్త్రి, ఆనంద్ రెడ్డి, దీపికా రెడ్డి

**న్యూఢిల్లీ, జనవరి 25:** దేశంలో అత్యంత పౌరపురస్కారాల్లో ఒకటైన పద్మ అవార్డులను కేంద్ర ప్రభుత్వం ఆదివారం ప్రకటించింది. వీరిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ఉన్నారు. అయితే, ఈసారి మాత్రం తమిళనాడు, కేరళకు చెందిన వ్యక్తులకు ప్రాధాన్యత ఇచ్చింది. అవార్డుల ఎంపికలో కమిటీ అత్యంత పారదర్శకంగా వ్యవహరించింది. ముఖ్యంగా మారుమూల, అత్యంత వెనుకబడిన ప్రాంతాలకు చెందిన వ్యక్తులకు ఈసారి ప్రాధాన్యత ఇవ్వడం విశేషం. వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన వారిని ఈ ప్రతిష్ఠాత్మక అవార్డులకు మొత్తం 131 మందిని ఎంపిక చేసింది. ఐదుగురికి పద్మ విభూషణ్, 13 మంది పద్మ భూషణ్, 113 మందిని పద్మశ్రీకి ఎంపిక చేసింది. వీరిలో 19 మంది మహిళలు, ఆరుగురు విదేశీయులు, 16 మందికి మరణానంతరం అవార్డులువచ్చాయి. ఇక, కేరళ మాజీ సిఎం విఎస్ అచ్యుతా >>2



### భారత్ వ్యోమగామి శుభాంశు శుక్లాకు అశోక చక్ర!

2లో



### టెన్నిస్ స్టార్ విజయ్ అమృత్ రాజ్‌కు పద్మభూషణ్

2లో

## నారీశక్తితో దేశ వికాసం

### స్వయం ఉపాధినుంచి సాయుధ దళాలదాకా వారిదే పైచేయి

### రాజ్యాంగ నిబంధనలే జాతికి స్ఫూర్తి

### 77వ గణతంత్ర దినోత్సవ ప్రసంగంలో రాష్ట్రపతి ముర్ము



ఆదివారం న్యూఢిల్లీలో జాతినుద్దేశించి ప్రసంగిస్తున్న రాష్ట్రపతి ముర్ము

**న్యూఢిల్లీ:** రాజ్యాంగ నిబంధనల ద్వారా జాతీయ స్ఫూర్తికి, దేశ ఐక్యతకు మన స్వాతంత్ర్యోద్యమనేతలు బలమైన పునాదిని వేశారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. స్వదేశంలో, విదేశాల్లో గణతంత్ర దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకోబోతున్నామని స్పష్టం చేశారు. సోమవారం దేశం 77వ గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకోనున్న నేపథ్యంలో ద్రౌపది ముర్ము ఆదివారం జాతినుద్దేశించి ప్రసంగించారు. భారతీయ మహిళలు సంప్రదాయ మూస పద్ధతులను బద్దలు కొట్టి ముందుకు సాగుతున్నారని ద్రౌపదీ ముర్ము కొనియాడారు. నారీమణులు దేశ సర్వతోముఖాభివృద్ధికి చురుకుగా తోడ్పడుతున్నారని వెల్లడించారు. వ్యవసాయం నుంచి అంతరిక్షం వరకు, స్వయం ఉపాధి నుంచి సాయుధ దళాల వరకు ప్రతి రంగంలోనూ మహిళలు తమదైన ముద్ర వేస్తున్నారని తెలిపారు. క్రీడా రంగంలోనూ టీమ్ ఇండియా మహిళా క్రికెటర్లు ప్రపంచవ్యాప్తంగా కొత్త ప్రమాణాలను నెలకొల్పారని గుర్తు చేసుకున్నారు. గతేడాది నవంబర్‌లో టీమ్ ఇండియా మహిళా క్రికెటర్లు ఐసిసి మహిళల క్రికెట్ ప్రపంచ కప్‌ను, ఆ తర్వాత బ్లైండ్ మహిళల టీ20 వరల్డ్‌కప్‌ను గెలుచుకుని క్రీడాచరిత్రలో ఒక సువర్ణ అధ్యాయాన్ని >>2

## రాష్ట్రమంతా 'డే' భద్రత

### పెరేడ్ గ్రౌండ్స్ సహా కీలక ప్రాంతాల్లో డ్రోన్లతో పహారా

**హైదరాబాద్, జనవరి 25, ప్రభాతవార్త:** సోమవారం నాడు జరిగే గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా భారీ భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ వేడుకలను ఉగ్రవాదులు టార్గెట్ చేసినట్లు నిఘా వర్గాలు గుర్తించడంతో జంట నగరాలు, శివార్లలో భద్రతను మరింత పెంచారు. పరేడ్ గ్రౌండ్స్ సహా కీలక ప్రాంతాలలో డ్రోన్ల ద్వారా పహారా ఏర్పాటు చేశారు. శంషాబాద్, బేగంపేట్ విమానాశ్రయాలలో సాయుధ బలగాల చేత తనిఖీలు చేబట్టారు. గణతంత్ర వేడుకల పౌర, పోలీసు విభాగాలు భారీ ఏర్పాట్లు చేశాయి. ఈసారి వేడుకలకు ఖలీస్తాన్ ఉగ్రవాదులతో పాటు బంగ్లాదేశ్‌లో తిష్టవేసిన పాక్ ఉగ్రమూకలు దాడులకు దిగే వీలుందని నిఘా వర్గాలు హెచ్చరించిన నేపథ్యంలో భద్రతను మరింత పెంచారు. నిఘా వర్గాల ఆదేశాల నేపథ్యం లో గణతంత్ర వేడుకలు అధికారికంగా జరిగే పరేడ్ గ్రౌండ్స్‌తో పాటు జంట నగరాలలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలు, ముఖ్యమైన ప్రాంతాల వద్ద భద్రతను భారీగా పెంచారు. గణతంత్ర దినోత్సవాల సమయంలో ప్రముఖులు పాల్గొనే కార్యక్రమాల వద్ద భద్రత కట్టు దిట్టం చేయాలని ఆయా ప్రాంతాల పోలీసులకు ఆదేశాలు అందాయి. బస్ స్టేషన్లతో పాటు రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలు, జన సమ్మర్థం గల అన్ని ప్రాంతాలలో ముందస్తు తనిఖీలు చేబట్టారు. గణతంత్ర వేడుకలు ముగిసిన >>2

## నా దేశం.. నా ఓటు




ఆదివారం అవార్డులను అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

### ప్రతి పౌరుడి నినాదం ఇదే కావాలి

### ప్రజాస్వామ్య అభ్యున్నతికి ప్రజలు కదలాలి

**హైదరాబాద్ (రవీంద్రభారతి), జనవరి 25 ప్రభాతవార్త :** దేశంలో ప్రతీ పౌరుడు తన ఓటుహక్కును సద్వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందని తెలంగాణ రాష్ట్ర గవర్నరు జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని భారతదేశంలోని బలమైన రాజ్యాంగ సంస్థలలో ఒక్కటైన భారత ఎన్నికల కమిషన్ జరుపుకుంటుందని ఆయన పేర్కొన్నారు. ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునేలా ఎన్నికల కమిషన్ విస్తారమైన, వైవిధ్యమైన పారదర్శక ఎన్నికల నిర్వహణ ప్రాధాన్యతను గవర్నరు నొక్కివక్కాణించారు. ఇందుకు అన్ని రాజకీయ పార్టీలు సంపూర్ణంగా సహకరించాలని సూచించారు. ముఖ్యంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కనీస సౌకర్యాలను అందించడం, ఎన్నికలను మరింత సమగ్రంగా మారిన సాంకేతిక పరిజ్ఞానం జోడించి నిర్వహించాలన్నారు. 61-జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల సందర్భంగా డ్రోన్ల నిఘాను వినూత్నంగా ఉపయోగించడాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ఎన్నికలను ఎంతో సజావుగా, శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించినందుకు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్, >>7

## సైట్ విజిట్ టెండర్లు రద్దు చేయాలి




### బొగ్గు కుంభకోణంపై సిబిఐ దర్యాప్తు జరపండి

### ఒబి వర్క్స్‌లో మొదటి లబ్ధిదారుడు సిఎం బావమరిదే:

### మీడియాతో మాజీ మంత్రి హరీష్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి25:** తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. సింగరేణి స్కాంలో రేవంత్‌రెడ్డినే లబ్ధిదారుడని షాకింగ్ కామెంట్స్ చేశారు. స్కాంలు, కాంగ్రెస్ అరాచకాలతో సింగరేణి సంస్థపై భారం పెరిగిందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో స్కీంలు లేవు.. కానీ స్కాంలు పెరిగిపోయాయని ఆరోపణలు చేశారు. జాబ్ క్యాలెండర్ కాదని.. రేవంత్‌రెడ్డి స్కాంల క్యాలెండర్‌ను తెచ్చారని ఆక్షేపించారు. ఆంధ్రా నేతలతో రేవంత్‌రెడ్డి చేతులు కలిపి.. నదీ జలాల్లో తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్‌లో అత్యుత్తమ హోదా పొందటానికి అందరికంటే ఎక్కువ అర్హత ఉన్న నాయకుడు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కనేనని హరీశ్‌రావు చెప్పుకొచ్చారు. అంతటి అనుభవం ఉన్న భట్టి విక్రమార్క.. రేవంత్‌రెడ్డి కళ్లల్లో ఆనందం కోసం పనిచేయటం బాధాకరమని పేర్కొన్నారు. సింగరేణి స్కాంపై సీబీఐ లేదా సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. భట్టి లబ్ధిదారుడా లేదా అనేది విచారణలో తేలుతుందని తెలిపారు. అవినీతి ఆరోపణలు వచ్చినప్పుడు గతంలో మంత్రులు రాజీనామా చేసేవారని ప్రస్తావించారు. సింగరేణి ఓబీ వర్క్స్‌కు సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానం తెచ్చిందే కాంగ్రెస్ అని గుర్తుచేశారు. తనకు లేఖ రాస్తే.. ముఖ్యమంత్రితో మాట్లాడుతానని భట్టి అనటం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. రేపో, మాపో తమకు మరో ప్రేమ లేఖ (సిట్‌నోటీసు) వస్తుందని సెటైర్లు గుప్పిం >>7

## మున్సిపోల్స్‌లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

### ఎన్నికల్లో ఆషామాషీగా ఉండొద్దు



### సర్వేల ఆధారంగా టిక్కెట్ల ఖరారు

### పట్టణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

### పార్టీ సమన్వయ సమావేశంలో మంత్రి ఉత్తమ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి25:** వచ్చే శాసనసభ ఎన్నికల్లోనూ అధికారం కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌పై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయంగా కనిపిస్తుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక చేపట్టిన అభివృద్ధి, అమలు జరుపుతున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు కాంగ్రెస్ పార్టీ మీద విశ్వసనీయతను పెంపొందించిందని ఆయన పేర్కొన్నారు. జరిగిన అభివృద్ధిని అమలు జరుగుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విరివిగా తీసుకపోయేందుకు కాంగ్రెస్ పార్టీ లీడర్, క్యాడర్ కృషి చేసేందుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులను సన్నద్ధం చేసేందుకు లోకసభ నియోజకవర్గాల వారిగా మంత్రులను ఇంచార్జీలుగా నియమించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో భాగంగా నిజామాబాద్ లోకసభ నియోజకవర్గానికి రాష్ట్ర నీటిపారుదల మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డిని నియమించారు.

ఈ సందర్భంగా ఆదివారం రోజున నిజామాబాద్ లోకసభ నియోజకవర్గ పరిధిలోని నిజామాబాద్ కార్పొరేషన్, బోధన్, ఆర్మూర్, భీంగల్, మెట్‌పల్లి, కోరుట్ల మున్సిపల్ పరిధిలలో నిర్వహించిన పార్టీ సమన్వయ సమావేశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారులు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, కార్పొరేషన్ ఛైర్మన్ అనిల్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ నర్సి రెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతీ మున్సిపాలిటీ మీద కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమని >>2

## బంకర్‌లోకి ఖమేనీ!

### ఇరాన్-యుఎస్ మధ్య మరింత పెరిగిన ఉద్రిక్తత



**టెహ్రాన్, జనవరి 25:** తమదేశంపై ఏ క్షణంలో అయినా అమెరికా దళాలు దాడులుచేయవచ్చన్న ముందస్తు సంకేతాలతో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీని టెహ్రాన్‌లోని ఓ బంకర్‌కు తరలించారు. ఈ బంకర్ టెహ్రాన్‌లోని పలు సొరంగ మార్గాలకు కనెక్ట్ చేయబడి ఉన్నట్లు సమాచారం. సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ బంకర్‌లోకి వెళ్లగా ఆయన రోజువారీ వ్యవహారాలు ఆయన చిన్న కొడుకు మసూద్ ఖమేనీ చూసుకుంటున్నట్లు అమెరికా సమాచారాన్ని ఉటంకిస్తూ ఇరాన్ ఇంటర్నేషనల్ పేర్కొంది. అత్యవసర సమయాల్లో ఇరాన్ కార్యనిర్వాహక వర్గంతో మసూద్ సమన్వయం చేస్తున్నారని తెలిపింది. అంతకు ముందు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఇరాన్‌కు గట్టి హెచ్చరిక చేశారు. >>2

## వ్యవసాయ కుంటలో పడి ముగ్గురు విద్యార్థులు మృతి

### ఆ తల్లి రోదన వర్ణనాతీతం

### ముచ్చర్లపల్లిలో విషాద ఛాయలు

**ఊర్కొండ, జనవరి 25 ప్రభాతవార్త:** నవ మాసాలు మోసి కంటికి రెప్పలా కాపాడుకొని తమ పిల్లల జీవితాలలో వెలుగును నింపి ప్రయోజకులను చేయాలనే లక్ష్యంతో ఏ కష్టం తెలవకుండా అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న పిల్లలు కళ్ళముందే విఘాత జీవులుగా పడి ఉండడం చూసిన ఆ తల్లి రోదన వర్ణనాతీతం. ముగ్గురు పిల్లలు ఒకేసారి విగాత జీవులుగా మారడంతో ఇంకా మేము ఎవరికోసం బ్రతకాలి మాకు ఈకష్టం ఎందుకు ఇచ్చావు దేవుడా >>2

## ఉపాధిపథకం మార్చొద్దు

### మహిళల హక్కులను కాలరాస్తున్న బిజెపి, ఆర్ఎస్ఎస్‌ను తరిమికొట్టాలి

### ఐద్వా బహిరంగసభలో మాజీ ఎంపి బృందాకరత్

### కార్పొరేట్లకు అనుకూలంగా ఉన్న బిజెపి విధానాలు: సంస్థ జాతీయ అధ్యక్షురాలు పికె శ్రీమతి

**హైదరాబాద్, ప్రభాతవార్త, జనవరి 25:** దేశంలోని మహిళల హక్కులను కాలరాస్తున్న బిజెపి, ఆర్ఎస్ఎస్‌లను తరిమికొట్టాలని మాజీ ఎంపి బృందా కరత్ మహిళలకు పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు ఉపాధి కల్పిస్తున్న జాతీయ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) 14వ జాతీయ మహాసభలు ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభకాగా.. సాయంత్రం బస్ భవన్ గ్రౌండ్‌లో మహిళలతో భారీ బహిరంగ సభను నిర్వహించింది. బహిరంగ సభలో మాజీ ఎంపి, ఐద్వా నేషనల్ ప్యాట్రన్ అయిన బృందాకరత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బహిరంగలో ఐద్వా జాతీయ అధ్యక్షురాలు పికె శ్రీమతి, జాతీయ ప్రధాన కార్యదర్శి మరియ ధావలే, జాతీయ ఉపాధ్యక్షురాలు సుభాషిణి అలీ, జాతీయ కోశాధికారి ఎస్ పుణ్యవతి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్ అరుణ జ్యోతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మీతోపాటు ఐద్వా జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు, 14వ జాతీయ మహాసభల ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పాల్గొన్నారు. బహిరంగ సభలో బృందా కరత్ మాట్లాడుతూ.. >>2



ఆదివారం ఐద్వా బహిరంగసభలో నినాదాలు చేస్తున్న బృందాకరత్ తదితరులు

## ఇఎస్‌హెచ్‌ఎస్‌గా వైద్య విధాన పరిషత్!

### బడ్జెట్ సమావేశాల్లో బిల్లు పెట్టనున్న రాష్ట్ర సర్కార్

**హైదరాబాద్, ప్రభాతవార్త, జనవరి 25:** రాష్ట్రంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్(టివివిపి)లో పని చేస్తున్న ఉద్యోగులకు మంచి భవిష్యత్ రాబోతోంది. వారికి కూడా ఇకపై 010 పద్దుకింద వేతనాలు పొందే అవకాశం ఏర్పడనుంది. ఇందుకు సంబంధించిన చర్యలను ప్రభుత్వం ప్రారంభించినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం సొసైటీ పరిధిలో ఉన్న టివివిపిని డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ (డిఎస్‌హెచ్‌ఎస్)గా మార్చడానికి ప్రభుత్వం సిద్ధపడుతోంది. ఇందుకు సంబంధించి వైద్య, ఆరోగ్య శాఖ తగినప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించింది. వైద్య విధాన పరిషత్‌ను డిఎస్‌హెచ్‌ఎస్‌గా మార్చాలంటే చట్టం చేయాల్సిన అవసరం ఉన్నందున.. వైద్య, ఆరోగ్య శాఖ పంపించిన ప్రతిపాదనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం రానున్న బడ్జెట్ సమావేశాల్లో అసెంబ్లీలో బిల్లు పెట్టడం కోసం సిద్ధమైనట్టు తెలుస్తోంది. అసెంబ్లీలో బిల్లు ఆమోదం పొంది చట్టం వస్తే.. టివివిపి కింద జిల్లా పనిచేస్తున్న 184 ఏరియా ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలల్లో పనిచేస్తున్న 12,589 మందికి లబ్ధి చేకూరనుంది. ఇప్పటికే ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను >>2

# 'పద్మ' విజేతలు

**పద్మ విభూషణ్**
ధర్మేంద్ర సింగ్ డియోల్ (మహారాష్ట్ర)
కెటి థామస్ (కేరళ)
ఎన్ రాజన్ (ఉత్తర్‌ప్రదేశ్)
పి నారాయణన్ (కేరళ)
విఎస్ అచ్యుతానందన్ (కేరళ)

**పద్మభూషణ్**
అల్కా యగ్నిక్ (మహారాష్ట్ర)
భగత్ సింగ్ కోశ్యారి (ఉత్తరాఖండ్)
కల్లిపాటి రామసామి పళనిస్వామి (తమిళనాడు)
మమ్ముట్టి (కేరళ)
నోరి దత్తాత్రేయ (అమెరికా)
పియూష్ పాండే (మహారాష్ట్ర)
ఎస్‌కెఎం మైలనందన్ (తమిళనాడు)
శతావధాని ఆర్ గణేశ్ (కర్ణాటక)
శిబూసోరేన్ (జార్ఖండ్)
ఉదయ్ కొటక్ (మహారాష్ట్ర)
వికె మల్హోత్రా (ఢిల్లీ)
వెల్లపల్లి నటేశన్ (కేరళ)
విజయ్ అమృత్‌రాజ్ (అమెరికా)

**పద్మశ్రీ**
ఎఇ ముథునయగమ్ (కేరళ)
అనిల్ కుమార్ రస్తోగి (ఉత్తర్‌ప్రదేశ్)
అంకే గౌడ ఎం. (కర్ణాటక)
అర్మిడా ఫెర్నాండెజ్ (మహారాష్ట్ర)
అర్వింద్ వైద్య (గుజరాత్)
అశోక్ ఖడే (మహారాష్ట్ర)
అశోక్ కుమార్ సింగ్ (ఉత్తర్‌ప్రదేశ్)
అశోక్ కుమార్ హాల్దార్ (పశ్చిమబెంగాల్)
బల్‌దేవ్ సఇంగ్ (పంజాబ్)
భగవాన్‌దాస్ రాయిక్వర్ (మధ్యప్రదేశ్)
భరత్ సింగ్ భారతి (బీహార్)
భిక్ల్యా లడక్యా ధిండా (మహారాష్ట్ర)
బిశ్వ బంధు (బీహార్)
బ్రిజ్ లాల్ భట్ (జమ్మూకాశ్మీర్)
బుద్ధా రష్మి మణి (ఉత్తర్‌ప్రదేశ్)
డాక్టర్ బుధ్రి తటి (ఛత్తీస్‌గఢ్)
చంద్రమౌళి గడ్డమనుగు (తెలంగాణ)
చరణ్ హెంబ్రమ్ (ఒడిశా)
చిరంజి లాల్ యాదవ్ (ఉత్తర్‌ప్రదేశ్)
దీపికా రెడ్డి (తెలంగాణ)
ధార్మికలాల్ చునిలాల్ పాండ్యా (గుజరాత్)
గద్దె బాబు రాజేంద్రప్రసాద్ (ఆంధ్రప్రదేశ్)
గఫ్రుద్దీన్ మీవాటి జోగి (రాజస్థాన్)
గంభీర్ సఇంగ్ యోన్‌జోన్ (పశ్చిమబెంగాల్)
గరిమెళ్ల బాలక్రిష్ణ ప్రసాద్ (ఆంధ్రప్రదేశ్)
గాయత్రి బాలసుబ్రమణియన్, రంజని బాలసుబ్రమణియన్ (తమిళనాడు)
గోపాల్ జీ త్రివేది (బీహార్)
గూడూరు వెంకట్‌రావు (తెలంగాణ)
హెచ్‌వి హండే (తమిళనాడు)
హాల్లీ వార్ (మేఘాలయ)
హరీ మాధబ్ ముఖోపాధ్యాయ (పశ్చిమబెంగాల్)
హరిచరణ్ సైకియా (అసోం)
హర్మన్‌ప్రీత్ కౌర్ భుల్లార్ (పంజాబ్)
ఇంద్రజిత్ సింగ్ సింధు (చండీఘర్)
జనార్దన్ బాపురావు బోథే (మహారాష్ట్ర)
జోదేష్ డియురి (అసోం)
జుజెర్ వాసి (మహారాష్ట్ర)
జ్యోతిష్ దేబ్‌నాథ్ (పశ్చిమబెంగాల్)
కె.పజనీవెల్ (పుదుచ్చేరి)
కె.రామసామి (తమిళనాడు)
కె.విజయ్ కుమార్ (తమిళనాడు)
కబీంద్ర పుర్కయస్థ (అసోం)
కైలాస చంద్ర పంత్ (మధ్యప్రదేశ్)
కలమండలం విమల మీనన్ (కేరళ)
కెవాల క్రిష్ణన్ థక్రల్ (ఉత్తర్‌ప్రదేశ్)
ఖేమ్ రాజ్ సుంద్రియాల్ (హర్యానా)
కొల్లకల్ దేవకి అమ్మ జి (కేరళ)
కృష్ణమూర్తి బాలసుబ్రమణియన్ (తెలంగాణ)
కుమార్ బోస్ (పశ్చిమబెంగాల్)
కుమారసామి థంగరాజ్ (తెలంగాణ)
ప్రొఫెసర్ లార్స్-క్రిస్టియన్ కోచ్ (జర్మనీ)
లియుడ్‌మిలా విక్టోరోవ్న ఖోఖ్లోవ (రష్యా)
మాధవన్ రంగనాథన్ (మహారాష్ట్ర)
మాగంటి మురళీమోహన్ (ఆంధ్రప్రదేశ్)
మహేంద్రకుమార్ మిశ్రా (ఒడిశా)
మహేంద్రనాథ్ రాయ్ (పశ్చిమబెంగాల్)
మామిడాల జగదీష్ కుమార్ (ఢిల్లీ)
మంగళ కపూర్ (ఉత్తర్‌ప్రదేశ్)
మిర్ హాజిభాయ్ కసమ్‌భాయ్ (గుజరాత్)
మోహన్ నగర్ (మధ్యప్రదేశ్)
నారాయణ్ వ్యాస్ (మధ్యప్రదేశ్)
నరేష్ చంద్ర దేవ్ వర్మ (త్రిపుర)
నీలేష్ వినోద్‌చంద్ర మండ్లేవాలా (గుజరాత్)
నురుద్దీన్ అహ్మద్ (అసోం)
ఉథువార్ తిరుథణి స్వామినాథన్ (తమిళనాడు)
డాక్టర్ పద్మ గుర్మీత్ (లడఖ్)
పాల్కొండ విజయ్ ఆనంద్ రెడ్డి (తెలంగాణ)
పొఖిల లెక్థెపి (అసోం)
డాక్టర్ ప్రభాకర్ బసవప్రభు కొరె (కర్ణాటక)
ప్రతీక్ శర్మ (అమెరికా)
ప్రవీణ్ కుమార్ (ఉత్తర్‌ప్రదేశ్)
ప్రేమ్ లాల్ గౌతమ్ (హిమాచల్‌ప్రదేశ్)
ప్రొసెన్‌జిత్ ఛటర్జీ (పశ్చిమబెంగాల్)
డాక్టర్ పుణ్యమూర్తి నటేశన్ (తమిళనాడు)
ఆర్.కృష్ణన్ (తమిళనాడు)
ఆర్‌విఎస్ మణి (ఢిల్లీ)
రబిలాల్ తుడు (పశ్చిమబెంగాల్)
రఘుపత్ సింగ్ (ఉత్తర్‌ప్రదేశ్)
రఘువీర్ తూకారామ్ ఖేడ్కర్ (మహారాష్ట్ర)
రజాస్తాపథి కలియప్ప గౌండర్ (తమిళనాడు)
రాజేంద్రప్రసాద్ (ఉత్తర్‌ప్రదేశ్)
రమారెడ్డి మామిడి (తెలంగాణ)
రామమూర్తి శ్రీధర్ (ఢిల్లీ)
రామచంద్ర గాడ్‌బోలే-సునీత గాడ్‌బోలె (ఛత్తీస్‌గఢ్)
రతిలాల్ బొరిసాగర్ (గుజరాత)
రోహిత్ శర్మ (మహారాష్ట్ర)
ఎస్‌జి సుశీలమ్మ (కర్ణాటక)
సంగ్‌యుసంగ్ ఎస్ పొన్‌గేనర్ (నాగాలాండ్)
నిరంజన్ దాస్ (పంజాబ్)
శరత్‌కుమార్ పాత్ర (ఒడిశా)
సరోజ్ మండల్ (పశ్చిమబెంగాల్)
సతీష్ షా (మహారాష్ట్ర)
సత్యనారాయణ్ నువాల్ (మహారాష్ట్ర)
సవిత పునియా (హర్యానా)
ప్రొఫెసర్ షఫీ షౌఖ్ (జమ్మూకాశ్మీర్)
శశి శేఖర్ వెంపాటి (కర్ణాటక)
శ్రీరంగ్ దేవబ లాడ్ (మహారాష్ట్ర)
శుభ వెంకటేశా అయ్యంగార్ (కర్ణాటక)
శ్యాంసుందర్ (ఉత్తర్‌ప్రదేశ్)
సిమాంచల్ పాత్రో (ఒడిశా)
శివశంకరి (తమిళనాడు)
డాక్టర్ సురేష్ హానగవడి (కర్ణాటక)
స్వామి బ్రహ్మదేవ్ జి మహారాజ్ (రాజస్థాన్)
టిటి జగన్నాథన్ (కర్ణాటక)
తగరామ్ భీల్ (రాజస్థాన్)
తరుణ్ భట్టాచార్య (పశ్చిమబెంగాల్)
టెకి గుబిన్ (అరుణాచల్ ప్రదేశ్)
తిరువారుర్ భక్తవత్సలం (తమిళనాడు)
త్రిపాఠి ముఖర్జీ (పశ్చిమబెంగాల్)
వీజినాథన్ కామకోటి (తమిళనాడు)
వెంపటి కుటుంబ శాస్త్రి (ఆంధ్రప్రదేశ్)
వ్లాదిమిర్ మెస్ట్‌విరిసిల్లీ (జార్జియా)
యుమ్నమన్ జత్రా సింగ్ (మణిపూర్)



రిపబ్లిక్ డే సందర్భంగా ఆదివారం రాత్రి విద్యుత్ దీపకాంతుల్లో మెరిసిపోతున్న సచివాలయం

## 'దే' భద్రత

>> తరువాత కూడా రెండు మూడు రోజుల పాటు భద్రతా ఏర్పాట్లను కొనసాగించాలని, అపరిచితులను, గతంలో ఉగ్రవాద సంస్థలతో సంబంధం కలిగివున్న వారిని ఓ కంట కనిపెట్టాలని కేంద్ర హోంశాఖ పేర్కొ నడంతో అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈసారి డ్రోన్ల ద్వారా ఉగ్రవాదులు దాడులకు దిగే వీలుండడంతో గ గనతలంపైనా నిఘా పెంచారు. పేలుడు పదార్థాలను కనుగొనేందుకు శిక్షణ పొందిన జాగిలాలను రంగంలో దించారు. రన్‌వే ప్రాంతం, కార్గో సర్వీసు విభాగంతో పాటు విమానాశ్రయ సిబ్బందిని కూడా తనిఖీ చేశాకే అనుమతిస్తున్నారు. దీంతో పాటు గతంలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలుగా వున్న జిల్లాలలోనూ భద్రతను పెంచారు. ఇటీవల రాష్ట్రంలో పలుచోట్ల నక్సలైట్ల షెల్టర్ జోన్‌లు వెలుగు చూడడంతో ఆయా ప్రాంతాలలో తనిఖీలు ముమ్మరం చేశారు.

# విరిసిన 'పద్మా'లు

>> నందన్ (రాజకీయం), బాలీవుడ్ దివంగత నటుడు ధర్మేంద్ర (కళా రంగం), కెటి థామస్ (ప్రజా సంబంధాలు), నారాయణన్ (రచయిత), ఎన్.రాజమ్ (కళ)లకు పద్మవిభూషణ్ వరించింది.

మలయాళ నటుడు మమ్ముట్టి, ప్రముఖ కేన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు, ఝార్ఖండ్ మాజీ సిఎం శిబు సోరెన్ (మరణానంతరం), అద్మాన్ పియూష్ పాండే (మరణానంతరం), కోటక్ మహీంద్రా బ్యాంక్ వ్యవస్థాపకుడు ఉదయ్ కోటక్, సింగర్ అల్కా యాజ్ఞిక్, మాజీ టెన్నిస్ క్రీడాకారుడు విజయ్ అమృత్‌రాజ్, మహారాష్ట్ర మాజీ గవర్నర్ భగత్ సింగ్ కోష్యారీ, ప్రముఖ కేరళ సామాజిక నేత, ఎస్‌ఎన్‌డీపీ యోగం సుప్రీం వెల్లపల్లి నటేషన్, బిజెపి మాజీ ఎంపి వికె మల్హోత్రాలను పద్మభూషణ్‌లకు ఎంపిక చేసింది. క్రికెటర్ రోహిత్ శర్మ, హర్మీన్‌ప్రీత్ కౌర్‌లకు పద్మశ్రీ వరించింది. అవార్డు విజేతల్లో మారుమూల, వెనుకబడిన ప్రాంతాలు సహా వివిధ ప్రాంతాలకు చెందినవారు. దశాబ్దాలుగా అట్టడుగు స్థాయిలో పనిచేశారు. ఆరోగ్య సంరక్షణ, విద్య, జీవనోపాధి కల్పన, పారిశుద్ధం, పర్యావరణ స్థిరత్వం, సంప్రదాయ కళలు, వారసత్వ పరిరక్షణ వంటి రంగాల్లో సేవలు అందించారు. పద్మ అవార్డులను అందుకోనున్న వారిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన 11 మంది ఉన్నారు. మామిడి రామారెడ్డి (పాడి, పశు సంవర్ధక విభాగంలో సేవలు), కళా విభాగంలో టాలీవుడ్ నటులు మాగంటి మురళీ మోహన్, రాజేంద్ర ప్రసాద్, తెలంగాణకు చెందిన దీపికా రెడ్డి, సాహిత్యంలో వెంపటి కుటుంబశాస్త్రి(ఎపి), విజయ్ ఆనంద్ రెడ్డి, గడ్డిమానుగు చంద్రమోళి (తెలంగాణ), సంగీత కళాకారుడు, గతేడాది కన్నుమూసిన టిటిడి మాజీ విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్‌కు మరణానంతరం పద్మశ్రీ దక్కింది. యుజిసి మాజీ ఛైర్మన్, నల్లగొండ జిల్లాకు చెందిన మామిడాల జగదీష్ కుమార్ (ఢిల్లీ), సిసిఎంబి శాస్త్రవేత్త డాక్టర్ కుమారస్వామి తంగరాజ్ (తమిళనాడు)ను జన్యసంబంధిత పరిశోధనలకు గానూ పద్మశ్రీ అవార్డులు వరించాయి.

## భారత వ్యోమగామి శుభాంశు శుక్లాకు అకోశ చక్ర

**న్యూఢిల్లీ, జనవరి 25:** భారత వ్యోమగామి శుభాంశు శుక్లాకు భారత సైనిక పురస్కారం అశోక చక్రను ప్రకటించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు పలు జాతీయ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఈ నెల 26న ఢిల్లీలో జరగనున్న గణతంత్ర వేడుకల్లో ఈ అవార్డు ప్రదానం చేయనున్నట్లు జాతీయ మీడియా పేర్కొంది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి వెళ్లిన తొలి భారతీయ వ్యోమగామిగా శుభాంశు శుక్లా రికార్డు సృష్టించిన నేపథ్యంలో భారత ప్రభుత్వం శుక్లాకు ఈ పురస్కారాన్ని ప్రకటించినట్లు తెలుస్తోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. గత ఏడాది నిర్వహించిన యాక్సియం 4 మిషన్‌లో భాగంగా భారత వ్యోమగామి శుభాంశు శుక్లా విజయవంతంగా అంతరిక్ష యాత్ర పూర్తి చేసిన విషయం తెలిసిందే. యాక్సిఎం 4 మిషన్‌లో భాగంగా పెగ్గీ విట్సన్, స్లావోస్జ్ ఉజ్నాన్స్‌కి - విస్నియెస్కీ, టిబర్ కపు లతో కలిసి ఐఎస్‌ఎస్‌కు వెళ్లిన శుభాంశు అంతరిక్షంలో అనేక ప్రయోగాలు చేశారు. ఖగోళంలోని జీరో గ్రావిటీ పరిస్థితుల్లో మానవ కండరాలకు కలిగేనష్టంపై అధ్యయనంచేశారు. ఖగోళంలో మానవ జీర్ణవ్యవస్థ ఎలా పనిచేస్తుందన్న అంశంపై ఒక వీడియోను చిత్రీకరించారు.

## ముగ్గురు విద్యార్థులు మృతి

>> అంటూ విలపిస్తుండడంతో ఆ తల్లిదండ్రుల రోధన పలువురిని కంటతడి పెట్టించాయి. ఇదంతా నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండ మండల పరిధిలోని ముచ్చర్లపల్లి గ్రామంలో ఆదివారం అత్యంత విషాదకర సంఘటన చోటుచేసుకుంది. సాగునీటి కోసం పొలంలో తవ్విన కుంటలో పడి ముగ్గురు విద్యార్థులు మృత్యువాత పడ్డారు. మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో గ్రామంలో శోకసంద్రం నెలకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ముచ్చర్లపల్లికి చెందిన శ్రీకాంత్ రెడ్డి కుమార్తె సిరి (14), కుమారుడు శ్రీమన్యు (14), శ్రీకాంత్ రెడ్డి అక్క కుమార్తె స్నేహ (16)లు ప్రమాదవశాత్తు వ్యవసాయ కుంటలో పడిపోయారు. శ్రీకాంత్ రెడ్డి హైదరాబాద్ లోని తుర్కయంజాల్‌లో నివసిస్తున్నారు. తన అక్క చంద్రకళ రావిర్యాలలో ఉంటారని, శ్రీకాంత్ రెడ్డి అమ్మ అనారోగ్యంతో ఉందని తెలియగా చూడటానికి వచ్చి పొలం వద్దకు వెళ్లారని అంతలోనే ఇంతటి ఘోరం చోటు చేసుకుంటున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## పద్మ పురస్కారాలకు ఎంపికైన వారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి25:** పద్మ భూషణ్, పద్మశ్రీ పురస్కారాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఎంపికైన వారికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణులు నోరి దత్తాత్రేయుడు పద్మ భూషణ్, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగం నుంచి గడ్డమణుగు చంద్రమౌళి, కృష్ణమూర్తి బాలసుబ్రహ్మణ్యన్, కుమారస్వామి తంగరాజ్, వైద్య రంగంలో గూడూరు వెంకట్ రావు, పాల్కొండ విజయానంద్ రెడ్డి, పశుసంవర్ధక రంగంలో మామిడి రామా రెడ్డి, కళా రంగం నుంచి దీపికా రెడ్డి, మురళీ మోహన్, రాజేంద్ర ప్రసాద్, గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ లకు పద్మశ్రీ పురస్కారాలు దక్కడంపై ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు. పద్మ పురస్కారాలకు ఎంపికైన వారిని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఘనంగా సన్మానించనున్నారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పర్యటన ముగించుకొని రాష్ట్రానికి వచ్చిన తర్వాత పద్మ పురస్కారాలకు ఎంపికైన వారిని ఘనంగా సన్మానించనున్నారు.

## సిఎం రేవంత్ రెడ్డి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు

**.369ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జనవరి25:** తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజాస్వామిక, గణతంత్ర, లౌకిక, సామ్యవాద, సార్వభౌమ దేశంగా భారత దేశం ప్రగతి పథంలో దూసుకెళ్లాలని... అందుకు ఆధారమైన రాజ్యాంగం అమల్లోకి వచ్చిన జనవరి 26వ తేదీ దేశ ప్రజలందరికీ పండుగ వంటిదని సీఎం పేర్కొన్నారు. జాతీయోద్యమ నాయకులు, రాజ్యాంగ నిర్మాతలు ఆకాంక్షలకు అనుగుణంగా అనేక అభివృద్ధి, సంక్షేమ, ప్రజాహిత కార్యక్రమాలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందని సీఎం తెలియజేశారు.

# టెన్నిస్ స్టార్ విజయ్‌కు పద్మభూషణ్
## రోహిత్ శర్మ, హార్మన్‌ప్రీత్‌లకు పద్మశ్రీలు





**హైదరాబాద్, జనవరి 25, ప్రభాతవార్త :** దేశాభివృద్ధిలో వివిధ రంగాలలో విశేష కృషి చేసిన వారికి ఇచ్చే పద్మ పురస్కారాల్లో ఈ ఏడాది క్రీడాకారులకు పెద్దపీట వేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మ పురస్కారాలలో భారత క్రికెట్ జట్టుకు ఎన్నో చిరస్మరణీయ విజయాలను అందించిన రోహిత్ శర్మ, మహిళల టీమిండియా కెప్టెన్ హార్మన్ ప్రీత్ కౌర్ లకు పద్మశ్రీ అవార్డులకు ఎంపికయ్యారు. అలాగే భారత టెన్నిస్ దిగ్గజం, టెన్నిస్ కోర్టులో భారతదేశ కీర్తిని దశదిశలా చాటిన విజయ్ అమృత్‌రాజ్‌కు దేశ మూడవ అత్యున్నత పౌర పురస్కారమైన పద్మభూషణ్ లభించింది. పద్మభూషణ్ అనేది భారతదేశపు మూడవ అత్యున్నత పౌర పురస్కారం కాగా, పద్మశ్రీ నాల్గవ స్థానంలో ఉంటుంది. మాజీ టెన్నిస్ స్టార్ విజయ్ అమృత్‌రాజ్ భారత క్రీడారంగానికి అందించిన సేవలకు గుర్తింపుగా గతంలోనే పద్మశ్రీ (1983), అర్జున అవార్డు (1974) అందుకున్నారు. అలాగే రోహిత్ శర్మ, హర్మన్‌ప్రీత్ కౌర్‌లతో పాటు, భారత మాజీ పేసర్ ప్రవీణ్ కుమార్, మహిళల హాకీ జట్టు గోల్ కీపర్ సవితా పునియా కూడా పద్మశ్రీ పురస్కారానికి ఎంపికయ్యారు. అలాగ బలదేవ్ సింగ్, భగవాన్ దాస్ రైక్వార్ మరియు కె. పజనివెల్‌లు కూడా క్రీడారంగంలో సాధించిన విజయాలకు గాను ఈ గౌరవాన్ని పొందారు. ఈ పురస్కారాలు 2026 అందుకున్న క్రీడాకారుల్లో విజయ్ అమృత్‌రాజ్‌కు పద్మభూషణ్, రోహిత్ శర్మ, హార్మన్‌ప్రీత్ కౌర్ భుల్లర్, బలదేవ్ సింగ్, భగవాన్ దాస్ రైక్వార్, కె. పజనివెల్, ప్రవీణ్ కుమార్, సవితా పునియాలకు పద్మశ్రీ అవార్డులు లభించాయి.

## గెలుపు ఖాయం

>> ఆయన స్పష్టం చేశారు.పార్టీ నిర్వహిస్తున్న సర్వేల ఆధారంగా టికెట్లు ఖరారు చేస్తామని ఆయన ప్రకటించారు.సర్వేతో పాటువిధేయత,చిత్తశుద్ధి, క్రమశిక్షణల ప్రాతిపదికన అభ్యర్థుల ఎంపిక ఉంటుందని ఆయన తెలిపారు.అదే సమయంలో అవకాశం రాని వారికి ప్రత్యమ్నాయ అవకాశాలు కల్పిస్తామని ఆయన భరోసా ఇచ్చారు.పార్టీ కోసం శ్రమించే ప్రతీ ఒక్కరికీ అండగా ఉంటామని ఆయన చెప్పారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందంటేనే అది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల శ్రమతోటే అని ఆయన అన్నారు.పార్టీ గెలుపులో భాగస్వామ్యం అయిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు.పట్టణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.జరుగుతున్న అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేసి పట్టణ ప్రాంతాలలో మెరుగైన అభివృద్ధి జరుపుతామని ఆయన చెప్పారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మీదట జరుగుతున్న అభివృద్ధి అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలను విరివిగా ప్రజల్లోకి తీసుకెడితే పురపాలక సంఘం ఎన్నికల్లో విజయదుందుభి మ్రోగిస్తామని ఆయన కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఉద్బోధించారు.అర్హులైన నిరుపేదలకు యావత్ భారత దేశంలోనే మొట్టమొదటి సారిగా నాణ్యమైన సన్నబియ్యం ఉచితంగా అందిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు.గతంలో ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా దొడ్డు బియ్యం పంపిణీ చేసినప్పుడు ఆ బియ్యం వినియోగించేందుకు ప్రజలు ఇష్ట పడక పోగా వాటిని అమ్ముకునే వారని ఆయన చెప్పారు.దొడ్డు బియ్యం ప్రజలు వినియోగించుకోక పోగా పక్కదారి పట్టి అనేక అక్రమాలు జరిగేవని ఆయన చెప్పారు.అటువంటి అవకతవకలకు చెక్ పెట్టడంతో పాటు రాష్ట్రంలోని 85శాతం ప్రజలకు 13,600 కోట్ల వ్యయంతో ఉచితంగా సన్నబియ్యం అందించిన విప్లవాత్మక నిర్ణయం కాంగ్రెస్ పార్టీదే అన్నారు.ఒక్క నిజమాబాద్ కార్పొరేషన్ పరిధిలోనే 18,000 మంది లబ్ధిదారులకు సన్నబియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నామని ఆయన తెలిపారు.నిరుపేదల కడుపు నింపేందుకు ఉద్దేశించబడిన నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ ఉచితంగా అందిస్తున్న అంశం తనకెంతో తృప్తి నిచ్చిందని ఆయన చెప్పారు.

# నారీశక్తితో దేశ వికాసం

>> లిఖించారు. గత సంవత్సరం చెస్ ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ ఇద్దరు భారతీయ మహిళల మధ్య జరిగింది. ఈ ఉదాహరణలు క్రీడా ప్రపంచంలో భారత్‌కు చెందిన నారీమణుల ఆధిపత్యానికి నిదర్శనం. దేశ ప్రజలు వారిని చూసి గర్విస్తున్నారు. పంచాయతీ రాజ్ సంస్థలలో మహిళా ప్రతినిధుల సంఖ్య దాదాపు 46 శాతంగా ఉంది. మహిళల రాజకీయ సాధికారతను మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లేందుకు నారీ శక్తి వందన్ అధినియం మరింత బలాన్ని ఇస్తుందని హర్షంప్రకటించారు. వికసిత భారత్ నిర్మాణంలో నారీ శక్తి పాత్ర కీలకమైనదని పేర్కొంటూ జాతీయ ఓటర్ల దినోత్సవ ప్రాముఖ్యతను ప్రజలు గుర్తించాలని సూచించారు. దేశ ప్రజలకు ఓటు హక్కు అనేది రాజ్యాంగం ప్రసాదించిన వరమని, తమ ఓటుహక్కును వినియోగించుకోవడం ద్వారా రాజకీయ అవగాహన కూడా పెరుగుతుందని అన్నారు. ఇటీవలి ఎన్నికల్లో మహిళల భాగస్వామ్యం గణనీయంగాపెరిగిందన్నారు. మహిళల సర్వోతముఖాభివృద్ధికి ప్రభుత్వం ఎనలేని కృషిచేస్తోందని, బేటీ పడావో పేటా బచావోనుంచి రిజర్వేషన్లవరకూ మహిళలప్రాతినిధ్యం పెరిగిందన్నారు. 57 కోట్ల జన్‌ధన్‌ఖాతాలు మహిళల్లో పెరుగుతున్న స్వయంసమృద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. వ్యవసాయం నుంచి అంతరిక్షం వరకూ అన్ని రంగాల్లోను మహిళల భాగస్వామ్యం పెరిగిందన్నారు. పంచాయతీ రాజ్ సంస్థల్లో మహిళల వాటా 56శాతానికి పెరిగిందని, నారిశక్తి వందన్ అధినియంతో మహిళల సాధికారతకు మరింత ప్రాధాన్యం పెరిగిందన్నారు. అణగారిన వర్గాల సంక్షేమానికి జన్‌జాతీయ గౌరవ్‌దివస్ జరుపుకుంటున్నామని అన్నారు. భగవాన్ బిర్సా ముండా 150వ జయంతిరోజును ఈ ప్రత్యేక దివస్ నిర్వహిస్తున్నామన్నారు. వైద్యఆరోగ్యపరంగా దేశంలో రక్తహీనతను తగ్గించేందుకు, సికెల్‌సెల్ అనీమియా నిర్మూలన మిషన్‌కింద ఆరుకోట్ల స్క్రీనింగ్స్ పూర్తిచేసుకోగలిగామన్నారు. పీఎం జన్‌మాన్‌యోజన, ధర్తీ, ఆబా జన్‌జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ వంటి పథకాలు గిరిజన నిమ్నజాతుల అభ్యునతికి నిర్దేశించినవేనని రాష్ట్రపతి పేర్కొన్నారు. ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటివారు అన్నదాతలని వారి కృషితోనే ఆహారోత్పత్తుల్లో స్వయం సమృద్ధిని సాధించామని గుర్తుచేసారు. దేశంలో 81 కోట్లమందికి అంత్యోదయ పథకం కింద పిఎం గరీబ్‌కల్యాణ్ అన్నయోజన అమలుచేస్తున్నట్లు తెలిపారు. నాలుగు కోట్ల పక్కాగృహాల నిర్మాణం, నిరుపేదలకు మంచినీరు, విద్యుత్, ఇతర ప్రాథమిక వసతులన్నీ ఒనగూరుతున్నాయన్నారు. మహాత్మా గాంధీ నిర్దేశించిన సర్వోదయ స్ఫూర్తితోనే ఈపథకాలు కొనసాగుతున్నాయన్నారు. యువతలో నైపుణ్యాభివృద్ధికి మేరా యువభారత్ లేదా మై భారత్ వంటివి శాస్త్రసాంకేతికరంగాల్లో యువతలోని నైపుణ్యాన్ని మరింత మెరుగుపుస్తున్నాయన్నారు. 2047 నాటికి వికసిత్‌భారత్ లక్ష్యసాధనలో యువత కీలక భూమిక పోషించనున్నదని ద్రౌపది ముర్ము తెలిపారు. జ్ఞానభారతం మిషన్‌తో మన సాంప్రదాయ వనరులైన ఫిలాసఫీ, మెడిసిన్, జ్యోతిషం, గణితం, సాహిత్యం, కళలు వంటి వాటిని భద్రపరుచుకుంటున్నామని ఆమె అన్నారు. భారత రాజ్యాంగంపై అవగాహన మరింత పెంచేందుకుగాను ప్రస్తుతం అన్ని భారతీయ భాషాల్లోను రాజ్యాంగప్రతులను అందుబాటులోకి తెచ్చామని ఆమె అన్నారు. దీనితో రాజ్యాంగంపై పూర్తి అవగాహనతోపాటు జాతీయతాభావం మరింతపెరుగుతుందన్నారు. ప్రభుత్వం ప్రజలకు మధ్య అంతరాలు పెరగకూడదని, వారధిగానే ఉండాలన్నారు. ఇందుకోసమే అనవసర చట్టాలు అనేకం రద్దు కావించామని, అనేక లొసుగులున్న బిల్లులను కూడా నిర్మూలించామన్నారు. ప్రజోపయోగకరంగా మారేందుకు చట్టాలను మరింత సరళీకృతంచేసినట్లు రాష్ట్రపతి పేర్కొన్నారు. వికసిత్‌భారత్ లక్ష్యసాధనలోభాగంగానే డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. ప్రపంచంలోని డిజిటల్ లావాదేవీల్లో 50శాతం భారత్‌లోనే కొనసాగుతున్నాయన్నారు. ఆపరేషన్ సింధూర్‌తో గత ఏడాది మనం శతృవులకు మన సత్తాను చూపించామని, అనేకమంది ఉగ్రవాదులు ఉనికినే కోల్పోయారని అన్నారు. రక్షణరంగంలో మన స్వయం సమృద్ధి అనడానికి ఆపరేషన్ సింధూర్ నిదర్శనమన్నారు. విలువైన పుడమితల్లి వనరులను భావితరాలకు మేలుచేసేవిధంగా సిద్ధంచేసామన్నారు.

## వారం - వర్జ్యం

26-01-2026, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం, శ్రావణ కార్తె
అష్టమి రా.9.15
అశ్వని మ.12.30
వర్జ్యం : రా.9.33-11.03
దు.మ.12.43-1.28
2) మ.2.59-3.44
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. గృహనిర్మాణ ఆలోచనలు సాగిస్తారు.

**వృషభం:** ప్రముఖులను కలుసుకొని ముఖ్యమైన విషయాలపై చర్చిస్తారు. ప్రయాణాలలో చికాకులు ఏర్పడతాయి.

**మిథునం:** ఆస్తి వివాదాలు పరిష్కారమైన లబ్ధిపొందుతారు. దీర్ఘకాలిక ఋణాలు తీరుతాయి.చిరకాల స్వప్నం నెరవేరే సమయం.

**కర్కాటకం:**ఎంతటి కార్యాన్నైనా దీక్ష పట్టుదలతో సాధిస్తారు. జీవిత భాగస్వామి సలహాలు తీసుకుంటారు.

**సింహం:**చేపట్టిన పనులు సాఫీగా సాగడతాయి. అవకాశాలు సద్వినియోగం చేసుకుంటారు. వస్త్రలాభం.

**కన్య :** సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి.

**తుల :** సన్నిహితుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**వృశ్చికం:**భాగస్వామ్య వ్యాపారాలు మినహా మూర్తి వ్యాపారాలు లాభాలబాటలో ఉంటాయి. స్త్రీలతో విభేదాలు రాకుండా జాగ్రత్త.

**ధనుస్సు:** చర్మ సంబంధ బాధలు కలుగకుండా జాగ్రత్తలు పాటించండి. రాజకీయరంగాల వారికి విదేశీ పర్యటనలు.

**మకరం:** జీవితాశయాన్ని ఏవిధంగా నయినా సరే సాధించాలని దృఢ నిర్ణయానికి వస్తారు.సోదర, సోదరీ వర్గంతో కలిసి ఇష్టాగోష్ఠి సాగిస్తారు.

**కుంభం:** మీ పరోక్షంలో జరుగుతున్న అన్ని పనులను కూడా గమనిస్తూ కఠినంగా ప్రవర్తిస్తారు. కళా, సినిమా రంగాలవారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది.

**మీనం :** సౌందర్య చిట్కాల పట్ల ఆకర్షితులవుతారు. సంతానాన్ని సక్రమమైన పంథాలో నడిపిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## ఇఎస్‌హెచ్‌ఎస్‌గా వైద్య విధాన పరిషత్!

>> వైద్య, ఆరోగ్య శాఖ ప్రభుత్వానికి సమర్పించగా.. ఆ ప్రతిపాదన ఫైల్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతకం చేసినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రాబోయే బడ్జెట్ సమావేశాల్లో బిల్లును ప్రతిపాదించే అవకాశం ఉన్నట్టు తెలిసింది. బిల్లు ఆమోదం పొందితే గత కొన్ని ఏళ్లుగా టివివిపి అధ్వర్యంలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది ఎదుర్కొంటున్న వేతనాలు, సేవా ప్రయోజనాల సమస్యలకు పరిష్కారం లభించనుంది. వైద్య, ఆరోగ్య శాఖ ప్రతిపాదించిన ఫైల్స్‌పై సిఎం సంతకం చేసిన నేపథ్యంలో బిల్లు డ్రాఫ్ట్, లీగల్ ఒపీనియన్ ప్రక్రియ పూర్తయితే కేబినెట్ ఆమోదానికి వెళ్తుంది. మిగిలిందని అధికారులు చెబుతున్నారు. టివివిపిని డిఎస్‌హెచ్‌ఎస్‌గా మార్చేందుకు అవసరమైన విధి విధానాలు ఎలా ఉండాలన్న అంశంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇప్పటికే అక్కడి వైద్య విధాన పరిషత్‌ను సెకండరీ హెల్త్ కేర్‌గా మార్చిన నేపథ్యంలో వారు రూపొందించిన మార్గదర్శకాలను ప్రభుత్వం అధ్యయనం చేస్తుంది. ఆయా మార్గదర్శకాలను పరిశీలించి తెలంగాణలో కూడా టివివిపిని డిఎస్‌హెచ్‌ఎస్‌గా మార్చాలని ఇక్కడ టివివిపిలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేస్తూ వస్తున్నారు.

## ఉపాధిపథకం మార్చొద్దు

>> దేశంలో మహిళలు హక్కులను కాలరాస్తున్న ఆర్ఎస్ఎస్, బీజేపీని తరిమికొట్టాలన్నారు. బీజేపీ భగావో.. దేశ్‌కో అదావో అని అన్నారు. ఆమె తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించి అందర్నీ అలరించారు. తెలంగాణ చరిత్ర మహిళా పోరాటాలకు ఎంతో స్ఫూర్తిదాయకమని చెప్పారు. సోమవారం 77వ గణతంత్ర దినోత్సవం జరుపుకోబోతున్నామని ఈ సందర్భంగా ప్రధాని మోడీ ప్రజల కోసం రాజ్యాంగానికి సెల్యూట్ చేయకుండా ఆర్ఎస్ఎస్‌కి సెల్యూట్ చేస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను రక్షించుకోవాలంటే బుల్డోజరు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే మాట్లాడుతూ .. దోపిడీ, అన్యాయాలపై తాము నిద్ర పోబోమనీ, దోపిడీకి పాల్పడే వారిని నిద్ర పోనివ్వబోమన్నారు. మహిళలకు ఉపాధి అవకాశాలు దొరకడం లేదనీ, ఆదాయం లేకుంటే ఆ కుటుంబం ఎలా జీవిస్తుందని ప్రశ్నించారు. జాతీయ అధ్యక్షురాలు పికె శ్రీమతి మాట్లాడుతూ.. కేరళ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు దేశానికే ఆదర్శమన్నారు. ఆ రాష్ట్రంలో అత్యంత పేదరికంలో ఉన్న 60,000 కుటుంబాలను ప్రభుత్వం సమర్థవంతంగా వారికి పలు సంక్షేమ పథకాలను అమలు చేసి పేదరికం నుంచి బయటికి తీసుకొచ్చిందన్నారు. ఇది ఇతర రాష్ట్రాల్లో ఎందుకు సాధ్యం కావడం లేదని ప్రశ్నించారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా, ప్రజాస్వామ్యం, సమానత్వం, స్త్రీ విముక్తి కోసం ఉద్యమించాలని ఆమె పిలుపునిచ్చారు. జాతీయ ఉపాధ్యక్షురాలు సుభాషిణీఅలీ మాట్లాడుతూ.. తెలంగాణలో భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం చిట్యాల ఐలమ్మ, మల్లు స్వరాజ్యం లాంటి వీరనారీమణులు జాగీర్దార్లు, జమీందార్లకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలనీ, లేదంటే తెలంగాణ నుంచి జంగ్ సైరన్ మోగిస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్ అరుణజ్యోతి మాట్లాడుతూ.. తెలంగాణ పోరాటాలకు పెట్టింది పేరనీ, ఆ వారసత్వాన్ని కొనసాగిస్తామనిఅన్నారు. మహిళా హక్కులను కాపాడుకునేందుకు మహాసభల్లో చర్చించి కార్యాచరణను రూపొందిస్తామన్నారు.

## బంకర్‌లోకి ఖమేనీ!

>> అమెరికన్ యుద్ధ నౌకల సమూహం మధ్యప్రాచ్యం వైపు వెళుతోందని ఆయన చెప్పారు. ఇరాన్‌పై చర్య తీసుకోవాలని తాను నిర్ణయించుకుంటే వెంటనే దాడులు చేసేలా మోహరింపు చేస్తున్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని అమెరికా నావికాదళ అధికారులు కూడా ధ్రువీకరించారు. అమెరికా ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ యుఎస్ఎస్ అబ్రహం లింకన్, అనేక గైడెడ్‌క్షిపణి డిస్ట్రాయర్లుతో ప్రస్తుతం హిందూ మహాసముద్రంలో మోహరించామని, రాబోయే రోజుల్లో మధ్యప్రాచ్యానికి వెళుతుందని వెల్లడించారు. అమెరికా హెచ్చరికకు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కమాండర్ జనరల్ మొహమ్మద్ పక్‌పూర్ కౌంటర్ ఇచ్చారు. ఖమేనీ ఆదేశాలను అమలు చేయడానికి ఇరాన్ దళాలు ట్రిగ్గర్‌పై వేలు పెట్టి, గతంలో కన్నా సిద్ధంగా ఉన్నాయన్నారు.



# పంజాగుట్టలో డ్రగ్స్‌ముఠా అరెస్ట్

## ఎండిఎంఎ, ఒజి స్వాధీనం

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జనవరి 25, ప్రభాతవార్త:** మాదకద్రవ్యాలు సరఫరా చేస్తున్న ఒక ముఠాను పంజాగుట్ట పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్‌తో కలిసి పంజాగుట్ట పోలీసులు నిర్వహించిన దాడుల్లో స్థానిక డ్రగ్ పెడ్లర్‌తోపాటు నలుగురు డ్రగ్ సబ్ పెడ్లర్లను అరెస్ట్ చేశారు. ఈ దాడుల్లో నిందితుల వద్ద నుంచి 10.5 గ్రాముల ఎండీఎంఏ, 7.5 గ్రాముల హైడ్రోపోనిక్ గంజాయి, ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో బీరంగూడ ప్రాంతంలో నివసిస్తూ డ్రైవర్‌గా పనిచేసే కటంగూర్ మహన్ రెడ్డి అలియాస్ మహన్ (28), అమెజాన్ క్యాట్‌లాగ్ అసిస్టెంట్ మొహమ్మద్ అబ్దుల్ నబీ అలియాస్ అర్షాద్, ఐటీ రిక్రూటర్ రుపాని ముఖేష్ బాబు అలియాస్ బన్ని, విద్యార్థి శ్రీరామ్ రవితేజ అలియాస్ తేజ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి భూపతి సాయి చైతన్య అలియాస్ సన్నీ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి మరికొందరు డ్రగ్ సరఫరాదారులు, రవాణాదారులు, వినియోగదారులు పరారీలో ఉన్నారని, వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు కొనసాగిస్తున్నామని పంజాగుట్ట ఏసీపీ పి. మురళీ కృష్ణ తెలిపారు. స్వాధీ నం చేసుకున్న మాదకద్రవ్యాలు, ఇతర ఆధారాల ఆధారంగా ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఎసిపి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# 30న జలశక్తితో చర్చలకు రాష్ట్ర సర్కార్ కసరత్తు

**హైదరాబాద్, జనవరి 25, ప్రభాతవార్త:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య ఏర్పడిన జల వివాదాలకు సంబంధించి కేవలం కృష్ణా జలాలకే పరిమితం అవ్వాలని రాష్ట్ర సర్కార్ దాదాపు ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ రెండు రాష్ట్రాల మధ్య ఏర్పడిన జల వివాదాల పరిష్కారం నిమిత్తం ఈ నెల 30న కేంద్ర జల్‌శక్తితో చర్చలు జరగనున్న నేపథ్యంలో దీనికి సంబంధించి చర్చించాల్సిన అంశాలపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందుకు గాను రూపొందించాల్సిన ఎజెండా అంశాలపై ఇరిగేషన్ అధికారులతో చర్చిస్తోంది. కృష్ణా జలాలకు సంబంధించిన అంశాలకే సమావేశంలో పరిమితవ్వాలని సూత్రప్రాయ నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. కాగా ఈ రెండు రాష్ట్రాల మధ్య ఏర్పడిన జలవివాదాల పరిష్కారానికి కేంద్రం ఇప్పటికే 15 మంది అధికారులతో కేంద్రం ప్రత్యేక నిపుణుల కమిటీని ఇటీవల ఏర్పాటుచేంది.

ఈ కమిటీకి కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ అనుపమ్ ప్రసాద్ నేతృత్వం వహించనుండగా, ఇరు రాష్ట్రాలు, వివిధ కేంద్ర సంస్థల నుంచి కీలక అధికారులు పాల్గొననున్నారు. ఈ నిపుణుల కమిటీ న్యూఢిల్లీ లోని సీడబ్ల్యూసీ కార్యాలయంలో ఈ నెల 30న తొలిసారి భేటీ కానున్నది. ఈ భేటీలో నదీ జలాల నిర్వహణకు సంబంధించి వివాదాస్పద, పరిష్కరించాల్సిన కీలక అంశాలను చర్చించ నున్నారు. ఈ భేటీ కోసం ఎజెండా అంశాలను ఎంపికచేసే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలకు రూపకల్పన చేసే ప్రక్రియలో నిమగ్నమైంది.

# సెల్లార్‌లో పెద్దఎత్తున రసాయనాలతోపాటు రెగ్జిన్, ఫర్నీచర్ నిల్వ

## నాంపల్లి అగ్నిప్రమాదంపై ఫైర్‌సర్వీస్ డిజి విక్రంసింగ్ వెల్లడి

**హైదరాబాద్, జనవరి 25, ప్రభాతవార్త:** నాంపల్లిలో ఫర్నీచర్ గోదాములో శనివారం సంభవించిన భారీ అగ్నిప్రమాదంపై ఫైర్‌సర్వీస్ డిజి విక్రం సింగ్‌మాన్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ కీలక విషయాలు వెల్లడించారు. ఈ ఫర్నీచర్ గోదాములో సెల్లార్‌లో అక్రమంగా పెద్దఎత్తున ఫర్నీచర్‌తోపాటు రసాయనాలు, రెగ్జిన్ సామాగ్రి నిలువ వుంచడం వల్లే ప్రమాద తీవ్రత పెరిగిందని తెలిపారు. బహుళ అంతస్తుల భవనాల్లో సెల్లార్‌లు కేవలం వాహనాల పార్కింగ్ కోసమేనని, అయితే ఇక్కడ అక్రమంగా ఫర్నీచర్‌తోపాటు రసాయ నాలు, భారీగా ఇతర వస్తువులు ఉంచారని ఆయన తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో సెల్లార్‌కు వెళ్లే మెట్ల మార్గంలోనూ పెద్ద ఎత్తున అనేకరకాల సామాగ్రి నిలువ వుంచారని, దీని వల్ల లోపలవున్న వారు బయటకు వచ్చే అవకాశం లేకుండా పోయిందని ఆయన తెలిపారు. ఇదే సమయంలో మరో ర్యాంప్ మార్గం కూడా సామాగ్రి వల్ల మూసుకు పోయిందని ఆయన తెలిపారు. సెల్లార్‌ను అక్రమంగా గోదాముగా మార్చడంతో అందులోని వస్తువులు అగ్ని ప్రమాదం కారణంగా మంటలకు ఆహుతయ్యాయని, ఇదే సమయంలో మంటలతో పాటు పొగ బయటకు వెళ్లేందుకు మార్గం లేక పోవడంతో సెల్లార్‌లో చిక్కుకున్న ఇద్దరు చిన్నారులతో పాటు ఐదుగురు మృత్యువాత పడ్డారని ఆయన అన్నారు. చెక్కలతో వున్న ఫర్నీచర్‌కు తోడు రెగ్జిన్, రసాయనాలు ఒకేసారి కలవడం వల్ల మంటల తీవ్రత పెరగడంతో వాటిని అదుపు చేయడం తమ సిబ్బందికి కష్టంగా మారిందని ఆయన అన్నారు. సెల్లార్‌లో చిక్కుకున్న వారిని బ యటకు తీసేందుకు తమ సిబ్బంది ఎంత ప్రయత్నించినా విజిబుల్ లేక పోవడం. సెల్లార్ అంతా మంటలు, పొగ నిండుకోవడంతో వీలు పడలేదని మాన్ తెలిపారు. ఆదివారం తెల్లవారుజాము వరకు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిన తరువాత మంటలు అదుపులోకి వచ్చాయని, ఉదయం 9.15 గ ంటల సమయంలో మొదటి మృతదేహం బయటకు తీశామని, ఆ తరువాత గంట వ్యవధిలో మిగతా నలుగురి మృతదేహాలు వెలికి తీసినట్లు ఆయ న వెల్లడించారు. ప్రమాదం జరిగిన భవనం దృఢంగానే వుందని ఆయన అన్నారు. నిర్వాహకులు ఫైర్ సర్వీస్ నుంచి ఎలాంటి అనుమతులు తీసు కోలేద దని ఆయన తెలిపారు, అనుమతుల విషయలో అన్ని సక్రమంగా వున్నట్లు చూపించినా సెల్లార్‌లో చట్ట విరుద్ధంగా గోదాము నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. నాంపల్లి అగ్నిప్రమాదంపై సమాచారం అందిన రెండు నిమిషాలలోనే ఘటనా స్థలికి తమ సిబ్బంది చేరుకున్నారని మాన్ తెలిపారు.

### సెల్లార్ల విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు

జంట నగరాలలో బహుళ అంతస్తుల భవనాలలో ఫైర్ సర్వీస్ అనుమతులు లేకుండా వున్న వాటిపై కఠినంగా




వ్యవహరిస్తామని విక్రం సింగ్ మాన్ తెలిపారు. దీంతో పాటు సెల్లార్‌ల దుర్వినియోగంపైనా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. దీనిపై విస్తృతంగా తనిఖీలు చేబడ తామని ఆయన అన్నారు. గ్రేటర్ పరిధిలో ఈ తరహాలో అనేక భవనాలు వున్నాయని మాన్ తెలిపారు.

# నాంపల్లి అగ్నిప్రమాదంలో ఐదుగురు మృతి

## భవనం సెల్లార్ నుంచి మృతదేహాలను వెలికితీసిన రెస్క్యూ టీమ్

## 22 గంటలకుపైగా రెస్క్యూ ఆపరేషన్

## రూ.5 లక్షల చొప్పన పరిహారం ప్రకటించిన ప్రభుత్వం

**హైదరాబాద్(గోషామహల్), జనవరి 25, ప్రభాతవార్త :** నాంపల్లిలోని ఫర్నిచర్ దుకాణంలో జరిగిన అగ్నిప్రమాద ఘటనలో సహాయక చర్యలు కొలిక్కి వచ్చాయి. సుమారు 22 గంటలపాటు శ్రమించి భవనంలో చిక్కుకున్న ఐదు మృతదేహాలను రెస్క్యూ బృందాలు వెలికితీశాయి. దట్టమైన పొగల కారణంగా రిస్క్యూ ఆపరేషన్ ఆలస్యమైంది. చిన్నారులు ప్రణీత్ (11), అఖిల్(7)తో



పాటు బీబీ(55), మహ్మద్ ఇంతియాజ్(27), సయ్యద్ హబీబ్(40) మృతదేహాలను ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. సహాయక చర్యలను డీసీపీ శిల్పవల్లి పర్యవేక్షించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. అయిన వారు విగతజీవులా కనిపించడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. చిన్నారులు ప్రణీత్, అ ఖిల్ అమ్మమ్మ, నాన్నమ్మలు లబోదిబోమంటున్నారు. మొన్నటివరకు తమతోనే కలిసి సరదాగా గడిపారని ఇంతలోనే ఇలాజరిగిపోయిందని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. హబీబీ,ఇంతియాజ్, బీబీల కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.5లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. ఆదివారం ఉదయం సెల్లార్‌లో గుంత తవ్వి రెస్క్యూ బృందంలోనికి వెళ్లారు. ఇందుకోసమే సెల్లార్‌కు జేసీబీ సాయంతో రంధ్రాలు చేశారు. లోపల పొగ అంతా బయటకు వెళ్లిన తరువాత సహాయక బృందాలు సెల్లార్‌లో గాలించాయి. భవనం లోపల చిక్కుకున్నవారిని రక్షించేందుకు సుమారు 200 మంది సిబ్బంది శ్రమించారు. వీరిలో ఎన్డీఆర్ఎఫ్, డీఆర్ఎఫ్, హైడ్రా, ఫైర్, పోలీస్, జీహెచ్ఎంసీ విభాగాల సిబ్బంది ఉన్నారు.

### మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం..

అగ్నిప్రమాద బాధితులకు ప్రభుత్వం రూ.5లక్షల చొప్పున పరిహారం ప్రకటించిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అగ్నిప్రమాదం అత్యంత దురదృష్టకరమని, ఘటనలో ఐదుగురు మరణించడం బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టా లని ఆయన అధికారులను ఆదేశించారు. అంతకుముందు భవనంలో చిక్కుకుపోయిన తమ వారి ఆచూకీ చెప్పాలంటూ ఐదుగురు బాధితుల బంధువులు ఆందోళనకు దిగారు. ఓ దశలో వారు గోడ పగులగొట్టి లోనికి వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు, అధికారులు వారిని అతికష్టంగా నిలువరించి నచ్చచెప్పారు. సెల్లార్‌లో దట్టంగా పొగ వ్యాపించడంతో సహాయచర్యలకు ఆటంకం కలుగుతోందని వివరించారు. మరోవైపు శనివారం నుంచి మంటలతో భవనం దృఢత్వంపై అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

### ప్రమాద తీవ్రత పెరగడానికి కారణం అదేనా..

నాంపల్లి స్టేషన్ రోడ్డులోని హిందీ ప్రచార్‌సభ భవనం పక్కన సాయి విశ్వాస్ ఛాంబర్స్ ఐదంతస్తుల భవనంలో బచ్చాస్ ఫర్నిచర్ దుకాణం ఉంది. శుక్రవారం రాత్రి కంటైనర్‌లో చైనా నుంచి భారీగా ఫర్నిచర్ వచ్చింది. దాన్ని రెండు సెల్లార్లలో భద్రపరిచారు. దుకాణంలో సుమారు 22 మంది పనిచేస్తున్నారు. అక్కడ వాచ్ మెన్‌గా పనిచేస్తున్న యాదయ్య, లక్ష్మీ దంపతులు..తమ ఇద్దరు పిల్లలు ప్రణీత్, అఖిల్‌లతో కలిసి సెల్లార్‌లో నివాసం ఉంటున్నారు. శనివారం పిల్లలిద్దరూ పాఠశాలకు వెళ్లకుండా ఇంట్లోనే ఉండిపోయారు. పిల్లల్ని సెల్లార్‌లోనే ఆడుకోవాలని చెప్పి తల్లి దండ్రులు పనిమీద బయటకు వెళ్లారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో భవనంలోని రెండు సెల్లార్లలో అగ్నిప్రమాదం సంభ వించింది. పొగలు రావడం గమనించి సిబ్బంది బయటకు పరుగులు తీశారు. దుకాణంలో పనిచేస్తున్న సుభాన్‌పుర నివాసం మహ్మద్ ఇంతియాజ్, శాస్త్రీపురం ప్రాంతానికి చెందిన సయ్యద్ హబీబ్‌లు..సెల్లార్లో చిక్కుకున్న ప్రణీత్, అఖిల్, బీబీ అనే వృద్ధురాలిని బయటకు తీసుకువచ్చేందుకు లోపలికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో పోలీసులు, ఫైర్, హైడ్రా సహా పలు విభాగాల సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు.

### ఫర్మిచర్ షాపు యజమాని సతీష్‌బచాస్ అరెస్టు

**హైదరాబాద్, జనవరి 25, ప్రభాతవార్త:** బచ్చాస్ ఫర్మిచర్ షాపు కేసుకు సంబంధించి షాపు యజమాని సతీష్ బచాస్‌ను పోలీసులు అరెస్టు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా సతీష్..సెల్లార్‌లో ఫర్మిచర్ షాపు నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. శనివారం నాంపల్లిలోని నాలుగు అంతస్తుల భవనంలోని సెల్లార్‌లో ఉన్న ఫర్మిచర్ షాపులో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగింది. దుకాణంలో పనిచేస్తున్న సుభాన్‌పుర నివాసి మహ్మద్ ఇంతియాజ్, శాస్త్రీపురం చెందిన సయ్యద్ హబీబ్‌లతో పాటు సెల్లార్‌లో చిక్కుకున్న ప్రవీణ్, అఖిల్, బీబీలు మృత్యువాతపడ్డారు. ఈ ఘటనలో మరణించిన పిల్లల తండ్రి యాదయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న అబిడ్స్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సతీష్ బచాస్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

### భారీగా ఫర్నిచర్ నిల్వతో పెరిగిన ప్రమాదం తీవ్రత

ఫర్నీచర్ షాప్ యాజమానికి భవనంలోని రెండు సెల్లార్లలో భారీగా ఫర్ని చర్‌ను నిల్వ ఉంచడం వలన ప్రమాదం తీవ్రత పెరిగిపోయిందని పోలీసులు, ఫైర్ సెఫ్టీ అధికారులు భావిస్తున్నారు. పార్కింగ్ కోసం ఉపయోగిం చాల్సిన సెల్లార్లలో ఫర్నిచర్ ఎందుకు నిల్వచేయాల్సి వచ్చింది ఇందుకు అనుమతి ఉందా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. భవనం సెల్లార్‌లో మంటలు ఎలా వ్యాపించాయి కారణాలేంటి? అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'నిబంధనలు పాటించక పోవడం వల్లనే ఇలాంటి ప్రమాదాలు జరుగుతాయి. తమ సిబ్బంది తనిఖీలు నిర్వహించినప్పుడు మాత్రమే నిబంధ నలు పాటించి, ఆ తర్వాత మాత్రం అక్రమదందా సాగిస్తున్నారు. భవనాల్లోని సెల్లార్ భాగాన్ని కేవలం పార్కింగ్ అవసరాలకు మాత్రమే వాడుకోకుండా ఇలా వ్యాపారాలకు వినియోగించడం వల్లే సమస్య పెద్దదవుతోంది' విక్రమ్‌మాన్ సింగ్ పేర్కొన్నారు.

# పద్మ పురస్కార గ్రహీతలకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అభినందనలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 25:** కేంద్ర ప్రభుత్వం 2026 సంవత్సరానికి గానూ ప్రకటించిన పద్మ పురస్కారాలలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఏడుగురు ప్రముఖులకు పద్మశ్రీ అవార్డులు దక్కడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) హర్షం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా మొత్తం 131 మందికి పురస్కారాలు ప్రకటించగా, అందులో తెలంగాణ నుంచి వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన మేధావులకు సముచిత స్థానం లభించడం రాష్ట్ర ప్రజలందరికీ గర్వకారణమని ఆయన కొనియాడారు. ముఖ్యంగా సైన్స్, వైద్యం, కళలు, పశుసంవర్ధక వంటి విభిన్న రంగాల్లో తెలంగాణ ప్రతిభ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం అభినందనీయమని పేర్కొన్నారు. సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో విశేష పరిశోధనలు చేసిన చంద్రమౌళి గడ్డమానుగు, కృష్ణమూర్తి బాలసుబ్రహ్మణియన్, కుమారస్వామి తంగరాజ్‌లకు పద్మశ్రీ పురస్కారాలు లభించడం వారి మేధస్సుకు దక్కిన గౌరవమని కేటీఆర్ ప్రశంసించారు. వీరితో పాటు వైద్య రంగంలో సామాన్యులకు అత్యాధునిక చికిత్సలను అందుబాటులోకి తెచ్చిన ప్రముఖ సర్జన్ గూడూరు వెంకట్ రావు, ప్రముఖ క్యాన్సర్ నిపుణులు పాల్కొండ విజయ ఆనంద్‌రెడ్డిలకు ఈ అత్యున్నత గౌరవం దక్కడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అలాగే కూచిపూడి నృత్య కళాకారిణి దీపికా రెడ్డికి నృత్య రంగంలో ఆమె చేసిన అద్భుత ప్రదర్శనలకు గానూ ఈ పురస్కారం లభించిందని గుర్తుచేశారు. పశుసంవర్ధక రంగంలో నిస్వార్థ సేవలు అందించిన రామారెడ్డి మామిడికి మరణానంతరం పద్మశ్రీ ప్రకటించడం ఆయన చేసిన సేవలకు దక్కిన నిజమైన గుర్తింపు అని కేటీఆర్ అభివర్ణించారు. క్షేత్రస్థాయిలో నిశ్శబ్దంగా సమాజం కోసం పనిచేసే వారిని గుర్తించడం ముదావహమని, ఈ పురస్కారాలు రాబోయే తరాలకు గొప్ప స్ఫూర్తినిస్తాయని ఆయన ఆకాంక్షించారు. పురస్కార గ్రహీతలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ, తెలంగాణ గడ్డపై పుట్టిన ప్రతిభ దేశకీర్తిని మరింత ఇనుమడింపజేయాలని ఆయన కోరారు.




# 17 మంది రాష్ట్ర పోలీసులకు గణతంత్ర దినోత్సవ పతకాలు

**హైదరాబాద్, జనవరి 25, ప్రభాతవార్త:** గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీసు శాఖలో విశిష్ట సేవలు అందించిన పోలీసులకు కేంద్రం ప్రకటి ంచే పలు రకాల పతకాలు ఈ ఏడాది రాష్ట్రం నుంచి 17 మందికి లభించాయి. ఇందులో ముఖ్యమైన రాష్ట్రపతి పతకం ఐఎస్‌డబ్ల్యులో అదనపు ఎస్పీగా వున్న ప్రకాష్ రావు, సిఐ సెల్‌లో వున్న ఎస్ఐ దామోదర్ రెడ్డిలకు దక్కాయి. మెరిటోరియస్ సర్వీస్ పతకాలు ఎస్ఐబి ఐజిగా వున్న సుమతి, మంచిర్యాల స్పెషల్ పోలీసు బెటాలియాన్ కమాండంట్‌గా వున్న వెంకటరాములు, కొండాపూర్ స్పెషల్ పోలీసు బెటాలియాన్ అదనప కమాండంట్ భానుమూర్తి, సిఐడిలో డిఎస్‌పి శంకర్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డిఎస్‌పి కెవిఎం ప్రసాద్, పోలీసు కంప్యూటర్ సైన్స్ డిఎస్‌పి వంశీ మోహన్ రెడ్డి, అంబర్‌పేట్ పిటిసి డిఎస్‌పి లక్ష్మి, ములుగు స్పెషల్ పోలీసు బెటాలియాన్ ఆర్ఐ వున్న పురుశోత్తం రెడ్డి, వేములవాడ ఎస్ఐ ఎల్లయ్య. సిఐ సెల్ ఎస్ఐ అబ్దుల్ కరీం, పెద్దపల్లి ఏఎస్ఐ ఆనందంలకు లభించాయి. కాగా మెరిటోరియస్ సర్వీస్ మెడల్స్‌కు 130 గ్రే హౌండ్స్ మహిళా హోంగా ర్డు రేణుక, 30 గ్రే హౌండ్స్ హోంగార్డు రవి, 62 గ్రే హౌండ్స్ హోంగార్డు జంగయ్యలు ఎంపికయ్యారు. గ్యాలంటరీ మెడల్‌కు సైబరాబాద్ కమిషనరేట్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా వున్న మర్రి వెంకట్ రెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు డిజిపి కార్యాలయం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది.

30వ వర్ధంతి
26 జనవరి 2026



డాక్టర్ బి.వి. రావు
~ 1935 - 1996 ~
"ప్రతిఫలాపేక్ష లేకుండా తన కర్తవ్యాన్ని నిర్వర్తించిన వాడు జననమరణచక్రం నుండి విముక్తుడై, అనుబంధనాలలో అతీతమైన ఉత్తమ స్థితిని పొందగలడు..."
భగవద్గీత. 2వ అధ్యాయము, 51వ శ్లోకము
లక్షలాది కోళ్ళ పెంపకందారుల కుటుంబాలలో ఆనందం నింపిన కర్మయోగికి ఆయన 30వ వర్ధంతి సందర్భంగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము మరియు ఆయన ఆశయాలకు పునరంకితమవుతున్నాము.
V H GROUP
వేంకటేశ్వర హేచరీస్ గ్రూప్
NECC
NATIONAL EGG CO-ORDINATION COMMITTEE
(Non-Govt. Public Charitable Trust)

వార్త

ఎంత సైంటిస్ట్ అయినా ఫార్ములాలతో మాట్లాడలేడు కదా! ప్రధానంగా భాష సహాయంతోనే మాట్లాడాలి. ఫార్ములా స్థిరాస్తి, భాష చరాస్తి.

-ఐన్‌స్టీన్

# కమ్ముకుంటున్న యుద్ధమేఘాలు!


ప్రపంచంలో అణ్వాయుధ దేశాలను వేళ్ల మీద లెక్కించుకోవచ్చు. ఎవరికెన్ని ఆయుధాలున్నా ఆయా దేశాల ప్రాణాపాయ పరిస్థితుల్లోమాత్రమే వాటిని ఉపయోగించుకోవాలి. అయినా అణ్వాయుధ దేశాల మధ్య ఓ గౌరవప్రద ఒప్పందం ఉంటుంది. ఆ మధ్య రెండు అణ్వాయుధ దేశాలలో భారత్, పాక్‌ల మధ్య వాటి ప్రయోగంతో యుద్ధం రాబోతోందని ఊహా గానాలున్న తరుణంలో తాను కలుగచేసుకుని వారి మధ్య యుద్ధోన్మాదాన్ని తగ్గించానని, యుద్ధాన్ని నివారించానని పదేపదే శ్వేతసౌధాధినేత ట్రంప్ ప్రవచించేవారు. ఇప్పటికీ ఆయన ఆ పాటే పాడుతున్నారు. తనకు నోబెల్ శాంతి బహుమతి రాలేదనివాపోతూ అది ఎవరికో దక్కినందుకు ఆందోళన పడుతూ వగచినప్పుడు, ఆ నోబెల్ గ్రహీత మరియా మచాడో తనకొచ్చిన నోబెల్ బహుమతి పతా కాన్ని ఆయనకిచ్చి శాంతింప చేశారు. ఆ సందర్భంగా తానిక శాంతి వ్యాఖ్యాలు పలకనని, వివిధ దేశాల మధ్య శాంతితో తనకేమీ సంబంధం లేదని స్మశానవైరాగ్యం చెందారు. ఇంత జరిగాక తనవరకు వస్తే గానీ తగవు తెలియదన్న రీతిలో ఇరాన్‌పై యుద్ధం ప్రకటించి తన సేనల్ని కూడా ఆ దేశంపైకి వదిలారు. ఈ అంశంపై దూకుడు ప్రదర్శిస్తున్న ట్రంప్ అప్పుడప్పుడు సంయమనం పాటిస్తున్నట్లు నటిస్తూనే తన యుద్ధ ప్రయత్నాలకు కారణాలు వెతుకుతున్నారు. ఇరాన్ తమ అణు కార్యక్రమాన్ని పునరుద్ధరిస్తే ఊరుకోమని, అమెరికా ఆంక్షలు పెడుతోంది. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వేదికగా డోనాల్డ్ ట్రంప్ ఇరాన్ లక్ష్యంగా హెచ్చరించారు. ఇరాన్ అణ్వాయుధాల తయారీని తాము సహించబోమని, అవసరమైతే సైనిక చర్యకు వెనకాడబోమని అన్నారు. ఆయనలా అన్నారో లేదో ఇలా అమెరికా నుంచి సేనలు ఇరాక్‌కు కదిలాయి. అంటే యుద్ధఛాయలు ఏర్పడ్డాయన్న మాట, దక్షిణ చైనా సముద్రంలో నిలిచి ఉన్న అత్యాధునిక యుఎస్ఎస్ అబ్రహంలింకన్ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ స్ట్రైక్ గ్రూప్‌ను అమెరికా అరేబియన్ సముద్రం పర్షియా గల్ఫ్ దిశగా తరలించింది. ఎఫ్15ఈ స్ట్రైక్. ఈగల్ జెట్‌లు గగనతలంలోనే ఇంధనం నింపే కెసి135, ఎయిర్‌క్రాఫ్ట్‌లను సిద్ధం చేసింది. ఇవన్నీ ట్రంప్ మస్తిష్కంలోని ఆలోచనల వెంబడి జరిగిన పరిణామాలే. మధ్యప్రాచ్యంలో యుద్ధమేఘాలు కమ్ముకున్నట్లే. అమెరికా యుద్ధానికి సన్నద్ధమైనట్లే, ఎదుర్కొనేందుకు ఇరాన్ సేనలుసిద్ధంగానే ఉన్నాయి. క్షిపణి దాడులను సమర్థంగా ప్రతిఘటించేందుకు థాడ్, పేట్రియాట్ వంటి శక్తివంతమైన యాంటీ మిస్సైల్ సిస్టమ్స్‌ను కూడా మోహరించారు. ఖతార్, ఇజ్రాయెల్ వంటి మిత్రదేశాల్లో కూడా రక్షణ వ్యవస్థలను ప్రేరేపితం చేసే విధంగా అమెరికా పటిష్టపరచడం వంటి చర్యలు అక్కడి పరిస్థితులకు అద్దం పడ్తున్నాయి. ఇంతకుముందే గత జూన్ నెలలో అమెరికా ఇరాన్ అణు కేంద్రాలపై దాడులు జరిపిన విషయం తెలిసిందే. అప్పట్లో ఫోర్డో అణు కేంద్రంపై దాడులు జరిపి అమెరికా ఇరాన్ రహస్య అణ్వాయుధ తయారీ కేంద్రాలను ధ్వంసం చేసింది. ఆ సందర్భంగానే 400 కిలోల మేరకు యురేనియం అదృశ్యమైంది. దాని ఆచూకీ ఇంతదాక అమెరికా తెలుసుకోలేకపోయింది. కానీ ఎక్కడో ఇరాన్ అణ్వాయుధ తయారీకి ముందడుగు వేస్తోందన్న సందేహాల నుంచి అమెరికా బయటపడలేదు. అందుకే ఆ అనుమానాలతోనే ఇరాన్‌పై అమెరికా కక్ష కట్టినట్లు ప్రయత్నిస్తోంది. ఒకపక్క శాంతి ప్రవచనాలు, మరోపక్క నోబెల్ గుర్తించని శాంతి నాకెందుకు? అంటారు. తాజాగా ఆయన వైఖరి చూస్తే ఇరాన్ అంతు చూడకుండా వదిలేట్లు లేరు. అమెరికా యుద్ధ నౌకలు విమానాలు భారీస్థాయిలో పశ్చిమాసియా వైపు కదులుతున్నాయన్నది ముమ్మాటికీ ఖచ్చిత సమాచారమే. అమెరికాకు స్నేహహస్తమిచ్చే ఇజ్రాయెల్ తన ఐరన్ డోమ్ వంటి రక్షణ వ్యవస్థలన్నిటినీ ఒకే తాటిపైకి తెస్తోంది. ఇరాన్ అమెరికాల మధ్య యుద్ధం తప్పనిసరి అయితే ప్రపంచ వాణిజ్యంలో ఎన్నో మార్పులు వచ్చే అవకాశం ఉంటుంది. కొన్ని దేశాలు అటు ఇటూ పాలు పంచుకుంటాయి. కాగా ఇరాన్ నియంత్రణలోని హార్మూజ్ జలసంధి గుండా ప్రతిరోజూ 2 కోట్ల బ్యారెళ్ల మేరకు చమురు రవాణా అవుతుంటుంది. ఈ రెండు దేశాల మధ్య పొరపొచ్చాలు బాగా పెరిగిపోతే ఆ జలసంధిని మూసివేస్తూ ఇరాన్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇజ్రాయెల్ ఇరాన్‌ల మధ్య కూడా పొత్తు పొసగకపోవడమూ అసలీ సమస్యకు ప్రధాన కారణంఅయ్యుండొచ్చు. ఇటీవలనే గాజా, ఇజ్రాయెల్‌ల మధ్య యుద్ధం ఆగింది. ట్రంప్ నేతృత్వంలోనే శాంతిస్థాపన జరిగింది. ఇరాన్ ఒకవేళ ఇజ్రాయెల్ మీద దాడి చేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అదే జరిగితే ఇజ్రాయెల్‌కు అండదండ అమెరికాయే. ఇదే ఆలోచనతో ముందు చూపుగా అమెరికా ఇజ్రాయెల్‌కు పేట్రియాట్-3 శ్రేణి క్షిపణులను సరఫరా చేసింది. గతంలోనే ఇజ్రాయెల్‌ను ఎదుర్కోవడానికి ఇరాన్ పటిష్ట ప్రణాళికల నేపథ్యంలో ఇజ్రాయెల్‌కు అమెరికా బాసటగా నిలిచింది. ఇరాన్‌పై సైనిక చర్య తీసుకునేటప్పుడు ఆచితూచి వ్యవహరిస్తా రనుకున్న ట్రంప్ ఉన్నట్టుండి దావోస్ నుంచి వాషింగ్టన్ తిరిగివెళ్తూ ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో మీడియాతో మాట్లాడుతూ యుద్ధ ప్రయత్నాలను వివరించారు. ఇరాన్‌లో ప్రజల తిరుగుబాటులో ఐదువేల మందిచనిపోయారని వార్తలువస్తున్నా, మరిన్ని ప్రాణాలు పోకుండా అమెరికా హెచ్చరించిందన్న విషయం గురించి పూర్తి వివరాలు బయటపడితే తప్ప ఇరాన్ అమెరికాలు శాంతించే పరిస్థితిలేదు.

ఒక సమాజం దాని నైతిక విలువలను కోల్పోతే అది సర్వస్వం కోల్పోయినట్టే.



అబ్రహాంలింకన్

కేవలం ఆలోచించడం కాదు, ఆచరణముఖ్యం. అదీ ఇప్పుడే ప్రారంభించాలి తప్ప రేపటికి వాయిదా వేయకూడదు.



వి.జాన్సన్

## ప్రజావాక్కు



### అప్రమత్తత అవసరం

చైనా జనాభా గణాంకాలు ప్రపంచ దేశాలకు, ముఖ్యంగా భారతదేశానికి ఒక హెచ్చరికగా నిలుస్తున్నాయి. 2025 నాటికి చైనా జనాభా1.4049 బిలియన్లకు పడిపోవడం, జననాలసంఖ్య చరిత్రలో ఎన్నడూ లేనంతగా7.92 మిలియన్లకు పరిమితం కావడం గమనార్హం. దశాబ్దాల కాలం పాటు అమలు చేసిన 'ఒక్క బిడ్డ'విధానం ఆ దేశ జనాభా నిర్మాణాన్నిఎంతగా దెబ్బతీసిందో ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. భారతదేశం ప్రస్తుతం జనాభా పెరుగుదలను చూస్తున్నప్పటికీ, అనేక రాష్ట్రాల్లో సంతానోత్పత్తి రేటు వేగంగాపడిపోతోంది. ఈనేపథ్యంలో మనం అప్రమత్తంగా ఉండటం ఎంతో అవసరం. చైనా అనుభవం నుండి నేర్చుకోవలసిన పాఠం ఏమిటంటే, జనాభా నియంత్రణ కోసం కఠినమైన లేదా బలవంతపు చర్యలు చేపడితే, అవి భవిష్యత్తులో తీవ్రమైన వయోవృద్ధుల సమస్యకు, శ్రామిక శక్తి కొరతకు దారితీస్తాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### సెలవులు కేటాయించాలి

రాష్ట్రంలోని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ గురుకులాలలోని గురువులు, విద్యార్థుల సెలవులపై ఆలోచించవలసిన అవసరంఉంది. గురువులు ప్రభుత్వం నిర్ణయించిన సెలవుల కన్నా మూడురేట్లు ఎక్కువగా వినియోగిస్తున్నారు. విద్యార్థులు పండగసెలవులకు ఎక్కువ రోజులు వెళుతున్నారు. క్లాసులకు ఎక్కువగా హాజరు కావడంలేదు. తప్పనిసరిగా తల్లిదండ్రులు పిల్లలను గురుకులాలకు తీసుకువచ్చి తీసుకొని వెళ్లే విధంగా ఆదేశాలు జారీచేయాలి. వికలాంగులైన గురువులకు విద్యార్థులకు అదనంగా 15రోజుల సెలవులు వారి వైకల్యం అనారోగ్య సమస్యలు హాస్పటల్‌కు వెళ్లడానికి ఇవ్వాలి. గత విద్యాసంవత్సరం తీసుకున్న సెలవులు హాజరు అయిన పని దినాలను సమీక్షించాలి.

- రాపాక రవీందర్, జనగాం

### బస్సు చార్జీలు తగ్గించాలి

జంట నగరాలైన హైదరాబాద్, సికింద్రాబాద్‌లో బస్సు చార్జీలు రెండు మూడుస్టాపులకు ఐదునుండి పది రూపాయల చొప్పునపెంచింది. తెలంగాణ రాష్ట్రప్రభుత్వం దీంతో పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక భారం అవుతుంది. నెలకు అదనంగా ఐదువందల రూపాయలపై చిలుకుపడే అవకాశంఉంది. ఇప్పుడుఉన్నచార్జీలలో50శాతంపెంచారు.

-ఎం. సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

### వివాదాస్పదమౌతున్న గవర్నర్లు

బిజెపియేతర పాలనలోని రాష్ట్రాల గవర్నర్లు ఒక్కొక్కరు వరుసగా వివాదాల్లోకి వెళ్తున్నారు. తమ రాజ్యాంగ విధుల పరిధిని గౌరవించకపోవడం ద్వారా పలుప్రశ్నల్ని సమాజంలో లేవనెత్తుతున్నారు. ప్రతీయేడు శాసన సభ మొదటి సమావేశాల్ని గవర్నరు ప్రసంగంతో మొదలుబెట్టడం ఆనవాయితీ. ఆ ప్రసంగం ఆ రాష్ట్ర ప్రభుత్వం తయారు చేస్తుంది. ప్రజలకు నేరుగా జవాబుదారీ అయిన రాష్ట్రప్రభుత్వం ఏరకమైన పాలన అందిస్తారో, ఏయే గమ్యాలు నిర్ణయిస్తారో దానిద్వారా ప్రజలకు తెలియజేస్తుంది. రాష్ట్ర ప్రథమ పౌరుడిగా గవర్నరు దానిని ప్రభుత్వం తరపున చదువుతారుతప్ప అందులో తమ సొంత ఆలోచనల్ని చొప్పించరు. అయితే ఈ ఆనవాయితీని మొదట కేరళ, తర్వాత తమిళనాడు, నిన్న కర్ణాటక గవర్నర్లు ఉపేక్షించారు.

- డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### సాంకేతికత దుర్వినియోగం

ఇంచుమించుగా ప్రతీరోజూ పేపర్లలో కనుపించే వార్తలేమంటే భార్యలను భర్తలు అలాగే భర్తలను భార్యలు చంపుకోవడం, పిల్లల ఊపిరి కూడా తీయడం, ఆర్థిక ఇబ్బందులను భరించలేక ఆత్మహత్యలు చేసుకోవడం మొదలైనవి చూస్తుంటే సమాజం ఏ రూపాంతరం చెందుతుందోనని మథన పడవలసివస్తోంది. ముఖ్యంగా తల్లులు, తండ్రులుఇతరుల శారీరక వ్యామోహంలో పడి హంతకులుగా మారుతున్నారు. పట్టుబడి జైళ్ళ పాలవుతున్నారు. రాయడానికి అసహ్యంఅనిపించినా మరొక విషయమే మంటే తల్లులు, తండ్రులు తమ సంతానం తోటే పశువుల్లా ప్రవర్తిస్తున్నారు. రానురానువివాహ, కుటుంబ వ్యవస్థలన్నీ జుగుప్సా కరంగా మారుతున్నాయి. సెల్‌ఫోన్ కొనివ్వలేదని, సెల్‌ఫోన్‌ను అదేపనిగా చూడొద్దన్నందుకు పిల్లలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఈ దుర్వవస్థలన్నిటికి మూలకారణాలలో ముఖ్యమైనది పెరుగుతున్నసాంకేతికతను దుర్వినియోగం చేయడమే.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### రిజర్వేషన్లు అమలు చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించ తలపెట్టిన మునిసిపల్ ఎన్నికలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలి, 2026-2027 వార్షిక బడ్జెట్‌లో బీసీల అభివృద్ధి కోసం 40 వేలకోట్ల రూపాయలను కేటాయించాలి. రిజర్వేషన్లను అమలు చేస్తేనే బిసిలకు న్యాయం జరుగుతుంది.

-బూర్గుపల్లి కృష్ణ యాదవ్, హైదరాబాద్

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# సమసమాజ స్థాపనే నిజమైన దేశభక్తి

**ప్రజల్లో స్వేచ్ఛా స్ఫూర్తి, సమైక్య భావం, పోరాడే చైతన్యం జీవిస్తేనే ప్రజాస్వామ్యం నిలబడుతుంది. హక్కులు బాధ్యతల సమ తుల్యతతో కూడిన పౌరసమాజమే సమసమాజానికిపునాది. ప్రజాస్వామ్య పాలనలో అన్నిసామాజిక స్థాయిల ప్రజలు సమానంగా అభివృద్ధి సాధించినప్పుడే అది నిజమైన ప్రజా స్వామ్యం అవుతుంది. లేకపోతే అది కేవలం రాజ్యాంగ పద జాలంగా మిగులుతుంది. ఈగణతంత్ర దినోత్సవ సందర్భంగా మనమందరం ఒకసారి ఆలోచించాలి. దేశభక్తి అంటే? జెండాలు పట్టుకొని ఒకరినొకరు ద్వేషించుకోవడం కాదు. ప్రజాస్వామ్య విలువలను పాలకులు పాలనలో, పాలితులు జీవన విధానంగా మార్చడమే నిజమైన దేశభక్తి. అటువంటి బాధ్యతాయుత పాలకులు, పౌరులే బలమైన భారత గణతంత్రానికి నిజమైన రక్షకులు.**



మేకిరి దామోదర్

భారతదేశంలో స్వేచ్ఛస్వాతంత్ర్యాల మనుగడకు, దేశప్రగతికి బాధ్యతాయుత ప్రజాస్వామ్య పాలన పునాదిరాయి. గణతంత్ర దినోత్సవం కేవలం ఒక జాతీయ వేడుకమాత్రమే కాదు, భారత ప్రజాస్వామ్య ఆత్మను, రాజ్యాంగ సంకల్పాన్ని, పౌరులహక్కులు, బాధ్యతల సమతుల్యతను గుర్తు చేసే మహత్తర సందర్భం. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం మన జాతికి సంక్రమించిన జన్మహక్కులు. అయితే ఈ రెండూ విడివిడిగా ఉండలేవు. స్వేచ్ఛ వ్యక్తిగతమైనదైతే, స్వాతంత్ర్యం సామాజికమైనది. స్వాతంత్ర్యం లేకుండా స్వేచ్ఛ అర్థం కోల్పోతుంది. స్వేచ్ఛ లేని స్వాతంత్ర్యం ఖాళీ నినాదంగా మిగులుతుంది. బాధ్యతతో కూడిన స్వేచ్ఛే నిజమైన స్వాతంత్ర్యానికి ప్రతీక. ప్రజాస్వామ్య వ్యవస్థ సజావుగా నడవాలంటే పౌరులు హక్కులతో పాటు బాధ్యతలను కూడా సమానంగా స్వీకరించాలి. ఈ సమన్వయంపైనే దేశ సామాజిక, రాజకీయ స్థిరత్వం ఆధారపడి ఉంటుంది. నిజమైన దేశభక్తి అంటే నినాదాలు కాదు, బాధ్యతాయుత పౌర జీవనమే. రాజ్యాంగ ఆశయాలు ప్రజాస్వామ్య వాస్తవాలుభారత రాజ్యాంగం వ్యక్తి గౌరవాన్ని కాపాడుతూ, అన్నిరకాల అసమానతలను నిర్మూలించి ప్రతి పౌరునికి ఆర్థికసామాజిక, రాజకీయ న్యాయం అందించాలన్న సంకల్పంతో రూపుదిద్దుకుంది. ప్రజాస్వామ్య పాలనలక్ష్యం శ్రేయోరాజ్యం నిర్మాణమే. అయితే ఈ రాజ్యాంగ ఆశయాలు ఎంతవరకు అమలవుతున్నాయి అన్న ప్రశ్న నేడు సమాజాన్ని వెంటాడుతోంది. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలకు చేరువవుతున్నా, ప్రభుత్వ విధానాలు జాతీయ వనరులపై కొద్దిమంది ఆధిపత్యాన్ని పెంచిన సందర్భాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రగతి ఫలాలు సమానంగా పంచబడకపోవడం వల్ల పేదలు, అణగారిన వర్గాలు మరింత దోపిడీకిగురవుతున్నాయి. జాతి సంపద కొద్దిమంది సంపన్నుల చేతుల్లో కేంద్రీకృతమవడం ప్రజాస్వామ్య మౌలిక సూత్రాలకు విరుద్ధం. ఆర్థిక, సామాజిక, రాజకీయ సమన్యాయం సాధించకపోవడం వల్ల పేదరికం, నిరుద్యోగం, లింగ వివక్ష, అవినీతి, రైతుల ఆత్మహత్యలు వంటి సమస్యలు ఇప్పటికీ పరిష్కార దశకు చేరకపోవడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారితీస్తోంది. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీసే ప్రమాదాన్ని కలిగిస్తోంది. ప్రజాస్వామ్యం అంటే కేవలంఎన్నికలు మాత్రమే కాదు, అది నిత్యజాగ్రత్తతో నిలబడే వ్యవస్థ. ప్రజలు మౌనంగా ఉన్నప్పుడు ప్రజాస్వామ్యం బలహీనమవుతుంది. పాలితులు ఒకే నాణానికి రెండు ముఖాలు. పాలకులు ప్రజల విశ్వాసంతో అధికారంలోకి వస్తారు. పాలితు




లు తమ హక్కులను చట్టబద్ధంగా వినియోగించుకుంటూ బాధ్యతలు నిర్వర్తించాలి. పౌర సమాజ గౌరవాన్నిప్రభుత్వం రక్షించినంతకాలం ప్రజల సహకారం సహజం. కానీ అదే ప్రభుత్వం ప్రజల గౌరవాన్ని దోచుకుంటే, సహకార నిరాకరణ చేయడం పౌరుల ధర్మం. వీధి రాజకీయాలు, అవివేక పూరిత నిర్ణయాలు, ప్రజల ఆకాంక్షలను కాలరాయడంవంటి చర్యలు దేశ భవిష్యత్తుపై తీవ్రప్రభావం చూపుతాయి. పాలన ప్రజల ఇష్టాలపై సాగాలి గానీ, ప్రభుత్వాల ఇష్టాలపై కాదు. ప్రజల యోగక్షేమాల కోసం త్యాగానికి సిద్ధంగా ఉండేవాడే నిజమైన ప్రజానాయకుడు. అవినీతి, బంధుప్రీతి, దోపిడీ, దాష్టికం వంటి పద్ధతులు రాజనీతి కావు. అవి ప్రజాస్వామ్యానికి శత్రువులు. శాంతి అంటే బలహీనత కాదు. ప్రజల అమాయకత్వాన్ని పాలకులు తక్కువగా అంచనావేయరాదు. ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉన్నప్పుడే స్వేచ్ఛను కాపాడుకోగలరు. చట్టంముందు పౌరులందరూ సమానమే మాన్యుడైనా, సామాన్యుడైనా అన్నసూత్రాన్ని తూచా తప్పకుండా అమలు చేసినప్పుడే ప్రజాస్వామ్యానికి నిజమైన అర్థం. గణతంత్ర దినోత్సవం మనకు గుర్తు చేస్తుంది దేశ భవిష్యత్తు పాలకుల చేతుల్లో మాత్రమే కాదు, ప్రతి పౌరుని చేతుల్లో ఉందని. నిరంకుశ పాలకులు వస్తారు పోతారు. ప్రజాసేవ పేరుతో అధికారపీఠాన్ని అధిరోహించిన వారు తమ పాలనా విధానాల్లో, నిర్ణయాల్లో, ప్రజాధన వినియోగంలోప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శకత, జవాబుదారీతనం, నిస్వార్థత పాటించాలి. మానవీయ పాలన అందించడం పాలకుల ప్రధాన బాధ్యత. అదే సమయంలో పాలన సరిగాలేకపోతే ప్రభుత్వాలను ప్రజాకోణంలో విధానపరంగా ప్రశ్నించడం, విమర్శించడం, అసమ్మతి వ్యక్తపరచడం పౌరుల మౌలిక హక్కు. ఈహక్కులను అణచివేయ రాదనిసుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ప్రజల పక్షానమీడియా, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు ప్రశ్నించడం మానేస్తే ప్రజాస్వామ్యం ఎలా బతుకుతుంది? ప్రశ్నను, ప్రశ్నించేవారిని, విమర్శకుల స్వేచ్ఛను పాలకులు ఎలా గౌరవిస్తున్నారన్నదానిపైనే 'ప్రజాస్వామ్య మనుగడను' అంచనా వేయవచ్చు. ప్రజల్లో స్వేచ్ఛా స్ఫూర్తి, సమైక్య భావం, పోరాడే చైతన్యం జీవిస్తేనే ప్రజాస్వామ్యం నిలబడుతుంది. హక్కులు బాధ్యతల సమతుల్యతతో కూడిన పౌరసమాజమే సమసమాజానికిపునాది. ప్రజాస్వామ్య పాలనలో అన్ని సామాజిక స్థాయిల ప్రజలు సమానంగా అభివృద్ధి సాధించినప్పుడే అది నిజమైన ప్రజాస్వామ్యం అవుతుంది. లేకపోతే అది కేవలం రాజ్యాంగ పదజాలంగా మిగులుతుంది. ఈ గణతంత్ర దినోత్సవ సందర్భంగా మనమందరం ఒకసారి ఆలోచించాలి. దేశభక్తి అంటే? జెండాలు పట్టుకొని ఒకరి నొకరు ద్వేషించుకోవడం కాదు. ప్రజాస్వామ్య విలువలను పాలకులు పాలనలో, పాలితులు జీవన విధానంగా మార్చడమే నిజమైన దేశభక్తి. అటువంటి బాధ్యతాయుత పాలకులు, పౌరులే బలమైన భారత గణతంత్రానికి నిజమైన రక్షకులు. ●

# ప్రపంచ దేశాలకు అమెరికా గ్రోత్ ఇంజినా?

డాక్టర్ ఎనుగొండ నాగరాజ నాయుడు

ప్రపంచ దేశాలకు అమెరికా గ్రోత్ ఇంజన్ అయితే ఆ ఇంజన్ నడుపుతున్నది ఎవరు? ఇతర దేశాలపై ఆధారపడే అమెరికా ఆర్థిక వ్యవస్థ మానవ వనరులు, సాంకేతిక నైపుణ్యం, వాణిజ్యం పెట్టుబడి వ్యూహాత్మక విదేశీ సంబంధాల ద్వారా తన ఆర్థిక వ్యవస్థ నిలబెట్టుకోవడానికి బలోపేతం చేయడానికి అమెరికా అనేకదేశాలపై ఆధారపడిఉన్నది. సాఫ్ట్వేర్ ఆరోగ్య సంరక్షణ ఇంజనీరింగ్ పరిశోధన ఆవిష్కరణలో భారతీయ నిపుణులో అమెరికాలో కీలక పాత్ర పోషిస్తున్నారు తయారీ సరఫరా గొలుసులు అరుదైన వినియోగ వస్తువుల ద్వారా అమెరికా ఆర్థిక పనితీరుకు చైనా చాలా కాలంగా కేంద్రంగా ఉంది. వ్యవసాయం శ్రమ సరిహద్దు సరఫరా గొలుసుల ద్వారా అమెరికా ఆర్థిక వ్యవస్థకుమెక్సికో మద్దతు ఇస్తోంది. కెనడా ఇంధన భద్రత, చమురు గ్యాస్ విద్యుత్తు, ఖనిజాలు, వాణిజ్యానికి చాలా ముఖ్యమైనది. జర్మనీ యూరోపియన్ యూనియన్ అధునాతన సాంకేతిక యంత్రాలు ఆటోమొబైల్స్ ఫార్మాక్యుటికల్స్ ఆర్థిక పెట్టుబడులను అందిస్తాయి. జపాన్ దక్షిణ కొరియా సెమీకండక్టర్లు ఎలక్ట్రానిక్స్ ఆటోమొబైల్స్ రోబోటిక్స్ పారిశ్రామిక సాంకేతిక కీలకమైనవి. సౌదీ అరేబియా యూఏఈ ఖతార్ వంటిమధ్య ప్రాచ్య దేశాలు చమురు గ్యాస్ ఇంధన మార్కెట్‌నియంత్రణ ద్వారా అమెరికా ఆర్థిక స్థిరత్వానికి మద్దతిస్తాయి. ఇజ్రాయిల్ రక్షణ సాంకేతికత సైబర్ భద్రత ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ ఆవిష్కరణ, పర్యావరణ వ్యవస్థలకు గణనీయంగా దోహద పడుతోంది. ఆఫ్రికన్ లాటిన్ అమెరికన్ దేశాలు కీలకమైన ఖనిజాలు ముడి పదార్థాలు వ్యవసాయ ఉత్పత్తుల అభివృద్ధి చెందుతున్న మార్కెట్లను సరఫరా చేస్తాయి. మొత్తం మీద అమెరికా ఆర్థిక వ్యవస్థ ప్రపంచ వ్యవస్థతో లోతుగా పరస్పరం ఆధారపడి ఉంది. ఇలా అనేక దేశాలు అమెరికా ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుంటే ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ మాత్రం అమెరికా ప్రపంచ దేశాలకు గ్రోత్ ఇంజనని ప్రగల్భాలు పలకడం ఏంటి?ఆర్థిక అభివృద్ధి పరంగానే కాకుండా రక్షణ పరంగా కూడా అగ్రరాజ్యం అని చెప్పుకునే అమెరికా ఇతర దేశాలపై ఆధారపడుతున్నది. సైనిక నిఘా మద్దతు కోసం అమెరికా సాధారణంగా ఉత్తర అట్లాంటిక్ ఒప్పంద సంస్థ సభ్యులు యునైటెడ్ కింగ్డమ్, ఫ్రాన్స్, జర్మనీ కెనడాతో పాటు జపాన్, దక్షిణకొరియా, ఆస్ట్రేలియా, ఇజ్రాయిల్ వంటి మిత్ర దేశాలపై ఆధారపడుతుంది. ఇప్పుడు చైనాపైఆధారపడి ఉంది. పెంటగాన్ వ్యయం ఏడాది వన్ ట్రిలియన్ డాలర్ నుంచి 1.5 ట్రిలియన్ డాలర్లకు అంటే అమాంతంగా 50 శాతం ఒకేసారి పెంచనున్నట్లు ట్రంప్ జనవరి 7న ప్రకటించారు. ఇది దాదాపు 135లక్షల కోట్లకు సమానం. ముఖ్యంగా చమురు గ్యాస్ ఖనిజాలు లేదా వ్యూహాత్మక వాణిజ్యమార్గాల సమృద్ధిగా ఉన్న ప్రాంతాల్లో ప్రజాస్వామ్యం భద్రతా లేదా మానవ హక్కులను ప్రోత్సహించడానికి చర్యల పేరుతో అమెరికా సైనిక జోక్యాలు తరచుగా స్వార్థపూరిత ప్రయోజనాలను కలిగి ఉంటాయి. మధ్యప్రాచ్యంలో ముఖ్యంగా లిబియాలో జోక్యాలను తరచూ చూస్తున్నాము. ఇంధన వనరుల వ్యూహాత్మక ప్రభావం అమెరికా ఆర్థిక, కార్పొరేట్ ప్రయోజనాలకు దగ్గరగా ఉంటాయి. అలా కాకుండా చైనాలో అయితే ప్రభుత్వ నియంత్రణలో రక్షణ వ్యవహారాలన్నీ ఉంటాయి. అమెరికా తన సైనికపాటవాన్ని పూర్తిగా ప్రైవేట్ కరించింది. 1993నాటిక ఆ దేశపు సైనికరణ కార్యక్రమంలో 74కేవలం ఐదు ఆరుగురు కాంట్రాక్టర్లకు అప్పజెప్పడం జరిగింది. వాళ్లే సరఫరాదారులుగా ఉన్నారు. విపరీతంగా లాభాలు పోగేసుకుంటున్నారు. అమెరికా అనేక దేశాలపై పడి దోపిడీ చేయకుంటే ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ మనుగడే కష్టమవుతుంది. ప్రపంచంలో పెట్టుబడిదారీ విధానాలకు అనుగుణంగాలేని ప్రభుత్వాలను అమెరికా నేడు తన వలసవాదనతో దోచుకునేందుకు పూనుకుంటాంది. సుంకాల పేరుతో దేశాలను ఎంత బెదిరిస్తుందో చూస్తున్నాము. మన దేశ విషయానికొస్తే ప్రతి ఏటా లక్షలాది మంది మేధావులు డాక్టర్లు, ఇంజనీర్లు, సైంటిస్ట్‌లో భారత్ నుండి వలసపోతున్నారు వీరి చదువుల కోసం భారత్ వేల కోట్లు ఖర్చు చేస్తోంది. వీరి సేవలు మాత్రం ముఖ్యంగా అమెరికా ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతున్నది. మనదేశంలో వీరికి సరైన ఉపాధి అవకాశాలు లేక ప్రభుత్వం ద్వారా పెట్టుబడుల సహాయం లేక వారు అమెరికాకు పోవాల్సి వస్తున్నది. అక్కడ సంపాదించింది వారు ఇండియాకు పంపించినా అవి ఈ దేశానికి ఉపయోగపడే పెట్టుబడి రూపంలో రూపుదాల్చడం లేదు. పెట్టుబడులుగా మార్చే పథకాలు ప్రభుత్వాలు కల్పించాలి. మన దేశం ఎప్పటికీ అభివృద్ధి చెందిన దేశంగా అవుతుందో చెప్పగలమా?మన యువత నైపుణ్యమంతా అమెరికా ప్రయోజనాల కోసం అన్నట్లుగా ఉంది. ●

# 'సినిమా' సంస్కరణలూ అవసరమే!

పిల్లా తిరుపతిరావు

పూర్వం ప్రజలు తమ వినోద కాలక్షేపాలకు పౌరాణిక పద్య నాటకాలు, సాంఘిక నాటకాలు, హరికథలు, బుర్రకథలు, ఇంకొన్ని జానపద కళారూపాలను ఆశ్రయించేవారు. అవి ఆనాటి ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి, అలరించాయి. కొన్ని దశాబ్దాల అనంతరం కళారూపాల సాంస్కృతిక సేవను క్రమేపీ చెరిపేసేలా చేసింది చలనచిత్ర రంగం. ఈ రంగం మూకీ నుండి టాకీ, బ్లాక్ అండ్ వైట్ నుంచి కలర్, సాదా సౌండ్ నుంచి డాల్బీ సౌండ్ వరకు పరిణామక్రమం చెందింది. అక్కడితో ఆగక ఎన్నో అధునాతన సౌకర్యాలు అందిపుచ్చుకుని మెరుగుపడింది. ఇంకా చలనచిత్రాలు అనేకరకాల సినీ సెట్టింగ్‌లతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసి, తమవైపుకు తిప్పుకున్నాయి. ఐతే ఏదీ కలకాలం తన ప్రతాపాన్ని, ప్రభావాన్ని చూపలేదు. ఎక్కడో ఒక దగ్గర దానికి అడ్డుతగలక తప్పదు. పాతపోయి కొత్త, కొత్తపోయి పాత రావడం సహజం. దీన్నే చక్రగమనం అంటారు. ఇది ఏ రంగానికైనా వర్తిస్తుంది. లోకంలో అలువును బలువు కొడితే బలువును బ్రహ్మదేవుడు కొడతాడు' అనే సామెతొకటుంది. ఇది అక్షరాలా నిజం. సినిమా అత్యంత ప్రజాదరణ, ప్రభావశీలమైన వినోద మాధ్యమం. ఇది ఒకప్పటి మాట. నేడు ఆ పరిస్థితి లేదు. కొన్ని దశాబ్దాల క్రితమే సినిమా ప్రభావాన్ని మరిపించే బుల్లితెర ప్రతి ఇంట వచ్చి చేరింది. ఇది తన ప్రతాపాన్ని జనంపై విపరీతంగా చూపింది. దాంతో ఎంతోమంది బుల్లితెరకు బానిసలయ్యారు. నేటికీ టీవీలో ప్రసారమయ్యే వివిధ లైవ్‌షోస్, సీరియల్స్ చూస్తూ జనం కాలక్షేపం చేస్తున్నారు. ముఖ్యంగా మహిళలు సినిమాలకు బదులు సీరియల్స్ చూడడం అలవాటు చేసుకున్నారు. ఈ వ్యవహార శైలే నేడు సినీపరిశ్రమకు గుదిబండగా మారింది. ఇదేకాక ప్రపంచీకరణలో భాగంగా అనేక ప్రసార, ప్రచార మాధ్యమాలు విపరీతంగా అందుబాటులోకి వచ్చాయి. సినిమాకి, టి.వీకి ప్రత్యామ్నాయంగా వివిధ సామాజిక మాధ్యమాలు వచ్చిపడ్డాయి. పలు వెబ్‌సైట్లు, వ్యక్తిగత బ్లాగులు అందుబాటులో ఉన్నాయి. వీటి ప్రభావం కూడా ప్రజలపై ఎక్కువగానే ఉంది. వీటన్నిటి దాడివల్ల నేడు సినిమారంగం అనేక కష్టనష్టాలతో కునారిల్లుతోంది. చలనచిత్ర రంగం ఒక దశలో విరాట్రూపం దాల్చింది. సినిమా ఎంత ఉచ్ఛదశలో ఉన్నప్పటికీ, జానపద కళారూపాలు మరుగునపడలేదు. ఆనాటి కళారూపాలకు ప్రత్యామ్నాయంగా నిలచిందే తప్ప, కళారూపాలమనుగడకు ప్రశ్నార్థకం కాలేదు. అలాంటి సినిమా రంగం గత దశాబ్దన్నర కాలం నుండి తన ప్రభావాన్ని కోల్పోతున్నది. అంతర్జాలం, కంప్యూటర్, ఐ పాడ్, స్మార్ట్ ఫోన్ అందుబాటులోకి వచ్చిన తరువాత సినిమా వైపు చూసే జనం కరువయ్యారు. సినిమాను మించిన లైవ్‌షోస్, వెబ్‌సిరీస్, షార్ట్ ఫిలిమ్స్ అందుబాటులోకి వచ్చాయి. వీటికి అదనంగాప్రపంచ వ్యాప్తంగా నిర్మితమౌతున్న అనేక సాంస్కృతిక కార్యక్రమాల వీక్షణకు కొదువే లేకుండా పోయింది. కాబట్టి థియేటర్‌కి వెళ్లి సినిమాలు చూసే ఫ్యామిలీ ఆడియన్స్ తగ్గారన్నది సత్యం. టీవీ, వెబ్ సిరీస్, సీరియల్స్‌కు సంబంధించిన ఎపిసోడ్లను ఒకేసారిగా వీక్షించడాన్ని, వాటిమీదే ధ్యాసంతా ఉంచటాన్ని బింజ్ వాచింగ్ అంటారు. ఈ వాచింగ్ కోవిడ్ కాలంలో జనాలకి అంటుకుంది. అక్కడతో ఆగక కోవిడ్ అనంతర కాలంలో దీన్ని వ్యసనంగా మార్చుకున్నారు. సాధారణంగా వృత్తిపరంగా, వ్యక్తిగతంగా వైఫల్యాలు పొందినవారు ఈ బింజ్ వాచింగ్‌కి అలవాటుపడతారు. ఇంకా కాలేజ్ అమ్మా




యిలు, అబ్బాయిలు కమ్యూనికేషన్ స్కిల్స్ వస్తాయనే భ్రమతో కొరియన్ సిరీస్ చూస్తున్నారు. ఇవన్నీ సినిమా రంగాన్ని కూకటివేళ్లతో కుదిపేసేవే. ఐతే ఆనందించాల్సిన విషయం లేకపోలేదు. మంచి సినిమాలకు ఎప్పుడూ ఆదరణ ఉంటుంది. నేడు థియేటర్లకు వెళ్లి అంతోఇంతో సినిమాలుచూస్తున్న వాళ్లు యువతీయువకులే. వీరే ఓటిటి ఫ్లాట్ ఫార్మ్స్‌లో ట్రెండ్ అయిన సినిమాలు చూస్తున్నారు. వీరివల్లనే ఇంకా సినిమా రంగం బ్రతికున్నది. లేకపోతే పూర్తిగా థియేటర్లు మూసివేయాల్సి వచ్చేది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే థియేటర్లు ఎక్కువగా ఉండేవి. నేడు ఆ థియేటర్లలో చాలా మూసివేయబడ్డాయి. ఉన్నవి జనం లేక బోసిపోతున్నాయి. తెలుగులోనే ఏడాదికి ఎక్కువ సినిమాలు విడుదలయ్యేవి. ఒక హీరో సగటున ఏడాదికి ఐదారు సినిమాలు చేసేవాడు. ఈ పరిస్థితి నేడు లేదు. అదే హీరో నేడు రెండేళ్లకో, మూడేళ్లకో ఒక సినిమాతో వస్తున్నాడు. ఇది సినీ నిర్మాణ రంగ వైఫల్యమో! లేక నాణ్యతకై పడినపాట్లో! అర్థంకావడంలేదు. కొత్తనటుల సినిమాలు, ఇతర భాషల డబ్బింగ్ చిత్రాలు తెలుగులోకి ఎక్కువగా వస్తున్నాయి. పాన్ ఇండియా చిత్రాల నిర్మాణం పెరిగింది. థియేటర్ల సంఖ్య తగ్గిన నేపథ్యంలో ఇలాంటి చిత్రాల ప్రదర్శనకు థియేటర్లు కరువయ్యాయి. ఈ సమస్యకు ముఖ్యకారణం కొంతమంది వ్యక్తుల గుత్తాధిపత్యమే. వారిచేతుల్లోనే థియేటర్లు నడుపబడుతున్నాయి. దీనివల్ల చిన్న బడ్జెట్ చిత్రాల నిర్మాతలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందువల్ల అనివార్యంగా ఆయా సినిమాలను ఓటీటీల్లో రిలీజ్ చేస్తున్నారు. ఓటీటీ యజమాన్యాలు కూడా ఆడిందే ఆట పాడిందే పాటలాగా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీనివల్ల చిన్న నిర్మాతలు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ రంగంలో మరో సమస్య ఏమిటంటే, ప్రకటించిన తేదీకి సినిమాలు విడుదల కాకపోవడం. అంటే దీనర్థం నిర్మాణ లోపం కొట్టొచ్చినట్లు కనబడడమే. పెద్ద బడ్జెట్ చిత్రాలకు టిక్కెట్ ధరలు పెంచడం ఎప్పటినుంచో ఉంది. ఐతే నేడు టికెట్ ధరల పెంపుపై కోర్టు ఆంక్షలు ఉన్నాయి. ప్రత్యేకించి తెలంగాణాలో సినిమా విడుదలకు తొంభై రోజులు ముందే టిక్కెట్ ధర పెంచే జీవోను జారీ చేయాలని రాష్ట్ర హోంశాఖకు గౌరవ న్యాయస్థానం ఆదేశించింది. అందువల్ల నిర్మాతలు పక్కా ప్రణాళికతో సినిమావిడుదల తేదీని ప్రకటించాలి. లేనిచో నామమాత్రపు ధరలతో సరిపెట్టుకోవాల్సి ఉంటుంది. ఇలాచేస్తే పెద్ద బడ్జెట్ సినిమాల నిర్మాతలకు నష్టదాయకం. ఒకప్పటిలా సినిమా లాంగ్ రన్‌తో ముందుకుపోవాలంటే ప్రభుత్వాలు టికెట్ ధరలు పెంచకూడదనే వాదన కూడా ఉంది. తద్వారా ప్రేక్షకుడు చౌకగా సినిమా వినోదాన్ని పొందగలడనేది వారిఅభిప్రాయం. హీరోలు పారితోషికాలు వందల కోట్లలో పెరిగాయి. దీనివల్ల సినిమారంగం కుదేలవుతున్నదన్న మాట వాస్తవమే. బడ్జెట్లో సగభాగం హీరోకే దక్కితే, మరి మిగతా నటులకు? ఏ మాత్రం వెనక్కి తగ్గకుండా ఖర్చుపెట్టిన నిర్మాతలకు వచ్చే లాభాలెం? దీనికి తోడు అదనంగా అగ్రనటుల మధ్య సినీకుల రాజకీయ వైరం. అదికాస్తా బాగుందన్న సినిమానుచూడకుండా చేసే కుయుక్తులకు దారితీస్తున్నది. ఇవాళ చిత్ర నిర్మాణం, చిత్ర పంపిణీ, సినిమాహాళ్ళ నిర్వహణ, టికెట్ల అమ్మకం యావత్తూ బడా పారిశ్రామికవేత్తల గుప్పిళ్లలో ఉన్నాయి. అందువల్లనే చౌకగా దొరికే సినిమా వినోదం ఎంతో ప్రియమైపోయినది. ఒకప్పుడు సినిమాకి ఒక వ్యక్తి వెళ్తే, సినిమా టికెట్‌తో పాటు తినుబండారాలకయ్యే ఖర్చుకి కలిపి ఒక రూపాయి మించేదికాదు. కానీ నేడు ఒకకుటుంబం మల్టీప్లెక్స్‌ల్లో, ఎ.సి థియేటర్లలో సినిమాలు చూసేందుకు వెళితే, వేల రూపాయల్లో ఖర్చవుతున్నది. దీనివల్లనే థియేటర్లలో జనం సినిమాలు చూడడం లేదు. ఎక్కడ తమ జేబులు ఖాళీ అవుతాయో! అన్న భయంతో కన్నెత్తిచూడటం లేదు. ఎప్పుడైతే సినిమా వినోదం ఖరీదయ్యిందో! అప్పటి నుంచే వివిధ ఫేక్ వెబ్సైట్లలో ఉచితంగా సినిమాలను వీక్షించడం పెరిగింది. వీటన్నింటి నుండి సినిమా రంగం బయటపడాలి. దీనికై పలు సంస్కరణలు తేవాలి. ●

IEW INDIA ENERGY WEEK 2026

सत्यमेव जयते MINISTRY OF PETROLEUM AND NATURAL GAS Government of India

ఇండియా ఎనర్జీ వీక్ 2026

# భారత్ నుండి ప్రపంచానికి

రేపటి భాగస్వామ్యానికి కలిసి పని చేయటం



స్వచ్ఛమైన ఇంధనం ఈ వేళ అత్యవసరం.
మెరుగైన రేపటి కోసం మా ఈ దృఢ దీక్ష
సర్వోన్నతం మరియు మా సత్కృషిలో ప్రతిఫలిస్తుంది.

– గౌ॥ శ్రీ నరేంద్ర మోదీ

| 75,000+ | 700+ | 120+ | 6,500+ | 120+ | 550+ |
|---|---|---|---|---|---|
| ఇంధన వృత్తిదారులు | ప్రదర్శించే కంపెనీలు | దేశాల ప్రాతినిధ్యం | సమావేశ ప్రతినిధులు | సభా సమావేశాలు | సమావేశ వక్తలు |

మహా ఘన ప్రారంభోత్సవం

# ఇండియా ఎనర్జీ వీక్ 2026

ప్రత్యేక వీడియో సందేశం

## గౌ॥ శ్రీ నరేంద్ర మోదీ

భారత ప్రధానిచే

మంగళవారం, 27 జనవరి 2026 ఉ.10.00 గం. వద్ద

కన్వెన్షన్ హాల్, ONGC ATI, గోవా

## ఒక దశాబ్దికి పైగా ఇంధన రంగ పరివర్తన

**ప్రపంచ నాయకత్వం :**

- ప్రపంచం యొక్క 4వ అతి భారీ శుద్ధిచేసే కేంద్రం సుమారు. 260 MMTPA సామర్థ్యం
- 6వ అతి పెద్దదైన దాదాపు 26,000 కిమీ వద్ద సహజవాయువు పైప్‌లైన్ నెట్‌వర్క్
- 2050 వరకు ప్రపంచ ఇంధన డిమాండ్ వృద్ధి యొక్క-35% సారధ్యం

**పరిశుభ్రమైన వంట సంబంధిత విప్లవం :**

- PM ఉజ్వల యోజన ద్వారా 10.40 కోట్ల ఇళ్లకు పైగా ఉచిత LPG కనెక్షన్ ఏర్పాటు
- 33 కోట్ల కుటుంబాల వద్ద LPG కవరేజ్ దగ్గర-పరిపూర్ణత
- 1.50 కోట్ల ఇళ్లకు పైగా పైప్‌డు సహజవాయువు (PNG) తో సంధానం

**సుస్థిర ఇంధన సాధనలో ప్రామాణికతల నెలకొల్పుట :**

- పునరుత్పాదన ఇంధన వ్యవస్థాపిత సామర్థ్యంలో ప్రపంచంలో 4వ స్థానం
- 50% పైగా వ్యవస్థాపిత విద్యుత్ సామర్థ్యం శిలాజ ఇంధనం కాకుండా
- ఐదు సంవత్సరాల అడ్వాన్స్‌గానే, COP26 లక్ష్య సాధనలో ముందంజ

**గ్రామీణ సమృద్ధి శక్తి సాధించే దిశలో :**

- రోజుకు 1,150 టన్నులు దగ్గరగా, ఉత్పత్తి చేయగల 170 కంప్రెస్డు బయోగ్యాస్ ప్లాంట్‌లు
- పెట్రోల్‌లో 20% ఇథనాల్ మిశ్రితం సాధించటంలో రైతులకు రూ.1.40 లక్షల కోట్లు దగ్గరగా చెల్లింపు సాధ్యం









మాతో కనెక్ట్ అవ్వండి
#IndiaEnergyWeek | www.indiaenergyweek.com

ఈ వేడుక యొక్క ప్రత్యక్ష ప్రసారంను డిడి న్యూస్, యూట్యూబ్ ఛానల్ పై వీక్షించండి DD NEWS

మరింత ఎక్కువ తెలుసుకోవటానికి QR కోడ్ స్కాన్ చేయండి

# జాగృతి పార్టీలో చేరండి.. మంచి పోస్ట్ ఇస్తా!

## పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు కవిత ఆఫర్
## సృజన్‌రెడ్డికి కాంట్రాక్టులు ఇప్పించిందే హరీశ్‌రావు
## మీడియాతో మాట్లాడిన కల్వకుంట్ల కవిత



సమావేశంలో మాట్లాడుతున్న కల్వకుంట్ల కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 25:** పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక సూచన చేశారు. మహేశ్ కుమార్‌గౌడ్‌ను జాగృతి పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. జాగృతిలో చేరితే ఆయనకు మంచి పోస్ట్ ఇస్తానంటూ ఆఫర్ చేశారు. ఆదివారం తెలంగాణ జాగృతి కార్యాలయంలో మీడియాతో కవిత మాట్లాడారు. తనను కాంగ్రెస్‌లో చేర్చుకోమని టీపీసీసీ అధ్యక్షుడు అంటున్నారని కవిత అన్నారు. అసలు తానేందుకు కాంగ్రెస్‌లో చేరతాను..? అంటూ ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయే పార్టీ అని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో జాగృతి గెలువబోతుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. తనను బద్నాం చేసే పనిలో మహేశ్ గౌడ్ ఉన్నారని ఆరోపించారు. తాను కాంగ్రెస్‌లో చేరతానని మహేశ్ కుమార్ గౌడ్‌కు కల వచ్చిందా..? అని ఎద్దేవా చేశారు. ఆయన మానసిక పరిస్థితి చెక్ చేసుకోవాలని హితవు పలికారు. బలమైన రాజకీయ పార్టీగా జాగృతిని మార్చే ప్రయత్నం చేస్తున్నానని కవిత పేర్కొన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు టార్గెట్‌గా కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. సృజన్ రెడ్డికి కాంట్రాక్టులు ఇప్పించింది హరీశ్‌రావే. సృజన్‌రెడ్డి పెద్ద తిమింగలంగా మారటానికి ఆయనే కారణం. సృజన్‌రెడ్డి.. రేవంత్‌రెడ్డి బావమరిది అని హరీశ్‌రావుకు అప్పుడు తెలియదా..?. ఆయన తవ్విన గుంతలో మాజీ మంత్రి కేటీఆర్ పడటం బాధాకరం. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు లేఖ రాయనని హరీశ్‌రావు అనటం దళిత ఉప ముఖ్యమంత్రిని అవమానించటమే. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి మాత్రమే లేఖ రాస్తానని హరీశ్‌రావు అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అడగకుండా రాష్ట్రానికి సీబీఐ ఎలా వస్తుంది..?. సీనియర్ అయిన హరీశ్‌రావుకు ఈవిషయం తెలియదా?. 2014 నుంచి జరిగిన సింగరేణి టెండర్లపై విచారణ జరపాలని ఆయన అంటున్నారు. అంటే కేసీఆర్ పాలనపైనా హరీశ్‌రావు విచారణ కోరుతున్నట్లే కదా..? అని కవిత ప్రశ్నల వర్షం కురిపించారు. హరీశ్‌రావు లేఖ రాయగానే కిషన్‌రెడ్డి మీటింగ్ పెడుతున్నారు. హరీశ్‌రావు బాధ అంతా ఆయన కమీషన్ల కోసమే అని వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న బొగ్గు గనులను తెలంగాణకు కేటాయించటానికి కిషన్‌రెడ్డి చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ కాంట్రాక్టర్ల పక్షాన మాట్లాడటం బాధాకరం అని హరీశ్‌రావును తప్పుపట్టారు. జీతాలు ఇవ్వటానికి కూడా సింగరేణి వద్ద నిధులు లేవు. జాగృతి రెండేళ్లుగా సింగరేణి టెండర్‌లపై మాట్లాడుతుంటే భట్టి విక్రమార్క కనీసం స్పందించలేదన్నారు. సింగరేణికి చెందిన 25టెండర్లలో ఎక్కువ బీఆర్ఎస్ నేతలకు చెందిన కంపెనీలకే దక్కాయి. ఓబీ వర్క్స్‌కు సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానం తీసుకురావడం కాంగ్రెస్ చేసిన పెద్ద తప్పు. సింగరేణి కార్మికుల కోసం జాగృతి పోరాటం చేస్తుంది అని కవిత స్పష్టం చేశారు.



ఆదివారం డిఫరెంట్లీ ఏబుల్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోషియేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

## దివ్యాంగుల సంక్షేమానికి కట్టుబడిన సర్కారు
### మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జనవరి 25, ప్రభాతవార్త:** దివ్యాంగ ఉద్యోగులకు ప్రయోజనం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర సంక్షేమ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఆది వారం డిఫరెంట్లీ ఏబుల్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోషియేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో రూపొందించబడిన 2026 క్యాలెండర్‌ను దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యవర్మతో కలిసి మంత్రి ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి ప్రథమ ప్రాధ్యానత ఇస్తుందని, దివ్యాంగ ఉద్యోగులకు ప్రయోజనం కల్పించేలా జీవో 34, అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సం రోజున హాజరయ్యేవారికి ఆన్‌డ్యూటీ సౌకర్యం కల్పించడంతోపాటు అసోషియేషన్ ద్వారా వచ్చిన ప్రతి సమస్యను కొంత కాలవ్యవధితో పరిష్కారం చేస్తానని అన్నారు. ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ త్వరలో మరికొన్ని దివ్యాంగ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాబోతున్నాయని తెలిపారు.

## అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడుగా మారం జగదీశ్వర్



**హైదరాబాద్, జనవరి 25, ప్రభాతవార్త:** అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఏఐఎస్‌జిఈఎఫ్) జాతీయ ఉపాధ్యక్షులుగా టిఎన్‌జివో కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనతోపాటు కార్యవర్గ సభ్యులుగా టిఎన్‌జివో ప్రధాన కార్యదర్శి ఎస్ఎం హుస్సేనీ ముజీబ్, అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, కోశాధికారి ముత్యాల సత్యనారాయణ గౌడ్ కూడా ఏకగ్రీవ ఎన్నికయ్యారు. ఏఐఎస్‌టిఈఎఫ్ 18వ జాతీయ సమావేశాలు మహారాష్ట్రలోనీ షిరిడీలో ఈ నెల 23 నుంచి 25 వరకు జరిగాయి. సమావేశాల్లో 28 రాష్ట్రాల ఉద్యోగ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా.. దేశవ్యాప్తంగా ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక వర్గాలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను చర్చించి వాటి పరిష్కారం కోసం ఐక్య ఉద్యమాలు చేయాలని తీర్మానించారు. సమావేశాలకు ఏఐఎస్‌జిఈఎఫ్ జాతీయ అధ్యక్షులు సుభాష్ లాంబ, ప్రధాన కార్యదర్శి ఏ శ్రీకుమార్ నేతృత్వంలో జరగగా తదుపరి జరిగిన ఎన్నికలలో తెలంగాణ ఎన్జీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌ని జాతీయ ఉపాధ్యక్షులుగా ప్రధాన కార్యదర్శి ఎస్ఎం హుసేని ముజీబ్ జాతీయ కార్యవర్గ సభ్యులుగా, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కోశాధికారి ముత్యాల సత్యనారాయణ గౌడ్‌లను జాతీయ కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫిబ్రవరి 12న దేశ వ్యాప్తంగా జరుగుతున్న జాతీయ సమ్మెకు తెలంగాణ ఎన్జీవోల సంఘం పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమానికి సిద్ధమవుతున్నామని, ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను తీవ్ర స్థాయిలో వ్యతిరేకిస్తూ పోరాటాలు చేస్తామని తెలిపారు.

## జెన్‌కోలో 64 మంది ఇంజినీర్లకు పదోన్నతులు

**హైదరాబాద్, జనవరి 25, ప్రభాతవార్త:** తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (టిజి జెన్కో)లో పదోన్నతులు కల్పించింది. పరిపాలనా సౌలభ్యం కోసం, పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికన వివిధ విభాగాలకు చెందిన రాష్ట్ర వ్యాప్తంగా 64 మంది ఇంజనీర్లకు పదోన్నతులు ఇస్తూ జెన్కో నిర్ణయించింది. ఈ మేరకు దీనికి సంబంధించి జెన్కోలోని వివిధ విభాగాలకు సంబంధించిన ఇంజనీర్లకు పదోన్నతులు కల్పిస్తూ ఆ సంస్థ మానవ వనరుల విభాగం డైరెక్టర్ ఎస్వి కుమార్ రాజు ఉత్తర్వులు జారీ చేశారు. రాబోయే వేసవిలో విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, తెలంగాణలోని వివిధ వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరాను అందించడానికి ఈ పదోన్నతులు మంజూరు చేసినట్లు అందులో పేర్కొన్నారు. వీరంతా చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు, డివిజనల్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా ఇన్‌ఛార్జ్ పదోన్నతులు పొందారు. రాష్ట్రంలోని సూపరింటెండింగ్ ఇంజనర్లలో నలుగురికి (3 ఎలక్ట్రికల్, 1 మెకానికల్) చీఫ్ ఇంజనీర్లుగాను, డివిజనల్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు 11 మందికి (5 ఎలక్ట్రికల్, 4 మెకానికల్, 2 సివిల్) సూపరింటెండింగ్ ఇంజనీర్లుగాను, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు 37 మందికి (16 ఎలక్ట్రికల్, 12 మెకానికల్, 9 సివిల్) డిప్యూటీ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనర్లుగాను, అసిస్టెంట్ ఇంజనీర్లు, ఎఎఇ లు 12 మందికి (సివిల్) అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ జంజనీర్లుగా పదోన్నలు ఇచ్చారు. పదోన్నతి పొందిన ఈ అధికారులంతా వారికి కేటాయించిన పోస్టింగ్ స్థానంలో వీలైనంత త్వరగా బాధ్యతలు స్వీకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## డాక్టర్ నోరి దత్తాత్రేయుడికి పద్మభూషణ్ గర్వించదగ్గ విషయం
### పద్మశ్రీ అవార్డులకు ఎంపికైన వారికి మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు

**హైదరాబాద్, జనవరి 25, ప్రభాతవార్త:** రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పద్మశ్రీ అవార్డులకు ఎంపికైన ప్రముఖులకు తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. వివిధ రంగాల్లో వారు చేసిన విశేష సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిష్టాత్మక పురస్కారాలను ప్రకటించడం గర్వకారణమన్నారు. క్యాన్సర్ వ్యాధి నిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు పద్మ భూషణ్ పురస్కారానికి ఎంపిక కావడం గర్వించదగ్గ విషయమన్నారు. వైద్య రంగంలో ఆయన చేసిన సేవలు అనేక మంది జీవితాల్లో వెలుగులు నింపాయని గుర్తు చేశారు. అలాగే సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో గడ్డమణుగు చంద్ర మౌళి, కృష్ణమూర్తి బాలసుబ్రహ్మణ్యన్, కుమారస్వామి తంగరాజ్‌లు దేశాభివృద్ధికి చేసిన విశేష సేవలకు గుర్తింపుగా పద్మశ్రీ పురస్కారాలు అందుకున్నారని తెలిపారు. వైద్య రంగంలో గూడూరు వెంకట్ రావు, పాలకొండ విజయానంద్ రెడ్డి సేవలు ప్రశంసనీయమని మంత్రి అన్నారు. పశు సంవర్ధక రంగంలో మామిడి రామా రెడ్డి చేసిన కృషి గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు దోహదపడిందని, కళారంగంలో దీపికా రెడ్డి, మురళీ మోహన్, రాజేంద్ర ప్రసాద్, గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్‌లు తమ ప్రతిభతో తెలుగు కళా వైభవాన్ని జాతీయ స్థాయికి తీసుకెళ్లారని మంత్రి కొనియాడారు. సేవ, కళ, విజ్ఞానం, వైద్యం వంటి రంగాల్లో నిస్వార్థంగా చేసిన కృషికే ఈ ప్రతిష్టాత్మక పద్మ పురస్కారాలు దక్కాయని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

**గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి పొన్నం**

77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. భారత రాజ్యాంగం దేశ పౌరులందరికీ సమాన హక్కులు, స్వేచ్ఛ, న్యాయం, సౌభ్రాతృత్వాన్ని అందించిన మహత్తర గ్రంథమని అన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడుకుంటూ, ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం సామాజిక న్యాయం, సంక్షేమ పాలనలో దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని, ముఖ్యంగా బీసీలు, పేదలు, బలహీన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. గణతంత్ర దినోత్సవం మనకు దేశభక్తిని, ఐక్యతను, త్యాగాన్ని గుర్తు చేసే పర్వదినమన్నారు.

## మోడల్ స్కూళ్ల టీచర్లకు ట్రెజరీల ద్వారా వేతనాలు చెల్లించాలి
### ఎస్‌టియు టియు రాష్ట్ర అధ్యక్షుడు సదానందంగౌడ్

**హైదరాబాద్, జనవరి 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మోడల్ స్కూల్స్‌లో పని చేస్తున్న టీచర్లకు ట్రెజరీల ద్వారా వేతనాలు చెల్లించాలని ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జి సదానందం గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం కాచిగూడలోని ఎస్‌టియు భవన్‌లో ఏర్పాటు చేసిన మోడల్ స్కూల్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో సదానందం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోడల్ స్కూల్స్ ఆవిర్భావం నుండి ఉపాధ్యాయులు అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఇటీవల నిర్వహించిన బదిలీలు మినహా ఏ ఒక్క సమస్య కూడా మోడల్ స్కూల్ టీచర్లది పరిష్కారం కాలేదన్నారు. సకాలంలో వేతనాలు సైతం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేసిన మాదిరిగా 010 హెడ్ క్రింద ట్రెజరీల ద్వారా మోడల్ స్కూల్ టీచర్లకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులు, మెడికల్ రియంబర్స్మెంట్ సౌకర్యం కల్పించాలని కోరారు. మరణించిన ఉపాధ్యాయ కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దాదాపు వెయ్యి ఉపాధ్యాయ ఖాళీలను వెంటనే ప్రత్యేక డిఎస్‌సి ద్వారా భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయులకు ఖాళీగా ఉన్న ప్రిన్సిపల్ పోస్టులకు పదోన్నతులు కల్పించాలన్నారు. 2019 సంవత్సరంలో ఎస్‌టియు టియస్‌కు అనుబంధంగా ఈ సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్, మోడల్ స్కూల్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. విఠల్, బత్తిని సత్యనారాయణ గౌడ్‌తోపాటు జిల్లా, రాష్ట్ర బాధ్యులు పాల్గొన్నారు.

## ప్రతి పౌరుడికి ఓటు హక్కుతోపాటు బాధ్యత ఉంది
### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు




ఆదివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నూతన ఓటర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు

**హైదరాబాద్, జనవరి 25, ప్రభాతవార్త:** భారతదేశంలో ఎన్నికల నిర్వహణ కోసం 1951 జనవరి 25న ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేయబడిందని, అందుకే ఈ రోజును జాతీయ ఓటర్ల దినోత్సవంగా జరుపుకుంటు న్నామని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు తెలిపారు. ఆదివారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నూతన ఓటర్లతో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా తొలిసారి ఓటు హక్కు పొందిన యువతను ఈ సందర్భంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఓటు ప్రజాస్వామ్యంలో పవిత్రమైన హక్కు మాత్రమే కాదు, ప్రతి పౌరుడి బాధ్యత కూడా అని స్పష్టం చేశారు. బ్యాలెట్.. బుల్లెట్ కన్నా శక్తివంతమైనదనే మాట ప్రజాస్వామ్య బలాన్ని తెలియజేస్తుందని అన్నారు.

అమెరికాలో చెప్పులు కుట్టే వ్యక్తి అబ్రహాంలింకన్ అధ్యక్షుడు కావడం, భారత దేశంలో ఒక చాయ్ అమ్మే వ్యక్తి ప్రధానమంత్రి కావడం ప్రజాస్వామ్యంలోని బ్యాలెట్ శక్తికి నిదర్శనమని చెప్పారు.

కొంతమంది తమను మేధావులమని చెప్పుకుంటూ రౌండ్‌టేబుల్ సమావేశాల్లో ప్రభుత్వాలను విమర్శిస్తారని, కానీ ఓటు వేయడానికి ముందుకు రారని విమర్శించారు. ఓటు హక్కు విలువను గుర్తించి అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కొన్ని విశ్వవిద్యాలయాల్లో దేశాన్ని ముక్కలు చేయాలనే కుట్రలు జరుగుతున్నాయని, దేశ ఐక్యతను బలహీనపర్చే శక్తులు పనిచేస్తున్నాయని హెచ్చరించారు. తుపాకులు పట్టుకుని, బాంబులు వేసి, ఉగ్రవాదంతో సమాజాన్ని మార్చలేరని, భారతదేశంలో రాజ్యాధికారం మారాలన్నా, సమాజం మారాలన్నా ప్రజాస్వామ్య మార్గంలోనే జరగాలని స్పష్టం చేశారు.

భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజా స్వామ్య దేశమని, ప్రపంచం కూడా భారత ప్రజాస్వామ్య విధానాల నుంచి నేర్చుకుంటోందని అన్నారు. ప్రతి సమస్యకు రాజ్యాంగంలోనే పరిష్కారం ఉంద న్నారు. నేటి జెన్–జీ యువతను నేపాల్, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో తప్పుదారి పట్టిస్తున్న ఉదాహరణలు ఉన్నాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఎన్. గౌతం రావు, బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుండేతో పాటు తదితర నాయకులు పాల్గొన్నారు.

## గంజాయి స్మగ్లర్ల దుశ్చర్యలో గాయపడిన అబ్కారీ కానిస్టేబుల్ నిమ్స్‌కు తరలింపు

**హైదరాబాద్, జనవరి 25, ప్రభాతవార్త:** నిజామాబాద్ పట్టణంలో శుక్రవారం రాత్రి గంజాయి స్మగ్లర్ల దుశ్చర్యలో తీవ్రంగా గాయపడ్డ అబ్కారీ మహిళా కానిస్టేబుల్ సౌమ్యను నిమ్స్‌కు తరలించారు. గంజాయి స్మగ్లర్ల కారును ఆపేందుకు సౌమ్య సహా ఇతర సిబ్బంది ప్రయత్నించగా వేగంగా వచ్చిన కారు సౌమ్యను ఢీ కొనడం తెలిసిందే. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ సౌమ్యకు అత్యవసర వైద్యం అందించి దెబ్బతిన్న ఒక కిడ్నీని తొలగించా రు. అనంతరం ఆమెకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు నగరంలోని నిమ్స్‌కు తరలించారు. ఆమె ఆరోగ్యం తీవ్రంగానే వుందని వైద్యులు తెలిపారు. నిమ్స్‌లో ఆమెను అబ్కారీ శాఖ అధికారులు ఆదివారం నాడు పరామర్శించారు. ఈ ఘటనలో ఇద్దరు గంజాయి స్మగ్లర్లు అరెస్టవగా రెండున్నర కిలోల గంజాయితో పాటు నిందితులు ప్రయాణించిన కారును జప్తు చేశారు. పరారీలో వున్న మరో ముగ్గురు స్మగ్లర్ల కోసం గాలిస్తున్నారు. ఈ ఘటనపై నిజామాబాద్ జిల్లా పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

## ఎక్సైజ్ కానిస్టేబుల్ ఆరోగ్య పరిస్థితిపై మంత్రి జూపల్లి ఆరా
### సిబ్బంది భద్రత, మనోధైర్యం పెంచేలా చర్యలు తీసుకుంటామని వెల్లడి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 25:** గంజాయి అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో ఎక్సైజ్ సిబ్బందిపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం అత్యంత సీరియస్‌గా తీసుకుంటుందని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నిజామాబాద్ జిల్లాలో గంజాయి స్మగ్లర్లు కారుతో ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడి నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య ఆరోగ్య పరిస్థితిపై మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం ఆరా తీశారు. నిమ్స్ డైరెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి, సౌమ్యకు అందుతున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షి ంచారు. విధి నిర్వహణలో గాయపడిన సౌమ్యకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని మంత్రి జూపల్లి భరోసా ఇచ్చారు. ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది భద్రత, మనోధైర్యం పెంచేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో ఉన్న అధికారులపై దాడులకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించే ప్రసక్తే లేదని, చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ ఘటనపై ఎక్సైజ్ కమీషనర్ హరికిరణ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీంతో మంత్రి జూపల్లి ఫోన్‌లో సంభాషి ంచారు. కేసు పురోగతి, నిందితుల అరెస్టులు, గం జాయి అక్రమ రవాణా మార్గాలు, ముఠాల కార్యకలాపాలపై సమగ్రంగా చర్చించారు. ఇప్పటికే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు అధికారులు మంత్రికి వివరించారు. పరారీలో ఉన్న మిగిలిన నిందితులను గుర్తించి తక్షణమే అరెస్ట్ చేయాలని, గంజాయి ముఠాలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణా, మత్తుపదార్థాల వ్యాప్తిని అరికట్టడమే లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

## టిజి సెట్‌కు 1.75 లక్షల దరఖాస్తులు
### గత యేడాది కంటే 79 వేలు అధికం
### ఫిబ్రవరి 22న ప్రవేశపరీక్ష.
### 637 స్కూళ్లలో 51,408 సీట్లు

**హైదరాబాద్, జనవరి 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించే టిజి కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టిజి సెట్)–2026కి 1.75 లక్షల దరఖాస్తులు వచ్చాయి. గతేదాది కంటే ఈ ఏదాది 79వేల దరఖా స్తులు అధికంగా వచ్చాయి. ఆదివారంతో టిజి సెట్ దరఖాస్తు గడువు ముగిసింది. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, సాధారణ సంక్షేమ గురుకులాల్లో 2026–27 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశాలతోపాటు 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి కోసం టిజి సెట్‌ను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. దరఖాస్తు గడువు ఆదివారంతో ముగిసింది. గడువు ముగిసే సమయానికి సుమారు 1.75 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్టు అధికారులు చెబుతున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది ఎక్కువ దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. గత ఏడాది దరఖాస్తు గడువు ముగిసే నాటికి 96వేల దరఖాస్తులు రాగా ఈ ఏడాది 1.75 లక్షల దరఖాస్తులు వచ్చాయి. గత ఏడాది కంటే సుమారు 79 వేల దరఖాస్తులు అధికంగా వచ్చాయి. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు దరఖాస్తు గడువును ఈ నెల 21 నుంచి 25(ఆదివారం) వరకు పొడిగించిన సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 22న ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నారు. మే నెలాఖరు నాటికి ప్రవేశాల ప్రక్రియను పూర్తిచేయాలని లక్ష యంగా ఎస్‌సి గురుకులం అధికారులు ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, సాధారణ గురుకుల సొసైటీల పరిధిలో 637 పాఠశాలల్లో 5వ తరగతిలో 51,408 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అవి కాకుండా 6, 7, 8, 9 తరగతుల్లో బ్యాక్‌లాగ్ ఖాళీలు అందుబాటులో ఉన్నా యి. టిసి సెట్ నోటిఫికేషన్‌లో భాగంగా గత ఏడాది డిసెంబరు 11 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఫిబ్రవరి 22న అన్ని జిల్లాల్లో ఉదయం 5వ తరగతిలో ప్రవేశాలకు.. మధ్యాహ్నం 6 నుంచి 9వ తరగతి వరకు మిగిలి పోయిన సీట్లలో అడ్మిషన్ల కోసం ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నారు.

## మహిళల హక్కులను కాలరాస్తున్న కేంద్ర సర్కారు
### రానున్న బడ్జెట్‌లో విద్య, వైద్య రంగాలకు బడ్జెట్‌ను పెంచాలి
### భారత జాతీయ మహిళా సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి నిషాసిద్ధు




ఆదివారం మఖ్దూంభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఎఫ్ఐడబ్ల్యు జాతీయ ప్రధాన కార్యదర్శి నిషాసిద్ధు

**హైదరాబాద్, జనవరి 25, ప్రభాతవార్త:** కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతాపార్టీ(బిజెపి) నేతృత్వంలోని ప్రభుత్వంమహిళల హక్కులను కాల రాస్తోందని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) జాతీయ ప్రధాన కార్యదర్శి నిషాసిద్ధు విమర్శించారు. రానున్న కేంద్ర బడ్జెట్‌లో వైద్యం, విద్య రంగాలకు నిధులను పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. జ్యోతి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.సదాలక్ష్మితో కలిసి నిషా సిద్ధు మీడియాతో మాట్లాడారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించే గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్రం ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, నిధులను తగ్గించిందని నిషా విమర్శించారు. నగరాల పేర్లను మార్చినంత మాత్రాన మోడీ విశ్వగురువు కాలేరని, మహిళలకు ఉపాధి అవకాశాలను కల్పించాలని, వారికి నాణ్యమైన విద్యను, వైద్యాన్ని అందించి రక్షణ కల్పించాలని హితవుపలికారు. రాజస్థాన్‌లో గత ప్రభుత్వం రూ.25 లక్షల వరకు చికిత్సను అందించే అవకాశాన్ని తగ్గించి, బిజెపి ప్రభుత్వం ఆయ్మాషాన్ భారత్ పేరుతో కేవలం రూ.5 లక్షల వరకే చికిత్సను అందిస్తున్నారని దుయ్యబట్టారు. మణిపూర్ మహిళలు, బాలికలపైన దాడులు జరిగినప్పటికీ మోడీ ప్రభుత్వం పట్టించుకోలేదని నిషాసిద్ధు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు 2030 నాటికి అమలు చేస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. 'సర్' పేరుతో తమకు అనుకూలంగా లేని వారిని ఓటరు జాబితా నుంచి తొలగిస్తున్నారని, 14 రాష్ట్రాలలో ఓటరు జాబితా నుంచి లక్షలాది మందిని తొలగించారని విమర్శించారు. మహిళలకు ఓటు హక్కు కూడా లేకుండా చేస్తున్నారన్నారు. తెలగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.జ్యోతి మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం మహిళా వ్యతిరక విధానాలను అవలంభిస్తోందని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో మద్యాన్ని నియంత్రించాలని, డ్రగ్స్‌ను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో విచ్చలవిడిగా మద్యాన్ని సరఫరా చేశారని, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో మద్యం, డబ్బుల ప్రభావం లేకుండా చూడాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. ఎస్.ఛాయాదేవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ మహిళా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సూచించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కూడా తమ వంతు పాత్రను పోషించాలన్నారు. ఈ సమావేశంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యు సహాయక కార్యదర్శి ఎం.డి ఫమీద, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జి. హైమావతి, మాదవి షహీదా, అంజమ్మ, లావణ్య, ప్రమీల, బాలమణి, ఆర్. సునీత, చంద్రమ్మ పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వేలకోట్ల రాజకీయ సంపన్నుడు
### బిఆర్ఎస్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తీవ్రఆరోపణ



బిఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, చిత్రంలో ఆ పార్టీ సీనియర్ నేత డాక్టర్ ఓంప్రకాశ్‌యాదవ్

**హైదరాబాద్, జనవరి 25, ప్రభాతవార్త:** తెలంగాణలో వేల కోట్ల రాజకీయ సంపన్నుడు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అని బిఆర్ఎస్ అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సంచలన ఆరోపణలు చేశారు. ఆదివారం బర్కత్‌పురలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత డాక్టర్ బద్దుల ఓంప్రకాష్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఆపార్టీ నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ వేల కోట్లు సంపాదించినా కిషన్‌రెడ్డి సంపద అంతా బెంగళూరు, నార్త్ ఇండియా, సింగపూర్‌లో పెడుతున్నారని ఆరోపణలు చేశారు. ఆయన వ్యక్తిగతంగా అభివృద్ధి చెందడం తప్పితే.. తన సొంత పార్టీ కార్యకర్తలను కాని ప్రజలను గాని పట్టిం చుకోడని విమర్శించారు. కిషన్‌రెడ్డి తలచుకుంటే 500 కోట్లతో అంబర్‌పేటను అభివృద్ధి చేయవచ్చుని. ఏడేళ్లు కేంద్రమంత్రిగా ఉండి కూడా ఎవ్వరికి ఏమీ చేయరని విమర్శించారు. ఆయన కేవలం ప్రధాని నరేంద్రమోడీ పేరుతో ఎన్ని కల్లో గెలుస్తున్నారని పేర్కొన్నారు. బిజెపిని నమ్ముకుని పనిచేస్తున్న ఎందరో నేతలు ఇప్పటికీ స్కూటర్లపైనే తిరుగుతున్నారని, వారిలో ఏ ఒక్కరికి కూడా ప్రభుత్వంలో పదవి ఇప్పించలేదన్నారు. అలాంటి నాయకుడు మన అంబర్ పేటలో ఉండటం దురదృష్టకరమని అన్నారు. దేశంలో బంగారం, డీజిల్, పెట్రోల్ ధరలు విపరీతంగా పెరిగిపోవడానికి కేంద్రంలో బిజెపి ప్రభుత్వమే కారణమని కాలేరు వెంకటేష్ విమర్శించారు.

# ఉద్యాన విస్తరణాధికారులు
## 175 మంది తిరిగి విధుల్లోకి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 25:** ఉద్యాన శాఖలో రైతులకు సహాయపడేందుకు నియమించిన ఉద్యాన విస్తరణాధికారులు 175 మందిని తిరిగి ప్రభుత్వం నియమించడం పట్ల విస్తరణాధికారుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. గత ప్రభుత్వం 2020 మే 20న కరోనా కాలంలో బడ్జెట్ కారణం చూపుతూ అకారణంగా తమను విధుల నుంచి తొలగించిందని, కరోనా తర్వాత విధుల్లోకి తీసుకోవాలని మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ తిరిగి స్పందన లేదన్నారు. ఐదు సంవత్సరాల పాటు తాము ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నామని ఆ సంఘం నాయకులు విశ్వనాథ్‌రెడ్డి, సెక్రటరీ సంధ్యాజోషి తెలిపారు. ఆదివారం ప్రజా భవన్‌లో ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ చిన్నారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. 175 కుటుంబాలను ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు.

# అజ్ఞాత వ్యక్తికి జాక్‌పాట్
## లాటరీలో రూ.20 కోట్లు బహుమతి

**తిరువనంతపురం, జనవరి 25:** కేరళలో క్రిస్మస్ న్యూఇయర్ బంపర్ లాటరీలో అజ్ఞాత వ్యక్తికి జాక్‌పాట్ తగిలింది. లక్కీ డ్రాలో ఎక్స్‌సీ 138455 అనే నంబరుకు మొదటి బహుమతిగా రూ.20 కోట్లు వరించింది. ఈ టికెట్‌ను కొట్టాయం జిల్లా కంజిరపల్లి బస్టాండు సమీపంలో దుకాణం నడుపుతున్న సుదీక్ అనే ఏజెంట్ విక్రయించారు. దీంతో ఆ టికెట్ కొన్న వ్యక్తి వివరాల కోసం నిర్వాహకులు ఆరా తీస్తున్నారు. ఈ ఏడాది క్రిస్మస్ నూతన సంవత్సరం బంపర్ లాటరీ టికెట్లు రికార్డు స్థాయిలో అమ్ముడయ్యాయి. ఏకంగా 54.08 లక్షల మేర టికెట్లు అమ్ముడు పోయినట్లు అధికారులు తెలిపారు. గతేడాది 47.65 లక్షలతో పోల్చితే దాదాపు 16 శాతం అధికం. ఒక్క పాలక్కాడ్ జిల్లాలోనే 15 లక్షల టికెట్లు కొనుగోలు చేయడం గమనార్హం. ఈ లాటరీ టికెట్లను 10 సిరీస్‌లలో ముద్రించి, రూ.400 ధరగా నిర్ణయించారు. రూ.20 కోట్లు లాటరీ గెలిచిన విజేతకు 10 శాతం ఏజెంట్ కమీషన్, 30 శాతం ఆదాయపు పన్ను మినహాయిస్తే రూ.12.4 కోట్లు చేతికి వస్తుంది. అలాగే, మరో 20 మందికి రెండో బహుమతి కింద రూ.కోటి చొప్పున, మరో 20 మందికి మూడో బహుమతిగా రూ.10 లక్షలు చొప్పున, నాలుగో బహుమతి కింద 20 మందికి చెరో రూ.3 లక్షలు, ఐదో బహుమతిగా మరో 20 మందికి చెరో రూ.2 లక్షలు అందజేయనున్నారు.

# సైట్ విజిట్ టెండర్లూ రద్దు చేయాలి

>> చారు. మే 2025లో కాంగ్రెస్ ప్రభుత్వం ఓబీ వర్క్స్ కోసం సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానం తీసుకొచ్చిందని హరీశ్‌రావు ప్రస్తావించారు. ఓబీ వర్క్స్‌లో మొదటి లబ్ధిదారుడు ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డినేనని ఆరోపణలు చేశారు. నైనీ బ్లాక్ టెండర్లు మాత్రమే కాదు సైట్ విజిట్ సర్టిఫికెట్ మీద జరిగిన అన్ని టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2025 మే నుంచి ఎంతమందికి సైట్ విజిట్ సర్టిఫికెట్ ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రిని బొగ్గు స్కాం నుంచి బయట పడేయటానికి ప్రయత్నం చేసి భట్టివిక్రమార్క విఫలమయ్యారని విమర్శించారు. భట్టి మాటల గారడితో మసిపూడి మారేడుకాయ చేసే ప్రయత్నం చేశారని ఎద్దేవా చేశారు. సింగరేణి స్కాంలో లబ్ధిదారులు ఎవరు..? నష్టం ఎంత..? ఎవరు బాధ్యులో.. భట్టివిక్రమార్క సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

సీఎం రేవంత్‌రెడ్డి బావమరిది బాగోతం బయటపడకుండా.. భట్టి రక్షిస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ నేతల స్వార్థం కోసం వారికి అనుకూలంగా సింగరేణి విధానాలను మార్చారని ఆక్షేపించారు. 2018లోనే సైట్ విజిట్ సర్టిఫికెట్ ఉందని భట్టి తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. భారతదేశంలో ఓబీ వర్క్స్ సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానమే లేదని స్పష్టం చేశారు. 2018 నుంచి 2024 వరకు అనేక ఓబీ వర్క్స్‌కు టెండర్లు జరిగాయని వాటికి సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానం లేదని ప్రస్తావించారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ కోసం కాంట్రాక్టర్లతో ఏర్పాటు చేసిన మీటింగ్ మినిట్స్ ఆఫ్ ద బుక్‌ను బయట పెట్టాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుండి సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి పడిపోయిందని, బొగ్గు అమ్మకాలు తగ్గిపోయాయయన్నారు. సింగరేణిలో జరిగిన స్కాంలు మొత్తం సంస్థనే ఎఫెక్ట్ చేస్తున్నాయన్నారు. రేవంత్ రెడ్డి పాలనలో అనుభవం ఉన్న కాంట్రాక్టర్లను పక్కన పెట్టడం వల్ల ఉత్పత్తి పడిపోయింది. బిఆర్ఎస హయాంలో 2021లో 50 మిలియన్ టన్నులు, 2022లో 62 మిలియన్ టన్నులు, 2023లో 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించాం. కాంగ్రెస్ రాగానే 2024-25లో 69 ఎంటీకి తగ్గింది. ఇప్పుడు 202526లో (గత 9-10 నెలల్లో) కేవలం 43 మిలియన్ టన్నులకు పడిపోయింది అని హరీశ్‌రావు తెలిపారు. నష్టాల్లో ఉన్న సింగరేణిని కేసీఆర్ లాభాల బాట పట్టిస్తే.. రేవంత్ రెడ్డి 6000 కోట్ల కుంభకోణంతో సింగరేణికి మచ్చ తెచ్చారన్నారు.

# కష్టాల్లో ఉన్న సింగరేణిని గాడిన పెడతాం

**దేశీయంగా బొగ్గు ఉత్పత్తిని ప్రోత్సహిస్తాం**

**సంస్థలో దుబారా తగ్గించుకోవాలి.. విదేశీ బొగ్గు దిగుమతుల తగ్గింపు**

**సింగరేణి కార్మికులతో కేంద్ర బొగ్గుగనుల మంత్రి కిషన్‌రెడ్డి**

**హైదరాబాద్, జనవరి 25, ప్రభాతవార్త:** సింగరేణి కష్టాల్లో ఉందని, దానినుండి బయటపడేందుకు అందరూ కష్టించి పనిచేయాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్‌రెడ్డి అన్నారు. ఇదే సమయంలో సంస్థలో దుబారా ఖర్చులు పెరుగుతున్నాయని, వాటిని తగ్గించుకోవాలని సూచించారు. కొత్తగూడెంలోని పద్మావతి ఖని 5 ఇంక్లయిన్‌లో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కార్మికులతో మాట్లాడి వారి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్మికులతో ముఖాముఖిలో మాట్లాడుతూ ప్రస్తుతం సింగరేణి పరిస్థితి బాగాలేదని, దానిని సరైన గాడిలో పెడతామని భరోసా ఇచ్చారు.

సింగరేణి కాలరీస్‌లో నాణ్యమైన బొగ్గు ఉత్పత్తిని పెంచేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. అందుకు అవసరమయ్యే కార్యాచరణను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. విదేశాల నుంచి బొగ్గు దిగుమతిని తగ్గిస్తామని, మరోపక్క దేశీయంగా బొగ్గు ఉత్పత్తిని ప్రోత్సహిస్తామని స్పష్టం చెప్పారు. ఇందులో భాగంగా గత ఏడాది రూ.60 వేల కోట్ల దిగుమతుల్ని తగ్గించామని వివరించారు. ఈ ఏడది కూడా బొగ్గు దిగుమతుల్ని తగ్గించి, సింగరేణి బొగ్గుకు ప్రాధాన్యమిస్తామని తేల్చిచెప్పారు. కాగా దేశంలో 74 శాతం బొగ్గు ద్వారా విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందన్నారు.

అలాగే సింగరేణిలో పనిచేసే కార్మికులు నిరంతరం జాగ్రత్తగా ఉండాలని, జీరో పర్సెంట్ ప్రమాదాలు లేకుండా, బొగ్గు ఉత్పత్తే లక్ష్యంగా పనిచేయాలని పేర్కొన్నారు. ఢిల్లీ బోర్డు మీటింగుల్లో సింగరేణిపై తీసుకునే ప్రతి నిర్ణయం, చర్చించిన విషయాలన్నీ కార్మికులకు తెలియాలన్నారు. రాష్ట్రంలోని 8 జిల్లాల ప్రజలు కేవలం సింగరేణిపైనే ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. లక్షలాది కుటుంబాలకు ఉపాధిని కల్పిస్తున్న సింగరేణి సంస్థను కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. సింగరేణి సంస్థ బాగుంటేనే కార్మిక సంఘాలు, నాయకత్వం బాగుంటుందని ఉద్ఘోషించారు. రక్తాన్ని చెమటగా మార్చి పనిచేసే కార్మికులు సంస్థను పరిరక్షించుకోవాలన్నారు. ఇందుకు కేంద్ర నుంచి వీలైనంత మేర అవసరమైన సహాయ సహకారాలను అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ అడిషనల్ సెక్రటరీ రూపేందర్, సింగరేణి సిఎండి కృష్ణభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక విద్యలో ఆధ్యాత్మికత, జ్ఞానం నేడు ఎంతో అవసరం

## ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క

**హైదరాబాద్ (చిక్కడపల్లి) జనవరి 25, ప్రభాతవార్త :** ఆధునిక విద్యలో ఆధ్యాత్మికత, జ్ఞానం నేడు ఎంతో అవసరమని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇందులో ప్రధానంగా చిన్మయ మిషన్ వంటి సంస్థలు, విద్యతోపాటు విలువలు, క్రమశిక్షణ, నైతిక బలాన్ని అందిస్తూ సమతుల్యమైన వ్యక్తులను, సౌహార్దపూరిత సమాజాన్ని నిర్మించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ఆదివారం సాయంత్రం నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో చిన్మయ మిషన్ గ్రేటర్ హైదరాబాద్, చిన్మయ మిషన్ స్థాపనకు 75 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా జరిగిన అమృత మహోత్సవం సభకు మల్లు భట్టివిక్రమార్క ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ అమృత మహోత్సవం, వేదాంతంలోని శాశ్వత జ్ఞానాన్ని వ్యాప్తి చేయడం, విలువాధారిత విద్యను ప్రోత్సహించడం, తరతరాలుగా ప్రజలను అర్థవంతమైన, లక్ష్యభరితమైన జీవనానికి ప్రేరేపించడం విశేషమని అన్నారు. నేడు చిన్మయ మిషన్ 75 సంవత్సరాల సుదీర్ఘ వారసత్వాన్ని మరోసారి చేసి చెప్పిందన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు, విద్యార్థులు, ఆధ్యాత్మిక గురువులు హాజరై, ఆధ్యాత్మికత, విద్య, సాంస్కృతిక ఐక్యతకు ప్రతీకగా నిలిచారు. అనంతరం మల్లు భట్టి



ఆదివారం సాయంత్రం ఎన్టీఆర్ స్టేడియంలో చిన్మయ మిషన్ అమృత మహోత్సవం వేడుకల సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క తదితరులు

విక్రమార్క చిన్మయ మిషన్ పుస్తక ప్రదర్శనను, వర్చువల్ రియాలిటీ ఆధారిత చిన్మయ ఎక్స్‌పీరియన్స్ స్టాల్‌ను సందర్శించి, ఆధునిక సాంకేతికత ద్వారా ఆధ్యాత్మిక బోధనలు ఎలా అందించబడుతున్నాయో పరిశీలించారు. సభకు మిషన్ గ్లోబల్ హెడ్ స్వామి స్వరూపానంద జీ అధ్యక్షత వహించిన ఈ సభలో చిన్మయ మిషన్ గ్రేటర్ హైదరాబాద్ ఎక్స్ఆఫీషియో స్వామి ఇన్‌చార్జ్ స్వామి సర్వేశానంద జీ, ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన కార్యదర్శి చిన్మయ అమృత మహోత్సవ కమిటీ (గ్రేటర్ హైదరాబాద్) కన్వీనర్, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎల్.వి. సుబ్రహ్మణ్యం, చిన్మయ మిషన్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు హరీశ్ కుమార్, గీర్వాణిరెడ్డి, అప్పారావు ఎం. తదితరులు, వివిధ సంస్థలకు చెందిన ఆధ్యాత్మిక నాయకులు పాల్గొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది పాఠశాల విద్యార్థులు ప్రత్యక్షంగా, వర్చువల్ రూపంలో ఈ వేడుకలో పాల్గొని, కార్యక్రమాన్ని విశాల స్థాయిలో విజయవంతం చేశారు. అమృత మహోత్సవంలో అత్యంత విశేష ఘట్టంగా, ఎన్‌టిఆర్ స్టేడియం అంతా భగవద్గీత 15వ అధ్యాయాన్ని సమూహంగా జపించడంతో ఆ ప్రాంగణం ఆధ్యాత్మిక ఉత్సాహంతో మార్మోగింది. ఆ దృశ్యం ప్రతి ఒక్కరిని భావోద్వేగానికి గురిచేసింది.

# రాష్ట్ర ప్రజలకు కెసిఆర్ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 25:** రాష్ట్ర ప్రజలకు బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. స్వతంత్ర్య భారత దేశంలో స్వయంపాలన అమలులోకి వచ్చి 77 సంవత్సరాలవుతున్న సందర్భంగా రాజ్యాంగం ప్రాముఖ్యతను కేసీఆర్ గుర్తుచేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో రాజ్యాంగం అందించిన ఆర్టికల్ 3 పోషించిన కీలక పాత్రను ఈ సందర్భంగా కేసీఆర్ స్మరించుకున్నారు. అన్నిరకాల వివక్షతలకు దూరంగా, దేశ ప్రజలందరూ సమానత్వ భావనతో జీవిస్తూ, రాజ్యాంగ నిర్మాత డా. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా, భారత సమాజం ముందుకు సాగాలని కేసీఆర్ ఆకాంక్షించారు. తెలంగాణలో రాజ్యాంగ హక్కులను కాపాడుకోవడానికి బిఆర్ఎస్ పార్టీ తన నిరంతర కృషిని కొనసాగిస్తుందని కేసీఆర్ పునరుద్ఘాటించారు.

# ప్రభుత్వ శాఖల్లో డిజిటల్ పాలన

## 27 నుండి ఆన్‌లైన్‌లో ఫైళ్లు

## సెక్రటేరియట్‌లో అన్ని విభాలకు వర్తింపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 25:** ప్రభుత్వ పాలనలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇక నుండి రాష్ట్ర ప్రభుత్వ పాలనకు కేంద్ర బిందువు సెక్రటేటియట్‌లో అన్ని శాఖల్లోనూ డిజిటల్ పాలన అమల్లోకి రానుంది. ఫైళ్లన్నీ అప్‌లోడ్ చేసి ఆన్‌లైన్ ద్వారానే ఉన్నతాధికారులకు అందచేయాల్సి ఉంటుంది. ఈ డిజిటల్ ఫైళ్ల విధానం ఈ నెల 27వ తేదీ నుండి అమల్లోకి స్తోంది. సాధ్యామైనంత వరకూ ఆన్‌లైన్ ద్వారా మాత్రమే ఫైళ్లను పరిశీలించడం జరుగుతుందని, ఇక నుండి దస్త్రాలను పరిశీలించడం సాధ్యం కాదని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విభాగాలకు నోట్ పంపించింది. ఈ మేరకు దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు అన్ని విభాగాలకు ఈ ఉత్తర్వులను జారీ చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో అంతంత మాత్రంగా అమలవుతున్న ఆన్‌లైన్ పాలన పూర్తి స్థాయిలో జరిపేందుకు ప్రభుత్వ చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలోనే సెక్రటేరియట్‌కు కూడా ఈ విధానాన్ని విస్తరించింది. ఆన్‌లైన్‌లో ఫైళ్లను నిర్వహించడంలో ఏమైనా సమస్యలు, ఇబ్బందులు ఎదురైతే వాటిని రాష్ట్ర ఐటీ శాఖ దృష్టికి తీసుకెళ్లి, సంప్రదించాలని సూచించారు. కాగా రాష్ట్ర ప్రభుత్వ ఫైళ్లను డిజిటల్ విధానంలో నిర్వహించేందుకు ఈ ఆఫీస్ పేరుతో నేషనల్ ఇన్ఫర్మే టిక్స్ సెంటర్ రూపొందించిన సాఫ్ట్‌వేర్‌ను ఇటీవల కాలంలో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు, కార్యాలయాల్లో వినియోగిస్తున్నారు. ఇక రాష్ట్ర, జిల్లా స్థాయిల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్ల నిర్వహణను పూర్తిగా (100 శాతం) ఆన్‌లైన్ ద్వారా నిర్వహించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. ఈ క్రమంలోనే ఇకపై సెక్రటేరియట్‌లోని అన్ని శాఖల కార్యదర్శుల కార్యాలయాల నుండి ఫైళ్లను ఆన్‌లైన్ ద్వారానే పంపించాలని తాజాగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశించారు.

# పద్మశ్రీ అవార్డు గ్రహీతలకు హృదయపూర్వక అభినందనలు

## పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 25:** 2026 సంవత్సరానికి గాను గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మ అవార్డుల జాబితాలో తెలంగాణ రాష్ట్రానికి విశేష ప్రాధాన్యత లభించడం రాష్ట్ర ప్రజలందరికీ గర్వకారణమని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. వివిధ రంగాల్లో అసాధారణ సేవలు అందించిన కళాకారులకు పద్మశ్రీ పురస్కారాలు లభించడం రాష్ట్ర ప్రతిభకు దక్కిన అత్యున్నత గౌరవంగా ఆయన అభివర్ణించారు.

సైన్స్ రంగంలో చంద్రమౌళి, కృష్ణమూర్తి, కుమారస్వామి తంగరాజ్ చేసిన పరిశోధనలు దేశ విజ్ఞానాభివృద్ధికి దోహదపడినవని తెలిపారు. వైద్య రంగంలో గూడూరు వెంకట్ రావు, విజయ ఆనంద్ రెడ్డి గార్లు ప్రజల ఆరోగ్య పరిరక్షణలో అందించిన సేవలు అభినందనీయమన్నారు. కూచిపూడి నృత్య కళలో దీపికా రెడ్డి భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లారని ప్రశంసించారు.

పశుసంవర్ధక రంగంలో విశేష సేవలు అందించిన రామారెడ్డి మామిడికి (మరణానంతరం) పద్మశ్రీ లభించడం ఆయన సేవలకు సముచిత గౌరవమని పేర్కొన్నారు. ఈ అవార్డులు వ్యక్తిగత ఘనతకే కాకుండా తెలంగాణ రాష్ట్రానికి దక్కిన గౌరవంగా భావించాలని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. వీరందరి జీవితాలు, సేవలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని, ముఖ్యంగా యువతకు స్ఫూర్తినిస్తాయని తెలిపారు.

ఈ ఘనత సాధించిన ప్రతి ఒక్కరికీ తన తరఫున, టీపీసీసీ తరఫున, అలాగే తెలంగాణ ప్రజల తరఫున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు

# పది ఓవర్లలోనే మ్యాచ్ ఫినిష్ చేసిన భారత్

**న్యూజిలాండ్‌పై ఎనిమిది వికెట్ల తేడాతో గెలుపు**

**పొట్టికప్ప సిరీస్ కైవసం చేసుకున్న టీమిండియా**



**గువాహతి, జనవరి 25:** భారత్ న్యూజిలాండ్ మధ్య జరిగిన మూడో టీ20లో టీమిండియా భారీ విజయం నమోదుచేసింది. కివీస్ ఇచ్చిన 154 పరుగుల లక్ష్యాన్ని కేవలం 10 ఓవర్లలోనే ఛేదించి భారత్ రికార్డు సృష్టించింది. అభిషేక్ శర్మ విధ్వంసకర బ్యాటింగ్‌తో కివీస్ బౌలర్లను ఊచకోత కోశాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ బ్యాక్ టు బ్యాక్ హాఫ్ సెంచరీలతో ఆకట్టుకున్నాడు. దాంతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో మరో రెండు రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే భారత్ సిరీస్ కైవసం చేసుకుంది. గువాహటి వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన సూర్యకుమార్ యాదవ్ న్యూజిలాండ్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. టీమిండియా బౌలర్లు చాకచక్యంగా బౌలింగ్ చేయడంతో పాటు బుమ్రా ఫామ్‌లోకి రావడంతో కివీస్ బ్యాటర్లు చేతులెత్తేశారు. గ్లెన్ ఫిలిప్స్ మినహా మిగతా ఏ బ్యాటర్ రాణించకపోవడంతో న్యూజిలాండ్ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 153 పరుగులు మాత్రమే చేసింది. తదనంతరం బ్యాటింగ్‌చేసిన భారత్ జట్టు రెండు వికెట్ల నష్టానికి 155పరుగులుచేసి కివీస్‌కు షాకిచ్చింది. దీనితో భారత్ 60 బంతులు మిగిలి ఉండగానే 8 వికెట్ల తేడాతో విజయం సాధించి సిరీస్ కైవసంచేసుకుంది. కివీస్ ఇచ్చిన 154 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు తొలి బంతికే ఎదురుదెబ్బ తగిలింది. ఫామ్ లేని కారణంగా ఇబ్బందిపడుతున్న సంజు శాంసన్ మ్యాట్ హెన్రీ వేసిన మొదటి బంతికే క్లీన్ బౌల్డ్ అయ్యాడు. క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్ తన బ్యాట్‌కి పదునుపెట్టి ఆరంభం నుంచే బౌండరీలు బాదాడు. ఇషాన్ కిషన్ వరుస బౌండరీలతో భారత్ స్కోర్ బోర్డు దూసుకుపోయింది. 13 బంతులు ఆడిన ఇషాన్ కిషన్ 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 28 పరుగులు చేసి క్రీజును వీడాడు. ఇషాన్ దూకుడుతో భారత్ 3.1 ఓవర్‌కే 50 పరుగులు పూర్తి చేసుకుంది. ఇషాన్ అవుటైన తర్వాత అభిషేక్ శర్మ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కివీస్ బౌలర్లకు వణుకుపుట్టించారు. అభిషేక్ శర్మ కేవలం 14 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేసి మరోసారి రికార్డు సృష్టించాడు. ఈ మ్యాచ్‌లో పవర్ ప్లే ముగిసే సమయానికి భారత్ 94 పరుగులు చేసి సెకండ్ హైయెస్ట్ పవర్ ప్లే స్కోర్ నమోదు చేసింది. పేస్, స్పిన్ అన్న తేడా లేకుండా అభిషేక్, సూర్య బౌండరీల మోత మోగించారు. అభిషేక్ 14 బంతుల్లో ఫిఫ్టీ నమోదు చేస్తే, సూర్యకుమార్ యాదవ్ 25 బంతుల్లో 50 పరుగులు చేసి బ్యాక్ టు బ్యాక్ ఫిఫ్టీ నమోదు చేశాడు. అభిషేక్ శర్మ 20 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్సర్లతో 68 పరుగులు చేయగా, సూర్యకుమార్ యాదవ్ 26 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 57 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. సంజు 0, ఇషాన్ కిషన్ 28 పరుగులు చేయడంతో భారత్ కేవలం 10 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో 30తో టీమిండియా సిరీస్ కైవసం చేసుకుంది.

# హైదరాబాద్‌లో డ్రంకన్‌డ్రైవ్ దాడులు

## 399 మంది మందుబాబుల అరెస్టు

**హైదరాబాద్, జనవరి 25, ప్రభాతవార్త:** జంట నగరాలలో శుక్రవారం, శనివారం రాత్రుల్లో ట్రాఫిక్ పోలీసులు పలుచోట్ల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ దాడుల్లో మొత్తం 399 మంది మందు బాబులు పట్టుబడ్డారు. వీరిలో 321 మంది ద్విచక్ర వాహనదారులు, 31 మంది ఆటో డ్రైవర్లు, 47 మంది కార్ల డ్రైవర్లు వున్నారు. పట్టుబడ్డ 156 మంది 51 నుంచి 100 పాయింట్ల వరకు, 91 మంది 101 నుంచి 150 పాయింట్ల వరకు, 43 మంది 151 నుంచి 200 పాయింట్ల వరకు, 17 మంది 201 నుంచి 250 పాయింట్ల వరకు, ఎనిమిది మంది 251 నుంచ 300 పాయింట్ల వరకు పది మంది 300 పాయింట్లకు మించి విపరీతంగా మద్యం సేవించినట్లు తేలింది. వీరిని అరెస్టు చేసిన తరువాత వారి వాహనాలు జప్తు చేసి, కేసులు నమోదు చేశాక సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. వీరికి కౌన్సిలింగ్ నిర్వహించిన తరువాత కోర్టుల్లో హాజరు పరుస్తారు.

కోర్టులు వీరికి శిక్షలు విధిస్తాయని నగర జాయింట్ ట్రాఫిక్ పోలీసు కమిషనర్ జోయల్ డేవిస్ ఆదివారం నాడు మీడియాకు తెలిపారు. జంట నగరాలలో డ్రంకన్ డ్రైవ్ దాడులు నిరంతరం కొనసాగుతాయని, వీటిని పూర్తిస్థాయిలో అరికడతామని ఆయన తెలిపారు.

# నా దేశం.. నా ఓటు

>> ఎన్నికల యంత్రాంగాన్ని అభినందించారు. ఈ సందర్భంగా గవర్నరు ఓటర్ల ప్రతిజ్ఞను చేయించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడడానికి పౌరుల నిబద్ధతను పునరుద్ఘాటించారు. కొత్తగా నమోదు చేసుకున్న యువ ఓటర్లు, సీనియర్ పౌరులకు ఎపిక్ ఓటరు ఐడి కార్డులను పంపిణీ చేశారు. ఎన్నికల నిర్వహణలో విశిష్ట పనితీరు, ఆవిష్కరణలకు గాను అధికారులకు ఉత్తమ ఎన్నికల జిల్లా అవార్డులు, ఉత్తమ ఎన్నికల పద్ధతుల అవార్డులు 2025 ప్రదానం చేశారు. ఉత్తమ ఎన్నికల జిల్లా అవార్డులను కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి, జనగాం కలెక్టరు రిజ్వాన్‌బాషాషేక్‌కు వరంగల్ కలెక్టర్ సత్యశారదకు అందజేశారు. జిల్లా ఎన్నికల అధికారులకు ఉత్తమ ఎన్నికల పద్ధతుల అవార్డులను సిద్ధిపేట కలెక్టర్ కె.హైమావతి, యాదాద్రి భువనగిరి కలెక్టర్ ఎం.హనుమంతరావు, నల్గొండ కలెక్టర్ త్రిపాఠిలను ఘనంగా సన్మానించి వారి విశిష్ట సేవలను ప్రశంసించారు. అలాగే ఎన్నికల అధికారులకు (ఈఆర్ఓ) ఉత్తమ ఎన్నికల పద్ధతుల అవార్డులను సిద్ధిపేట 41-దుబ్బాక గరిమా అగర్వాల్, రాజన్న సిరిసిల్ల 29-సిరిసిల్లా సిహెచ్.వెంకటేశ్వర్లు, నల్గొండ 93-మునుగోడు శ్రీదేవికి అందజేశారు. సహాయ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు ఏఈఆర్ఓలకు ఉత్తమ ఎన్నికల పద్ధతుల అవార్డులను హైదరాబాద్ 61-జూబ్లీహిల్స్ ప్రసీద, 36-నారాయణఖేడ్ భాస్కర్, 113-పాలేరు ఒరుగంటి వెంకటేశ్వర్లు, 85-కొల్లాపూర్ రాజ్‌కుమార్, 101-డోర్నకల్ సునీల్‌కుమార్‌లకు ప్రదానం చేశారు. గవర్నరు ప్రసంగానికి ముందు భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ వర్చువల్ సందేశంలో 1950 జనవరి 25న భారత ఎన్నికల సంఘం స్థాపక జ్ఞాపకార్థం జరుపుకునే జాతీయ ఓటర్ల దినోత్సవ చారిత్రక ప్రాముఖ్యత, ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడంలో ఎన్నికల కీలకపాత్రను తెలియజేశారు. భారతదేశ ఎన్నికల వ్యవస్థ ప్రపంచవ్యాప్తంగా ఎంతో గుర్తింపు పొందిందని, యువ ఓటర్లు సమాచారం, నైతిక భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా ప్రజాస్వామ్యానికి రాయబారులుగా వ్యవహరించాలని జ్ఞానేష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్‌రెడ్డి, అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని, రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

# విద్యుత్ పంపిణీ రేటింగ్‌లో నంబర్-1గా అమ్మాదాబాద్

## మెరుగుపడిన ఆంధ్ర సంస్థలు

## దిగజారుతున్న తెలంగాణ డిస్కంలు

## 2024-25 విద్యుత్ ర్యాంకుల విడుదల

**హైదరాబాద్, జనవరి 25, ప్రభాతవార్త:** తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థల (డిస్కంలు) పనితీరు దిగజారుతుండగా, ఆంధ్రప్రదేశ్ డిస్కంలు ఒకింత మెరుగుదలను నమోదు చేశాయి. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ 2024-25 ఆర్థిక సంవత్సరానికి తాజాగా విడుదల చేసిన విద్యుత్ పంపిణీ కంపెనీల 14వ ఇంటిగ్రేటెడ్ రేటింగ్, ర్యాంకింగ్ నివేదిక (ఐఆర్) ప్రకారం దేశంలోని 18 డిస్కమ్‌లు, 4 విద్యుత్ విభాగాలు (పిడి) సహా 22 యుటిలిటీలు గత 13వ ర్యాంకింగ్ నివేదికతో పోలిస్తే వాటి గ్రేడ్‌లలో మెరుగుదల చోట చేసుకుంది. విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆమోదించిన ఫ్రేమ్‌వర్క్ కింద పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (పిఎఫ్‌సి) '14వ ఇంటిగ్రేటెడ్ రేటింగ్ మరియు ర్యాంకింగ్ ఆఫ్ పవర్ డిస్ట్రిబ్యూషన్ యుటిలిటీస్' ను రూపొందించింది. దేశంలోని మొత్తం 72 విద్యుత్ సంస్థల్లో 65 పంపిణీ సంస్థల పనితీరు అధ్యయనం జరిగింది. గతంలో కంటే ఈ సారి 18 విద్యుత్ పంపిణీ సంస్థలు, నాలుగు విద్యుత్ విభాగాల గ్రేడ్‌లు మెరుగుపడ్డాయి. ఇదే సమయంలో మరో 10 పంపిణీ సంస్థలు, ఒక విభాగం పనితీరు దిగజారడంతో వాటి గ్రేడ్‌లో కూడా పడిపోయాయి. దేశంలో మొత్తం 31 పంపిణీ సంస్థలు ఎ, ఎ+ రేటింగ్ పొందగా, 11 సి, సి- రేటింగ్ నమోదు చేశాయి. ఈ రేటింగ్‌లో దేశంలోనే మొదటి మూడు స్థానాలను ప్రైవేట్ రంగ సంస్థలు టొరెంట్ పవర్ అహ్మదాబాద్ (100 శాతం), టొరెంట్ పవర్ సూరత్ (100 శాతం), అదానీ ఎలక్ట్రిసిటీ ముంబై లిమిటెడ్ (99.75 శాతం)తో వరుసగా దక్కించుకున్నాయి. కాగా ప్రభుత్వ యాజమాన్యంలోని యుటిలిటీలలో ఎక్కువ భాగం నష్టాలను చవిచూస్తూనే ఉన్నాయి. వాటి నిర్వహణ నిమిత్తం రుణాలపై ఎక్కువగా ఆధారపడుతున్నాయి. ప్రస్తుతం, ప్రభుత్వ రంగ పంపిణీ సంస్థల మొత్తం పేరుకుపోయిన నష్టాలు రూ.6.77 లక్షల కోట్లుగా ఉండగా, వాటి మొత్తం రుణాలు రూ. 7.11 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని డిస్కంల రేటింగ్ మెరుగుపడింది. మొత్తం మూడు డిస్కంలు పనితీరు ఆధారంగా రేటింగ్ పొందాయి. ఏపీ ఈస్ట్రన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ (ఈపీడీసీఎల్) బి గ్రేడ్‌కు దిగజారగా, మిగిలిన రెండు డిస్కంలు సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఎపిసీపీడీసీఎల్), సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఎపిఎస్పీడీసీఎల్) తమ రేటింగ్‌ను మెరుగుపరుచుకున్నాయి. కాగా తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలకు సంబంధించిన రేటింగ్ పెడింగ్‌లో ఉంచింది. 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తెలంగాణలో విద్యుత్ పంపిణీ సంస్థల (డిస్కంలు) ర్యాంకింగ్ అధికారిక నివేదిక ఇంకా పూర్తిగా వెల్లడికాలేదు. అయితే వాటి పనితీరును మాత్రం కేంద్రం విడుదల చేసిన నివేదికల్లో పేర్కొంది. రాష్ట్రంలోని కీలకమైన దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) పనితీరు ఏటా క్షీణిస్తోంది. సంస్థ పనితీరును మెరుగు పరచేందుకు ఉన్నత స్థాయి అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలను కిందిస్థాయి అధికారులు పట్టించుకోకుండా, తమకు అనుకూలమైన స్వంత ఎజెండాలను అమలు చేయడంతో సంస్థ పనితీరు నానాటికి దిగజారుతోంది. ఈ నేపథ్యంలో ఎస్పీడీసీఎల్ గత మూడేళ్లలో విద్యుతన వినియోగ బిల్లుల మొత్తాలను పెంచుతున్నా వాటి వసూళ్లతో పాటు, సరైన నిర్ణయాలు తీసుకోకపోవడంతో ముఖ్యంగా నిర్వహణ, పంపిణీ నష్టాలు (ఎటి అండ్ సి) పెరుగుతున్నాయి. విద్యుత్ రంగంలో, ఎటి అండన సి అంటే అగ్రిగేట్ టెక్నికల్ కమర్షియల్. ఇది విద్యుత్ సంస్థల పంపిణీ నెట్‌వర్క్ యొక్క మొత్తం సామర్థ్యాన్ని కొలవడానికి ఉపయోగించే ఒక కీలక పనితీరుకు కొలమానం. ఇది భౌతిక విద్యుత్, ఆదాయ నష్టాలు రెండింటినీ మిళితం చేస్తుంది. ఈ నేపథ్యంలోనే 2022-23 సంవత్సరంలో బిల్లింగ్ విషయంలో 91.50 శాతం ఉండగా, వాటి వసూళ్లలో 90.49 శాతం, సమగ్ర సాంకేతిక మరియు వాణిజ్య నష్టాలు (ఎటి అండ్ సి) 17.20 శాతంగా ఉంది. అదే 2023-24 నాటికి ఇది వరుసగా 91.45 (బిల్లింగ్), 88.99 (కలెక్షన్), 18.62 (ఎటి అండ్ సి), 2024-25 సంవత్సరానికి బిల్లింగ్ లో మాత్రం పెరుగుదలతో 91.70 శాతం ఉండగా, వాటి వసూళ్లలో మాత్రం 89.87కు, ముఖ్యంగా సాంకేతిక, వాణిజ్య నష్టాలు మూడేళ్ల క్రితం కంటే భారీగా 18.51 శాతానికి పెరిగాయి.

# జలసంరక్షణలో 'అనంత' మార్గదర్శకం



## మన్‌కిబాత్‌లో అనంతపురం ప్రజలను అభినందించిన ప్రధాని మోడీ

## ప్రకృతి పరిరక్షణలో ఆ జిల్లా రోల్ మోడల్ - సంస్కృతి, సంప్రదాయాలను మలేసియాలోని భారతీయులు పరిరక్షిస్తున్నారని వ్యాఖ్య

**న్యూఢిల్లీ, జనవరి 25:** జలనవరులను పునరుద్ధరించడానికి కృషి చేస్తున్న అనంతపురం ప్రజలు అభినందనీయులని ప్రధానమంత్రి నరేంద్రమోడీ వ్యాఖ్యానించారు. జలసంరక్షణలో మార్గదర్శకులుగా, ప్రకృతి పరిరక్షణలో రోల్ మోడల్‌గా నిలిచారని కొనియాడారు. ఆదివారం 130వ మన్ కీ బాత్‌లో ప్రధాని మోడీ మాట్లాడుతూ, "ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం లో ప్రజా భాగస్వామ్య ప్రయత్నమే ఒకటి కనిపించింది. అనంతపురం జిల్లా తీవ్ర కరువుతో అల్లాడుతున్న ప్రాంతం. ఇక్కడి నేల ఎర్రగా, ఇసుకతో కూడి ఉంటుంది, అందుకే ప్రజలు నీటి కొరతను ఎదుర్కొంటున్నారు. ఇక్కడి చాలా ప్రాంతాలలో చాలా కాలం పాటు వర్షాలు కురవవు. ప్రజలు కొన్నిసార్లు అనంతపురం జిల్లాను ఎడారి కరువుతో కూడా పోలుస్తారు. ఈ సమస్యను పరిష్కరించ డానికి, స్థానికులు చెరువులను శుభ్రం చేయాలని సంకల్పించారు. ఆ తర్వాత, ప్రభుత్వ యంత్రాంగం మద్దతుతో 'అనంత నీరు సంరక్షణ ప్రాజెక్ట్' ప్రారంభించబడింది. ఈ ప్రయత్నం కింద, 10కి పైగా చెరువులకు పునరుజ్జీవం పోశారు. ఇప్పుడు ఈ చెరువులు నీటితో నిండుతున్నాయి. అదే సమయంలో, 7వేలకు పైగా మొక్కలు నాటారు. అంటే, నీటి సంరక్షణతో పాటు అనంతపురంలో పచ్చదనం కూడా పెరిగింది. ఇప్పుడు పిల్లలు కూడా ఇక్కడ ఈత కొట్టి ఆనందించగలుగు తున్నారు. ఒక విధంగా, ఇక్కడి మొత్తం పర్యావరణ వ్యవస్థకు పునరుజ్జీవం లభించింది" అంటూ అనంతపురం జిల్లా ప్రజలను అభినందించారు. జలసంరక్షణకు కృషి చేయడాన్ని ప్రజలు కర్తవ్యంగా భావించారని ప్రధాని మోడీ దేశ ప్రజలకు వివరించారు. అనంతపురం జిల్లా ప్రజల స్ఫూర్తి ప్రశంస నీయమైనదని పేర్కొన్నారు. సంస్కృతి, సంప్ర దాయాలను పరిరక్షించడంలో మలేసియాలో భారతీయ కృషి అభినందనీ యమని, మలేసియా పర్యటనలో తాను స్వయంగా పరిశీలించానని ప్రధాని వివరించారు. తమిళం, తెలుగు, పంజాబీ, ఇతర భాషలను బోధించడం నుండి వారసత్వ నడకలను నిర్వహించడం వరకు, అలాగే వస్త్రాలతోపాటు పశ్చిమబెంగాల్ సంగీతాన్ని ప్రదర్శించడం వంటి అద్భుతాలను మలేసియాలోని భారతీయ సమాజం చేస్తున్నదని పేర్కొన్నారు. ఇక జనవరి 26న, మనం 77వ గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటామని ప్రధాని మోడీ తెలిపారు. మన రాజ్యాంగం ఈ రోజున అమల్లోకి వచ్చింది. జనవరి 26 మన రాజ్యాంగ వ్యవస్థాపకులకు నివాళి అర్పించే అవకాశాన్ని అందిస్తుందని ప్రధాని పేర్కొన్నారు. అలాగే, జనవరి 25వ తేదీ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ముఖ్యమైన పండుగలా జరుపుకోవాలని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు. ఓటర్లు ప్రజాస్వామ్యానికి ఆత్మ అని, ఒక యువకుడు మొదటిసారి ఓటరుగా మారినప్పుడల్లా, మొత్తం పొరుగు ప్రాంతం, గ్రామం, నగరం వారిని అభినందించడానికి స్వీట్లు పంచి అభినందించాలన్నారు.

ఇది ఓటు వేయడం గురించి అవగాహన పెంచుతుంది.

మీకు 18 ఏళ్లు నిండితే, వెంటనే మీరు ఓటరుగా నమోదు చేసుకోండి అని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు.

# హెచ్-1బి దరఖాస్తుదారులకు షాక్..

## స్టాంపింగ్ ఇంటర్వ్యూలు 2027లోకి మార్పు!



**వాషింగ్టన్, జనవరి 25:** భారతీయ వృత్తి నిపుణులకు అమెరికా ప్రయాణాల్లో మరింత జాప్యం చోటుచేసుకోనుంది. హెచ్-1బి వీసాల స్టాంపింగ్ ఇంటర్వ్యూల అపాయింట్‌మెంట్లు 2027లోకి మారాయి. కొత్త ఇంటర్వ్యూల స్లాట్లకు కొరత ఏర్పడటంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో వేలాది మంది వృత్తి నిపుణులు భారత్‌లోనే చిక్కుకుపోయే పరిస్థితి నెలకొంది. మరికొందరి ఉద్యోగాలు ప్రమాదంలో పడే పరిస్థితి తలెత్తింది. భారత్‌లోని అమెరికా కాన్సులేట్లలో బ్యాక్‌లాగ్‌లు భారీగా పెరిగిపోయాయి. ఫలితంగా వీసా స్టాంపింగ్ ఇంటర్వ్యూలు 2027లోకి మారాయి. వాస్తవానికి డిసెంబరు 2025లో వీటిలో తొలిసారి జాప్యం చోటుచేసుకుంది. నాడు ఇంటర్వ్యూలను 2026 మార్చికి మార్చాల్సి వచ్చింది. ఆ తర్వాత ఆ తేదీలు అక్టోబరుకు.. ఇప్పుడు 2027కు మారినట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఢిల్లీ, ముంబై, చెన్నై, హైదరాబాద్, కోల్‌కతా కేంద్రాల్లో కొత్త ఇంటర్వ్యూ స్లాట్లు లేవు. దీంతో ప్రస్తుతం ఉన్న అపాయింట్‌మెంట్లను అధికారులు 18 నెలలు తర్వాతకు మార్చాల్సి వచ్చింది. ఫలితంగా 2027 సంవత్సరం మధ్యలోకి అవి చేరాయి. దీంతో ఇమిగ్రేషన్ నిపుణులు ప్రస్తుతం అమెరికాలో ఉన్న వృత్తి నిపుణులు వీసా స్టాంపింగ్ కోసం తిరిగి భారత్‌కు వెల్లవద్దని సూచిస్తున్నారు. హ్యూస్టన్‌కు చెందిన ఇమిగ్రేషన్ సంస్థ భాగస్వామి ఎమిలీ న్యూమన్ మాట్లాడుతూ.. తాము గత 50 రోజుల్లో భారత్ కోసం కొత్త వీసా ఇంటర్వ్యూల స్లాట్లు ఉన్నట్లు చూడలేదన్నారు. అదే సమయంలో అమెరికాలో ఉన్న వృత్తి నిపుణులు కూడా భారత్‌లో స్టాంపింగ్ ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్ల కోసం ప్రయత్నించడం లేదని చెప్పారు. 2027 వరకు ఎటువంటి రెగ్యులర్ అపాయింట్‌మెంట్లు లేవని 'అమెరికన్ బజార్' వెల్లడించింది. ఇప్పటికే స్టాంపింగ్ కోసం భారత్‌కు వచ్చిన వారికి కూడా ఇంటర్వ్యూలు రద్దయినట్లు తెలిపింది. జనవరి, ఫిబ్రవరి అపాయింట్‌మెంట్లు ఉన్న వారికి కూడా.. వాటిలో మార్పులు చేసి యేడాది తర్వాత డేట్లను కేటాయిస్తూ ఈ మెయిల్స్ వచ్చాయి. ఇప్పటికే వీసా స్టాంపింగ్ కోసం భారత్‌కు చేరుకొన్న వేలాది మంది వృత్తి నిపుణులు తిరిగి అమెరికా వెళ్లలేక ఇక్కడే చిక్కుకుపోయారు. వీరిలో కొందరి భార్యాపిల్లలు అమెరికాలో ఉండగా..

తల్లిదండ్రులు భారత్‌లో ఉండిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఎంప్లాయిమెంట్ కాంట్రాక్టులు, హౌసింగ్ అగ్రిమెంట్లలో సమస్యలు తలెత్తుతున్నాయి. వీసా గడువు ముగిసిన చాలామంది ఉద్యోగులకు.. వారి సంస్థల యజమానులు పొడిగింపులను కూడా ఇవ్వడం లేదు. దీనికి తోడు లక్ష డాలర్ల ఫీజు ఉండటంతో కొత్త హెచ్-1బి వీసాల కోసం కంపెనీలు దరఖాస్తులు చేయడంలేదు. మరోవైపు ఈ సమస్యను మరింత జటిలం చేసేలా అమెరికా విదేశాంగ శాఖ కొన్నాళ్ల క్రితం కీలక నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం భారతీయులు మరో దేశంలోని అమెరికా కాన్సులేట్లలో వీసా స్టాంపింగ్ చేయించుకునే అవకాశాన్ని నిలిపివేసింది.

దీంతో భారతీయ కాన్సులేట్లలో అపాయింట్‌మెంట్లకు డిమాండ్ ఒక్కసారిగా పెరిగిపోయింది.

## దేశభవిష్యత్తు రూపకల్పనలో కీలకం ఓటుహక్కు.. ప్రధానిమోడీ

**న్యూఢిల్లీ,జనవరి 25:** ప్రజాస్వామ్య ప్రక్రియల్లో యువత భాగం కావాలని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. ఓటు హక్కును వినియోగించుకోవడం కేవలం దేశ ప్రజల హక్కు మాత్రమే కాదని, దేశ భవిష్యత్తును రూపొందించడంలో మనకు ఉన్న బాధ్యత అని అన్నారు. ఓటు వేయడం రాజ్యాంగం మనకు ఇచ్చిన గొప్ప హక్కు అని చెప్పారు. ఓటు ద్వారానే దేశ భవిష్యత్తుకు దారి ఏర్పడుతుందని ప్రధాని అన్నారు. దేశ అభివృద్ధి ప్రయాణంలో కీలకపాత్ర పోషించే భాగ్యవిధాతలు ఓటర్లేనని చెప్పారు. మన దేశ విధిని మార్చగలిగే శక్తి ప్రజలు వేసే ఓట్లకు ఉంటుందని తెలిపారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మై భారత్ వాలంటీర్లకు మోడీ లేఖలు రాసారు. ప్రజాస్వామ్య ప్రక్రియలను బలోపేతం చేయడానికి భారత ఎన్నికల కమిషన్ చేస్తున్న కృషిని ప్రధాని అభినందించారు. దేశంలో ఎన్నికలను ఈసీ నిబద్ధతతో నిర్వహిస్తోందని చెప్పారు. ఏదైనా రాష్ట్రంలో ఎన్నికలు వచ్చినప్పుడు ఇతర ప్రాంతాలకు వెళ్లి స్థిరపడిన ఎందరో తమ గ్రామాలకు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకుంటుంటారని మోదీ పేర్కొన్నారు. హిమాలయాలలో, అండమాన్ దీవుల్లో, దట్టమైన అడవుల్లో ఉన్నా ఎన్నికల సమయానికి తమ స్వస్థలాలకు చేరుకుంటారని చెప్పారు. ఈ చర్యలు ప్రజాస్వామ్య విలువల పట్ల వారికున్న బాధ్యతను తెలియజేస్తాయని అన్నారు. రాబోయే తరాలు కూడా ఇదే నిబద్ధతతో ఉండాలని హితవు పలికారు.

## జీవనశైలి మార్పులతో గుండెపోటు ముప్పు!

**న్యూఢిల్లీ, జనవరి 25:** దేశ ప్రజల్లో అత్యధిక శాతం మందిలో రక్తంలో చెడు కొలెస్టరాల్ అధికంగా ఉండటంతో గుండె జబ్బులు పెరుగుతున్నాయి. విదేశీయులతో పోలిస్తే పదేండ్ల ముందుగానే వారు గుండె జబ్బుల బారిన పడుతున్నారు. భారతీయుల్లో అధిక చెడు కొలెస్టరాల్ ఎందుకు ఉంటుందనే విషయాన్ని జన్యు శాస్త్రం కొంతవరకు వివరిస్తున్నాయని నిపుణులు తెలిపారు. బాడీ మేకప్, కొవ్వులు, చక్కెరలను కణాలు ఉపయోగించుకునే తీరు, వారసత్వ లక్షణాలు భారతీయులకు త్వరగా గుండె జబ్బులు రావడానికి అనుకూలంగా మారుతున్నాయన్నారు. ఇది కేవలం ఆహారం, జన్యువులకు సంబంధించిన విషయం కాదని, జన్యుపరమైన ఈ ధోరణి వల్ల చాలా మంది భారతీయులకు పాశ్చాత్య దేశాల్లోని వారి కన్నా పదేండ్ల ముందుగానే గుండె సమస్యలు వస్తాయని చెప్పారు. చెడు కొలెస్టరాల్ కేవలం జన్యువుల నుంచి మాత్రమే రాదు, జీవన శైలి వల్ల కూడా వస్తుందన్నారు. అనారోగ్యకరమైన ఆహారం, జంక్ ఫుడ్, చక్కెర ఎక్కువగా ఉండే స్నాక్స్, ఫ్యాటీ మీల్స్ తినడం, రోజూ తగినంత వ్యాయామం చేయకపోవడం, ఒత్తిళ్లు, బరువు పెరగడం వంటివి కూడా ప్రభావం చూపుతాయని తెలిపారు. వీటివల్ల చెడు కొలెస్టరాల్ (ఎల్‌డీఎల్) పెరగడం మాత్రమే కాకుండా మంచి కొలెస్టరాల్ (హెచ్‌డీఎల్) తగ్గుతుంది. ఎల్‌డీఎల్ పెరిగి, హెచ్‌డీఎల్ తగ్గితే, గుండె జబ్బుల ముప్పు పెరుగుతుంది. అందుకే 30 ఏండ్లు పైబడినవారు, తమ వంశంలో గుండె జబ్బుల చరిత్ర ఉన్నవారు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలి. చెడు కొలెస్టరాల్‌ను తగ్గించుకోవాలనుకొనే వారు పండ్లు, కూరగాయలు, పప్పులు, లీన్ ప్రొటీన్స్ తినాలి. రోజూ కనీసం 30 నిమిషాలపాటు నడవాలి. ప్రాసెస్ చేసిన ఆహారం, చక్కెర ఎక్కువగా ఉండే పానీయాలను తీసుకోవడం తగ్గించాలి. ఒత్తిడిని మేనేజ్ చేసుకోవాలి, బరువును నియంత్రించుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

# ఆర్జేడి వర్కింగ్‌ప్రెసిడెంట్‌గా తేజస్వియాదవ్

## సోదరుడి నియామకంపై సోదరి రోహిణి సెటైర్లు




**పాట్నా,జనవరి 25:** బీహార్‌కు చెందిన రాజకీయ పార్టీ ఆర్జేడీ (రాష్ట్రీయ జనతా దళ్) జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లాలూ ప్రసాద్ యాదవ్ తనయుడు తేజస్వి యాదవ్ నియమితులయ్యారుఈ పార్టీ జాతీయ కార్యనిర్వాహక కమిటీ ఆమోదం తెలిపింది. బీహార్ రాజధాని పాట్నాలోని ఒక హోటల్‌లో ఆదివారం జరిగిన సమావేశానికి పార్టీ అధినేత, బీహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన సతీమణి, మాజీ సీఎం రబ్రీదేవి, తేజస్వి యాదవ్, మిసా భారతి సహా కీలక నేతలు హాజరయ్యారు. ఈ సమావేశంలోనే తేజస్విని జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నట్లు కమిటీ ప్రకటించింది. పార్టీలో నాయకత్వ మార్పు అవసరమని, అలాగే యువతకు అవకాశం ఇవ్వాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పార్టీ అధినేత లాలూ కొన్నేళ్లుగా వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. దీంతో పార్టీ నిర్వహణ కష్టమైపోతోంది. అందుకే కొత్త నాయకుడిగా తేజస్వి యాదవ్‌ను ఎన్నుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం జరుగుతున్న జాతీయ కార్యవర్గ సమావేశంలో పార్టీకి సంబంధించి మరికొన్ని నిర్ణయాలు తీసుకోనున్నారు. పార్టీ భవిష్యత్ వ్యూహాలు, నిర్మాణాత్మక మార్పులు, నిర్వహణ లోపాలు సరిదిద్దడం, పార్టీ కమిటీల పునర్వ్యవస్థీకరణ వంటి అంశాలపై కూడా ఈ సమావేశంలో నిర్ణయం తీసుకోబోతున్నారు. వచ్చే తరాల్ని ఆకట్టుకునేలా పార్టీని సమూలంగా మార్చాలని తేజస్వి భావిస్తున్నట్లు తెలుస్తోంది. తేజస్వి నియామకంపై లాలూ కుమార్తె రోహిణి ఆచార్య తేజస్విపై పరోక్ష విమర్శలుచేసారు. అణగారిన వర్గాల అభివృద్ధికి ఏర్పాటుచేసినపార్టీని కొందరు నాశనంచేయాలని చూస్తున్నారని అన్నారు.

## భార్యకు చికిత్సకోసం రిక్షాపైనే 600 కిమీ.. ప్రయాణం



**సంబల్‌పూర్,జనవరి 25:** అంబులెన్స్‌కోసం సొమ్ములులేని దీనావస్థలో ఒక నిరుపేద 600 కిలోమీటర్లు రిక్షా తొక్కడానికి సిద్ధపడ్డాడు ఓ 70 ఏళ్ల వృద్ధుడు. 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆసుపత్రికి తీసుకెళ్లి అదే విధంగా ఇంటికి తిరుగు ప్రయాణం అయ్యాడు. ఈ ఎముకలు కొరికే చలి, రోడ్డు ప్రమాదం జరిగినా ఆగిపోలేదు. ఒరిస్సాలో జరిగిన ఘటన హృదయాలను కలచివేస్తోంది. సంబల్‌పూర్‌లోని మోడిపాడ ప్రాంతానికి చెందిన బాబు లోహర్ రిక్షా తొక్కుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 2025 నవంబర్‌లో అతడి భార్య జ్యోతి పెరాలటిక్ స్ట్రోక్ (మెదడుకు రక్త ప్రసరణలో అంతరాయం ఏర్పడి మెదడు కణాలు చనిపోవడానికి దారితీసే పరిస్థితి) వచ్చింది. దీంతో స్థానిక వైద్యులు కటక్‌లో ఉన్న ఎస్‌సీబీ ప్రభుత్వ మెడికల్ కాలేజీకి సిఫార్సు చేశారు. ఇందుకోసం అంబులెన్స్‌లో లేదా ఇతర వాహనంలో తన భార్యను ఆసుపత్రికి తీసుకెళ్లడానికి బాబు లోహర్ వద్ద డబ్బులు లేవు. దీంతో తన రిక్షాలోనే భార్యను ఆసుపత్రికి తరలించాలని నిర్ణయించుకున్నాడు. బాబు లోహర్ రిక్షాపై కొన్ని పాత మెత్తలు వేసి తన భార్యను వాటిపై కూర్చోబెట్టాడు. అనంతరం దేవుడి నామాన్ని జపిస్తూ రిక్షా తొక్కినట్లు తెలిపాడు. "నాకు జీవితంలో కేవలం రెండు ప్రేమలు మాత్రమే ఉన్నాయి. ఒకటి నేను ఇంటికి తిరిగి తీసుకెళ్తున్న నా భార్య. మరొకటి నా రిక్షా. ఈ రెండింటిలో ఏది లేకున్నా నేను ఉండలేనని చెప్పాడు. రోజుకు దాదాపు 30 కిలోమీటర్ల చొప్పున రిక్షా తొక్కాడు బాబు లోహర్. పగలు ప్రయాణిస్తూ, రాత్రిపూట రోడ్డు పక్కన ఉన్న దుకాణాల దగ్గర ఆగుతూ.. తొమ్మిది రోజుల తర్వాత కటక్ ఆసుపత్రికి చేరుకున్నాడు. రెండు నెలల సుదీర్ఘ చికిత్స తర్వాత లోహర్ ఈనెల 19న మోడిపాడలోని తన ఇంటికి తిరిగి ప్రయాణం ప్రారంభించాడు. ఈ క్రమంలో కటక్ జిల్లాలోని టంగి పోలీస్ స్టేషన్ పరిధిలోని చౌద్వార్ సమీపంలో ఈ దంపతులు ఒక చిన్న ప్రమాదానికి గురయ్యారు. ఓ వాహనం ఓవర్‌టేక్ చేస్తున్నప్పుడు రిక్షాను రాసుకుంటూ వెళ్ళింది. దాంతో జ్యోతి రోడ్డుపై పడి తలకు గాయమైంది. లోహర్‌కు ఎలాంటి గాయం కాలేదు. అనంతరం జ్యోతికి స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చికిత్స అందించాడు. రాత్రి బస చేసి 20వ తేదీ ఉదయం సంబల్‌పూర్‌కు తమ ప్రయాణాన్ని తిరిగి ప్రారంభించారు.

# స్వతంత్రంగానే పోటీ చేస్తాం

## రాజీపడే ప్రసక్తి లేదు: టివికె చీఫ్ విజయ్



**మహాబలిపురం, జనవరి 25:** తమిళనాడులో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు కేవలం పోటీగా కాకుండా అత్యంత కీలకమైన ప్రజాస్వామ్య యుద్ధంగా అభివర్ణించారు టీవీకే విజయ్. ఒత్తిళ్లకు తలొగ్గేది లేదని, దేనికీ రాజీపడే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. అన్నాడీఎంకే ప్రత్యక్షంగా, డీఎంకే పరోక్షంగా బిజెపికి సరెండర్ అయ్యాయని విమర్శించారు. తమిళనాడులో అవినీతి అంతానికి సమయం ఆసన్నమైందని చెప్పారు. డిఎంకె ప్రభుత్వాన్ని సాగనంపాల్సిన సమయం వచ్చిందని అన్నారు. ఆదివారం మహాబలిపురంలో నిర్వహించిన సభలో విజయ్ మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు జరగబోయయేది కేవలం ఎన్నిక కాదు. ఒక ప్రజాస్వామ్య యుద్ధం. దీనికి నాయకత్వం వహించబోయే సేనాపతులు మీరే. ప్రస్తుతం అధికారంలో ఉన్న దుష్టశక్తిని, గతంలో రాష్ట్రాన్ని పాలించిన అవినీతి శక్తిని ఎదుర్కొనే ధైర్యం, దృఢ సంకల్పం కేవలం టీవీకేకు మాత్రమే ఉంది. ఏ దుష్ట లేదా అవినీతి శక్తులు రెండూ తమిళనాడును పాలించకూడదు. అలాంటి పార్టీలను నిజంగా ధైర్యంగా వ్యతిరేకించే ధైర్యం, ధృడ సంకల్పం కేవలం మాకు మాత్రమే ఉంది. ప్రజలను రక్షించడానికి, హాని తలపెట్టే వారి నుంచి ఈ నేలను కాపాడానికి మేం ఇక్కడ ఉన్నాం. రాజకీయ నిజాయితీకి కట్టుబడి ఉంటాం. మేం ఎవరి కోసమో లేదా దేనికోసమో ఎప్పటికీ రాజీ పడం అని విజయ్ అన్నారు. ఎన్నికలు, పొత్తుల గురించి చాలా అంచనాలు వేస్తున్నారని, తనని కూడా తక్కువ చేసి మాట్లాడతున్నారని విజయ్ తెలిపారు. మా కోసం ఎవరూ నిలబడరని చెబుతున్నారు.

## బంగ్లాదేశ్‌లో మరో హిందూ



# యువకుడి సజీవ దహనం

### పథకం ప్రకారమే హత్య చేశారు: మృతుడి కుటుంబం ఆరోపణ

**ఢాకా, జనవరి 25: బంగ్లాదేశ్‌లో మైనార్టీలు,** ముఖ్యంగా హిందువుల హత్యాకాండలు ఆగడం లేదు. తాజాగా మరో యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. గ్యారేజ్‌లో నిద్రపోతున్న యువకుడిని సజీవ దహనం చేశారు. ఈ ఘటన బంగ్లాదేశ్ రాజధాని ఢాకాకు 50 కి.మీ. దూరంలో నార్సింగ్ది ప్రాంతంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. తాజా ఘటనతో బంగ్లాదేశ్‌లో మైనారిటీల భద్రతపై ఆందోళనలు అధికమయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. కుమిల్లా జిల్లా లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఖోకాన్ చంద్రభౌమిక్ కుమారుడు చంచల్‌చంద్ర భౌమిక్ (23) నార్సింగ్ది పట్టణంలోని ఖానాబరీ మసీదు మార్కెట్ ప్రాంతంలోని గ్యారేజ్‌లో పని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి తన పని ముగించుకున్న భౌమిక్.. అలసిపోయి గ్యారేజ్ లోపలే నిద్రపోయాడు. ఇంతలో అల్లరి మూక షట్టర్ మూసివేసి పెట్రోల్‌పోసి నిప్పు అంటించింది. దీంతో నిద్రపోతున్న చంచల్ భౌమిక్ మంటల్లో కాలిబూడిదయ్యాడు. అతడు చనిపోయాడని ధ్రువీకరించుకున్న తర్వాతే దుండగులు పారిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. చంచల్ భౌమిక్ తండ్రి కొన్నేళ్ల కిందటే చనిపోగా.. తల్లి, ఇద్దరు సోదరులు ఉన్నారు. అతడి సంపాదనపైనే ఆ కుటుంబం ఆధారపడి జీవిస్తోంది. గ్యారేజీలో గత ఆరేళ్లుగా అతడు పని చేస్తున్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. గ్యారేజ్ సమీపంలోని సిసిటివి ఫుటేజ్‌లను స్వాధీనం చేసుకున్నారు. కుట్రదారులను గుర్తించి, అరెస్టు చేయడానికి గాలింపు కొనసాగుతున్నది. వివిధ బృందాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పక్కా పథకం ప్రకారమే దుండగులు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు బాధిత కుటుంబం, గ్యారేజ్ యజమాని ఆరోపిస్తున్నారు. గతేడాది డిసెంబరులో దీపుచంద్రదాస్, ఖోకొన్ దాస్ అనే వ్యక్తులను కూడా అల్లరిమూక ఈ విధంగా హత్య చేసిన విషయం తెలిసిందే. గత వారం రాజ్‌బరి జిల్లాలలో బంకులో పెట్రోల్ పోయించుకుని డబ్బులు అడిగినందుకు హిందూ యుకుడిని కారుతో తొక్కి చంపి పారిపోయారు. బంగ్లాదేశ్ జనాభాలో దాదాపు 8 శాతంగా ఉన్న హిందువులు.. ప్రస్తుతం భయం భయంగా బతుకుతున్నారు.

## వాయుకాలుష్యంతో కోట్లాదిమందిపై భారం


### కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ, జనవరి 25:** వాయు కాలుష్యం సమస్య కారణంగా ప్రజలు భారీ మూల్యం చెల్లించుకుంటున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా చిన్నారులు, వయోవృద్ధుల పరిస్థితి దారుణంగా ఉందని చెప్పారు. ఈ సంక్షోభాన్ని విస్మరించకూడదని, మార్పు దిశగా మొదటి అడుగు మన గళాన్ని వినిపించడమేనని తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఓ పోస్టు పెట్టారు 'వాయు కాలుష్యం కారణంగా ఆరోగ్యం, ఆర్థిక రూపంలో ప్రజలు భారీ మూల్యం చెల్లించుకుంటున్నారు. కోట్లాది మంది సామాన్య పౌరులు రోజూ ఈ భారాన్ని మోస్తున్నారు. ప్రజల జీవనోపాధి దెబ్బతింటోంది. ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులు, రోజువారీ కూలీలపై తీవ్ర ప్రభావం పడుతోంది' అని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. వాయు కాలుష్యం ఎలా ప్రభావితం చేసిందో ప్రజలు తమ అనుభవాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజల గొంతుకను వినిపించడం తన కర్తవ్యమని చెప్పారు. ఢిల్లీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు ఇటీవల తీవ్రంగా స్పందించిన విషయం తెలిసిందే. దేశ రాజధానికి ఊపిరి పోయడానికి తక్షణమే చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఇందులో భాగంగా కేంద్రంతోపాటు ఢిల్లీ ప్రభుత్వానికి స్పష్టమైన గడువు విధించింది. వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ సూచించిన సిఫార్సులను ఎలా అమలు చేస్తారో చెబుతూ.. రాబోయే 4 వారాల్లో సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది.

# సంక్షిప్తంగా..

## తాడు లేకుండానే 101 అంతస్తుల భవనం ఎక్కిన రాక్‌క్లైంబర్



**తైపీ, జనవరి 25:** తైవాన్‌లోని అత్యంత ఎత్తయిన భవనం తైపీ 101ను రాక్ క్లైంబర్ అలెక్స్ హోన్నోల్డ్ అత్యంత సునాయాసంగా అధిరోంచాడు. ఈ సాహసాన్ని వేలాది మంది వీధుల్లో నిలబడి వీక్షించారు. 508 మీటర్ల ఎత్తున్న ఈ భవనాన్ని ఎక్కేందుకు అతడు ఎటువంటి తాడు లేదా.. ఇతర పరికరాలను ఉపయోగించలేదు కేవలం ఒట్టి చేతులతో ఈ సాహసం చేయడం గమనార్హం. మొత్తం 1,667 అడుగుల ఎత్తుకు చేరుకొనేందుకు అతడికి 90 నిమిషాల సమయం పట్టింది. ఆ భవనంలో ఎత్తయిన ప్రదేశానికి చేరుకొన్నాక అతడు చేతులు ఊపి ప్రజలకు అభివాదం చేశాడు. గతంలో హోన్నోల్డ్ యస్మైట్ నేషనల్ పార్క్‌లోని 900 మీటర్ల ఎత్తున్న ఎల్ క్యాప్టన్ అనే భారీ శిలను ఎక్కి పాపులర్ అయ్యాడు. తాజాగా అతడు తైపీ 101 భవనం బయట భాగంలో ఓ ఉన్న ఎల్ ఆకారపు నిర్మాణాలను చేత్తో పట్టుకొని ఎక్కాడు.

## అమెరికా రాయబారితో జైశంకర్ కీలక భేటీ!




**న్యూఢిల్లీ, జనవరి 25:** అమెరికా రాయబారి, ట్రంప్ సన్నిహితుడు సెర్గియా గోర్‌తో భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ నేడు భేటీ అయ్యారు. ఇరుదేశాల మధ్య భద్రత, వాణిజ్యం, సంక్లిష్ట టెక్నాలజీల్లో సహకారం వంటి అంశాలు పురోగతి సాధించేలా చర్చలు జరిగినట్లు ఎస్.జైశంకర్, గోర్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. భారత్ అమెరికా మధ్య వాణిజ్య చర్చలు కీలక దశలో ఉన్న వేళ ఈ భేటీ జరగడం ప్రాధాన్యం సంతరించుకొంది. మరోవైపు రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ గణనీయంగా తగ్గించిన నేపథ్యంలో 25 శాతం టారిఫ్‌లను వెనక్కి తీసుకునే అవకాశం ఉంది. ఈ విషయాన్ని ఆ దేశ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ కూడా ఇటీవల ధ్రువీకరించారు.

## తమిళనాడులో ఎప్పటికీ హిందీకి చోటు ఉండదు: స్టాలిన్



**చెన్నై,జనవరి 25:** తమిళనాడులో హిందీకి అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పటికీ చోటు లేదని డీఎంకే అధినేత, సీఎం ఎం.కె. స్టాలిన్ స్పష్టం చేశారు. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా భాషా అమరవీరుల దినోత్సవం సందర్భంగా గతంలో హిందీ వ్యతిరేక ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన వారిని ఆయన స్మరించుకున్నారు. హిందీని బలవంతంగా రుద్దడాన్ని తమ రాష్ట్రం ఎప్పటికీ వ్యతిరేకిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా స్టాలిన్ చెన్నైలోని భాషా అమరవీరులు తలముత్తు, నటరాజన్ స్మారకం వద్ద నివాళుల ర్పించారు. అనంతరం సీఎండీఏ భవనంలో వారి విగ్రహాలను ఆవిష్క రించారు. "తమిళ భాషను ప్రాణంలా ప్రేమించే రాష్ట్రం, హిందీ రుద్దడాన్ని ఐక్యంగా ఎదుర్కొంది. ప్రతిసారీ అదే తీవ్రతతో నిరసన తెలిపింది" అని స్టాలిన్ సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా హిందీ వ్యతిరేక ఉద్యమ చరిత్ర, డీఎంకే నేతలు సీఎన్ అన్నాదురై, ఎం. కరుణానిధి పాత్రను వివరిస్తూ ఒక వీడియోను కూడా పంచుకున్నారు.

## కెనడాలో భారత సంతతి వ్యక్తి హత్య



బర్నబే(కెనడా), జనవరి 25: కెనడాలో భారత సంతతికి చెందిన ఓ వ్యక్తి దారుణ హత్య కు గురయ్యాడు. దిల్ రాజ్ సింగ్ గిల్ అనే 28 ఏళ్ల వ్యక్తిని గుర్తుతెలియని దుండుగులు హతమార్చారు. ఈ ఘటన బ్రిటిష్ కొలంబియాలోని బర్నబే వద్ద చోటుచేసుకుంది. వాంకోవర్ వాసి అయిన దిల్‌రాజ్ హత్యకు గ్యాంగ్ వార్ కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ నెల 22న3700 కెనడా వ్లే లో కాల్పులు జరిగినట్లు పోలీసులకు సమాచారం అందింది. వారు అక్కడికి చేరుకునేసరికి అక్కడ ఓ వ్యక్తి రక్తపు మడుగులో పడి ఉన్నాడు. అతడిని కాపాడేందుకు పోలీ సులు యత్నించినా ఫలితం లేకుండాపోయింది. ఆ తర్వా త బక్స్‌టోన్ వీధిలో ఓ వాహనం తగలబడటాన్ని అధికారులు గుర్తించారు. ఈ రెండు ఘటనల మధ్య సంబంధం ఉండి ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# గణతంత్ర దినోత్సవం



త్యాగధనుల బలిదానంపు క్రియలచే
స్వాతంత్ర్య పాలన పాదుకొల్పి
దిట్టతనముతోడ దీపించు ప్రజలలో
సమతాను రాగంబు చక్కబరచి
ఆంగ్ల ముష్కరమూక ఆగడాలు తొలగ
సత్యాగ్రహులనెల్ల శాంతపరచి
మూడు రంగుల తోడ పొలుపారు జెండాకు
మనసార వందన మాచరించి.
విమల రాజ్యాంగ నిర్మాణ మమలుకాగ
సార్వభౌమాధికారంబు సాగుచుండ
జనవరి యిరువదారున చక్రగతిని
తిరిగి వచ్చిన గణతంత్ర దినమునకు
స్వాగతము పల్కు మిత్రమా!సాదరముగ!!

**- విద్వాన్ చింతలపాటి పూర్ణచంద్ర రావు.**

## తిరంగా బర్ఫీ



కావలసినవి: వేపుడు సెనగలు రెండు కప్పులు, పంచదార కప్పు, బాదం, జీడిపప్పు, పిస్తా పలుకులు పది చొప్పున, యాలకుల పొడిచిటికెడు, నెయ్యినాలుగు టేబుల్స్పూన్లు, మీగడపావుకప్పు, చిక్కటిపాలుఅరకప్పు, ఆరెంజ్ఫుడ్ కలర్, గ్రీన్ఫుడ్కలర్టీస్పూన్ చొప్పున. తయారీ: వేపుడు సెనగలను పొట్టు తీసుకుని పక్కన పెట్టుకోవాలి. పంచదార, బాదం, జీడిపప్పు పలుకులను మిక్సీ జార్లో వేసి పొడి చేసుకోవాలి. తర్వాత సెనగలు వేసి మెత్తగా పొడి చేసుకోవాలి. ఈ రెండిటిని వెడల్పాటి గిన్నెలో వేసి, నెయ్యి, మీగడ జతచేసి బాగా కలపాలి. మీగడ బదులు మిల్క్ పౌడర్ కూడా వేసుకోవచ్చు. కొంచెం కొంచెం పాలు పోస్తూ పిండిని ముద్దలా చేయాలి. దీన్ని మూడు బాగాలు చేసుకోవాలి. ఒకదాంట్లో ఆరెంజుఫుడ్కలర్, మరోదాంట్లో గ్రీన్ఫుడ్కలర్ వేసి బాగా కలపాలి. ప్లేటుకు నెయ్యి రాసి జీడిపప్పు, బాదం, పిస్తా పలుకులు వేసుకోవాలి. ముందుగా ఆరెంజ్ రంగులో ఉన్న ముద్దను వేసి ప్లేటు నిండా పరచాలి. తర్వాత తెల్లని ముద్దను, చివరగా పచ్చరంగులో ఉన్న ముద్దను వేసి సమానం గా పరచాలి. గంటపాటు కదపకుండా పక్కన పెట్టేయాలి, తర్వాత చాకుతో నలుచ దరంగా ముక్కలు చేసుకోవాలి. అంతే మూడు రంగుల ముచ్చటైన బర్ఫీ రెడీ.

## అందానికి చెరకు



రుచితో పాటు పోషకాలు నిండి ఉన్న చెరకు రసం ఆరోగ్యానికే కాదు.. అందానికి, కేశ సౌందర్యానికీ మేలు చేస్తుందంటున్నారు నిపుణులు. అదెలాగో తెలుసుకుందాం రండి..

**చర్మకాంతికి..** చెరకురసంలో కొద్దిగా ముల్తానీ మట్టిని కలిపి పేస్ట్ చేసుకుని ముఖానికి పట్టిస్తే చర్మంపై ఉన్న నల్ల మచ్చలు తొలగిపోతాయి. ఇందులో ఉండే సమ్మేళనాలు చర్మకణాలను పునరుత్తేజితం చేస్తాయి. చెరకు రసంలో తేనె కలిపి.. ఈ మిశ్రమంతో పావుగంట పాటు చర్మానికి మర్దన చేయాలి. తర్వాత ఇరవై నిమిషాల పాటు ఉంచి కడిగే యాలి. వారానికి రెండుసార్లు ఇలా చేయడం వల్ల చర్మం మృదువుగా మారు తుంది.. కాఫీపొడికి కాస్త చెరకు రసాన్ని చేర్చి స్క్రాబ్లో ఉపయోగిస్తే చర్మం కాంతులీను తుంది. నిమ్మరసం, యాపిల్ జ్యూస్, ద్రాక్ష రసం, కొబ్బరి పాలు, చెరకు రసం.. వీటని సమపాళ్లలో తీసుకొని బాగా కలుపు కోవాలి. ఈ మిశ్రమాన్ని చర్మానికి పట్టించాలి. ఇలా చేయడం వల్ల చర్మంపై ఉన్న మొటిమలు, మచ్చలు తొలగిపోయి మేనికి మెరుపు వస్తుంది. చర్మాన్ని యవ్వనంగా, బిగుతుగా ఉంచడానికి మామూలు ఐస్క్యూబ్ల కన్నా చెరకు రసంతో తయారు చేసుకున్న ఐస్ క్యూబ్ను వాడితే రెట్టింపు ఫలితాలుంటా యని నిపుణులు భావిస్తున్నారు. బొప్పాయి గుజ్జులో చెరకు రసాన్ని కలిపి పట్టించడం వల్ల చర్మం బిగుతుగా మారుతుంది.స్వచ్ఛమైన చెరకు రసాన్ని ప్రతిరోజూ రాత్రి పడు కునే ముందు చర్మానికి పట్టిస్తే చర్మం ఆరోగ్యంగా, మృదువుగా మారుతుంది.చెరకు రసం జుట్టుకు సహజ సిద్ధమైన కండిషనర్గా ఉపయోగపడుతుంది.

# బంజరు బంగారమాయెనే !
# ఎడారిలో ఆపిల్ పూలు పూచెనే!



మహిళలు వంటింటికే పరిమితం కాకుండా బయటకు వచ్చి దేశ ఆర్థిక, ఆహార స్వయం సమృద్ధిలో తన వంతు కృషి చేయాలని సంతోష్ దేవి పిలుపునిస్తున్నారు. సాగుకు ఏ మాత్రం అనుకూలం కాని బీడు భూముల్లో దానిమ్మ, యాపిల్ వంటి పండ్లను పండించి, రాజస్థాన్కు చెందిన ఓ మహిళ అసాధ్యాన్ని సుసాధ్యం చేసి అరుదైన గౌరవం దక్కించుకుంది. రాష్ట్రస్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకలకు ప్రత్యేక ఆహ్వానితురాలిగా ఎంపికైంది. సికార్ జిల్లాలోని బేరీ గ్రామానికి చెందిన సంతోష్ దేవి.

తన సంకల్పబలంతో ఈ ఘనత సాధించింది. రసాయన రహిత సాగుతో భారత దేశంలో మహిళా సాధికారత, స్థిరమైన వ్యవసాయానికి శక్తి వంతమైన చిహ్నంగా మారింది. సాంప్రదాయ వ్యవసాయం అరుదుగా వృద్ధి చెందే పొడి, ప్రతి కూలమైన భూభాగంలో ఆమె విజయ వంతంగా పండ్లను పండించింది. ఆమె ఎంపిక రాజస్థాన్ మహిళా రైతులకు ఓ ప్రేరణ. సంతోష్ దేవి విజయం దాదాపు రెండు దశాబ్దాల పట్టుదల ఫలితం. నిరంతర ప్రయోగాలు , సంకల్పం ద్వారా, ఆమె బంజరు భూమిని ఉత్పాదక తోటలుగా మార్చింది. ముఖ్యంగా దానిమ్మ సాగులో చేసిన కృషి రాష్ట్ర స్థాయిలో ఆమెకు గుర్తింపును తెచ్చిపెట్టింది. రసాయనాలు లేని సేంద్రియ పద్ధతిలో దానిమ్మ, యాపిల్, జామ పండ్లను సంతోష్ దేవి సాగు చేస్తోంది. ఆమె పొలంలో పండిన దానిమ్మ పండ్లు 800 గ్రాముల వరకు, యాపిల్స్ 200 గ్రాముల వరకు బరువు తూగుతుండటం విశేషం. ఒకప్పుడు తన భర్త ఆదాయం రూ.3 వేల కాగా, ఇప్పుడు తాను ఆపిల్, దానిమ్మ సాగులో నెలకు రూ.40 వేల సంపాదిస్తున్నట్లు వివరించింది. సుస్థిర వ్యవసాయం , మహిళా సాధికారతకు ఆమె మద్దతు ఇస్తున్నారు. ప్రతికూల పరిస్థితుల్లో వ్యవసాయం గురించి మాట్లాడుతూ, దానిమ్మ, ఆపిల్ , జామ పండ్లను పండించేటప్పుడు రసాయన రహిత వ్యవసాయాన్ని పాటించడంపై తాను ప్రత్యేక శ్రద్ధ పెట్టానని ఆమె చెప్పారు. ఆమె ప్రయాణం ఇప్పటికే వేలాది మంది మహిళలను ఉద్యానవన పంటలను జీవనోపాధిగా స్వీకరించడానికి ప్రేరేపించింది. వ్యవసాయంతో పాటు, ఆమె పర్యావరణ పరిరక్షణకు కూడా కట్టుబడి ఉంది. తోటి రైతులతో కలిసి ప్రతి సంవత్సరం దాదాపు 80 వేల మొక్కలను నాటుతుంది. 17 సంవత్సరాల ఎడారి పరిస్థితులలో దానిమ్మ , ఆపిల్లను పెంచి కోసం గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆహ్వానించబడిన రాజస్థాన్ రైతు సంతోష్ దేవి. గణతంత్ర దినోత్సవ కార్యక్రమానికి ఆమె ఎంపిక మహిళా సాధికారత , అసమానతలకు వ్యతిరేకంగా కొత్త ఆవిష్కరణలు చేసే రైతులను గుర్తించడం ప్రాముఖ్యతపై బలమైన సందేశంగా భావిస్తున్నారు.



ఆమె ఉత్పత్తుల నాణ్యతలో సంతోష్ దేవి సాధించిన విజయం స్థాయి ప్రతిబింబిస్తుంది.

## నీ వెనకే నేనుంటా !

అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు, సకల దేవాధిదేవుడు శ్రీమన్నారాయణుడు. జగన్నాథు డైన ఆ మహావిష్ణువు ధరించిన దశావతారాల్లో ప్రతి ఒక్కటీ ప్రత్యేకమే. ఓం నమో నారాయ ణాయ' అన్న అష్టాక్షరీ మంత్ర పూర్ణ స్వరూపం శ్రీకృష్ణ భగవానుడు. 'కృష్ణస్తు భగవాన్ స్వయమ్' అన్న మహర్షుల వాక్కుకు ప్రతిగా శిష్టరక్షకుడిగా, దుష్టశిక్షకుడిగా, ధర్మపరిరక్షకుడిగా ఆయన అవతరిం చాడు. 'కృష్ణ' అన్న పేరు పరమ పవిత్రమైంది. అతి విశిష్టమైంది. కృష్ణ అన్న పదంలోని 'క' కారం బ్రహ్మ =చకం. 'ఋ'కారం విష్ణు వాచకం. 'ష'కారం శివ వాచకం. 'ణ' కారం ధర్మవాచకం. ఆ పేరులో కల దేవతలూ నిక్షిప్తమై ఉన్నారు. ఒక్క కృష్ణ నామస్మరణం సర్వదేవతా ప్రార్థనా పుణ్య పాదితమై, ధర్మమార్గ ప్రబోధితమై, సకల పాపహరణమై నిలిచి, తలచిన వారికి ముక్తిని పాదిస్తుంది. తయుగంలో ధ్యానం వల్ల, త్రేతాయుగంలో యజ్ఞం వల్ల, ద్వాపర యుగంలో పూజలు, వ్రతాల వల్ల అదే ఫలితాలన్నీ కలియుగంలో కేవలం హరేరామ హరేరామ రామరామ హరేహరే, హరేకృష్ణ కృష్ణ కృష్ణకృష్ణ హరేహరే అన్న నామమంత్ర స్మరణతో పొందగలుగు తారు. దీన్ని స్వయంగా మ్మదేవుడు నారదుడికి వివరించాడని పురాణ వచనం. హావిష్ణువు మహోన్నత అవతారమైన శ్రీకృష్ణుడు... అసంఖ్యాక రాక్షసుల అరాచకాలను వెంచలేక, ఆ దుష్టుల భారాన్ని మోయలేక, శరణు కోరిన భూదేవి కోరికను మన్నించాడు. మిపై అవతరించాడు. శ్రీముఖ నామ సంవత్సరం, శ్రావణమాసం, బహుళ అష్టమి తిథి, రోహిణీ వృషభ లగ్నంలో జన్మించిన అత్యంత శుభ ముహూర్తం. కంసుడి బారినపడకుండా దేవుణ్ణి గోకులంలో దించాడు వసుదేవుడు. అక్కడ పూతన, శకటాసుర, వృత్రాసుర, ధేనుకాసుర, సురాది ఎందరో రాక్షసులను బాల్యంలోనే సంహరించాడు మాధవుడు. బాలకృష్ణుడిగా, చిలిపి అడిగా, రాధాకృష్ణుడిగా దర్శనమిచ్చాడు. శ్రీకృష్ణ లీలంటే ఇష్టపడని వాళ్లుండరు. కానీ ఆ లీలు వివరించే కథలు కేవలం కాలక్షేపం కోసం కాదు. జ్ఞాన వైరాగ్యాలతో కూడకుని, భక్తి శ్రద్ధలకు నెలవైనవి. అందులో నివృత్తి మార్గం వివరించడం

## కళ్లారా నవ్వండి..



నవ్వడం ఒక భోగం - నవ్వించడం ఒక యోగం - నవ్వలేకపోవడం ఒక రోగం' అన్నట్టు గానే నవ్వు.. ఎన్నో అనారోగ్య సమస్యలను దూరం చేస్తుంది. అనేక పరిశోధనల్లో ఈ విషయం వెల్లడైంది. తాజాగా, మనస్ఫూర్తిగా నవ్వడం వల్ల కళ్లకు ఎంతో మేలు జరుగుతుందని మరో అధ్యయనం తేల్చింది. 'డ్రై ఐస్'లాంటి కంటి సమస్యల నుంచి నవ్వు ఉపశమనం కలిగిస్తుందని బ్రిటిష్ మెడికల్ జర్నల్లో ఓ కథనం ప్రచురితమైంది. బాగా నవ్విన ప్పుడు కళ్ల నుంచి నీరుకారడం చూస్తుంటాం.అలా కళ్లలో చేరిన తడి వల్ల.. డ్రై ఐస్ సమస్య నుంచి ఉపశమనం లభిస్తుందని పరిశోధకులు చెబుతున్నారు. ఎక్కువగా నవ్వడం వల్ల.. శరీరంలో ఎండార్ఫిన్ల ఉత్పత్తి పెరుగుతుంది. ఇది ఒత్తిడి స్థాయులను తగ్గించి.. నాడీ వ్యవస్థ సమతుల్యతను కాపాడటంలో సాయపడుతుంది. ఇది కన్నీటి ఉత్పత్తిని పెంచుతుంది. మరోవిషయం ఏమిటంటే, నవ్వు రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. కళ్లకు కూడా రక్త ప్రసరణ ఎక్కువగా జరిగి.. దురద, మంట లాంటి ఇబ్బందులను దూరం చేస్తుందని అధ్యయనంలో తేలింది. ఇక 'డ్రై ఐస్ సిండ్రోమ్'ను తగ్గించడంలో లాఫింగ్ థెరపీ గొప్పగా పనిచేస్తుంది.

## రాగి ఇడియప్పం



**కావలసినవి:**
రాగి పిండి: ఒక కప్పు, బియ్యపు పిండి: అర కప్పు, నూనె: ఒక టేబుల్ స్పూన్, ఉప్పు: తగినంత .

**తయారీ విధానం**
స్టవ్మీద పాన్ పెట్టి రాగి పిండి, బియ్యపు పిండి వేసి సన్నని మంటపై అయిదు నిమిషాలు వేయించాలి. ఒక గిన్నెలో ఒకటిన్నర కప్పు నీళ్లు, ఒక టీస్పూన్ నూనె, కొద్దిగా ఉప్పు వేసి మరిగించాలి. వేడి నీళ్లను పిండిలో వేసి బాగా కలిపి చల్లారే వరకు పక్కనపెట్టాలి. చల్లారిన పిండిని ముద్దలా చేయాలి. స్టవ్మీద ఇడ్లీ పాత్ర కానీ, గిన్నె కానీ పెట్టి ఆవిరికి నీళ్లు పెట్టాలి. పిండి ముద్దను కొద్దికొద్దిగా తీసుకుని జంతికల గొట్టంలో వేసి ఒత్తుకుని ఆవిరిపై ఉడికిస్తే వేడివేడి రాగి ఇడియప్పం సిద్ధం. ఇష్టపడేవాళ్లు పైనుంచి పచ్చికొబ్బరి చల్లుకోవచ్చు.


# తెర

## ఏప్రిల్ 10న ప్రపంచ వ్యాప్తంగా 'స్వయంభు' రిలీజ్



పాన్ఇండియా బ్లాక్బస్టర్ కార్తికేయ 2తో దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందిన నిఖిల్, ఇప్పుడు తన ప్రతిష్టాత్మక 20వ చిత్రం 'స్వయంభు'తో ప్రేక్షకులను అలరించబోతున్నారు. భారీ స్థాయిలో నిర్మించబడిన ఈ హిస్టారికల్ యాక్షన్ ఎపిక్ కి భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహించారు. సంయుక్త, నభా నటేష్ హీరోయిన్స్. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్ పై భువన్, శ్రీకర్ నిర్మించారు. ఠాగూర్ మధు సమర్పిస్తున్నారు. టాప్ క్లాస్ నిర్మాణ విలువలు, పవర్ ఫుల్ పాన్ఇండియా విజన్ తో వస్తున్న స్వయంభు నిఖిల్ అత్యంత ప్రతిష్టాత్మక వెంచర్లలో ఒకటిగా నిలుస్తుంది.స్వయంభు ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్గా రిలీజ్ కానుంది. సమ్మర్ రిలీజ్ కి ఇది పర్ఫెక్ట్ డేట్.స్వయంభు విఎఫ్ఎక్స్ అద్భుతంగా వుండబోతున్నాయి. ఇండియాలో టాప్ విఎఫ్ఎక్స్ కంపెనీలు ఈ సినిమా కోసం వర్క్ చేస్తున్నాయి. విజువల్ వండర్ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం కోసం కావాల్సినంత సమయం తీసుకొని, వరల్డ్ క్లాస్ అవుట్పుట్ అందించేందుకు మేకర్స్ పూర్తి కమిట్మెంట్తో పని చేస్తున్నారు.స్వయంభు నిఖిల్ కెరియర్ లో హైయెస్ట్ బడ్జెట్ సినిమా. కార్తికేయ 2 తర్వాత పాన్ ఇండియా స్థాయిలో హ్యూజ్ బజ్ వున్న సినిమా.ఇందులో తన పాత్ర కోసం నిఖిల్ పూర్తిగా ఫిజికల్ ట్రాన్స్ ఫర్మేషన్ అవ్వడంతో పాటు ఇంటెన్స్ ట్రైనింగ్ తీసుకున్నారు. ఇప్పటివరకు రిలీజ్ చేసిన ప్రమోషన్ కంటెంట్ సినిమా మీద భారీ అంచనాలను పెంచింది .

## 'మన శంకరవరప్రసాద్ గారు' అదిరిపోద్ది సాంగ్ విడుదల



భీమ్స్ సంగీతంలో కాసర్ల శ్యామ్ రాసిన మాస్ గీతం సోషల్ మీడియాలో ట్రెండింగ్గా మారిన మెగా విక్టరీ సాంగ్ అగ్ర కథానాయకులు మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేశ్ కలిసి తెరపై కనిపిస్తే అభిమానులకు కనుల పండుగే. అలాంటిది వారిద్దరూ కలిసి మాస్ స్టెప్పులేస్తే ఆ సందడి రెట్టింపు అవుతుంది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరంజీవి హీరోగా వచ్చిన 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రంలో ఈ అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. ఈ సినిమాలో ప్రత్యేక పాత్రలో కనిపించిన వెంకటేశ్.. చిరంజీవితో కలిసి అదిరిపోద్ది సంక్రాంత్రి అనే పాటలో సందడి చేశారు. తాజాగా ఈ మెగా విక్టరీ మాస్ సాంగ్పూర్తి వీడియోను చిత్ర బృందం విడుదల చేసింది.సంక్రాంతి కానుకగా విడుదలై ఘన విజయం సాధించిన ఈ చిత్రంలో చిరు, వెంకీ కలిసి చేసిన ఈ ప్రత్యేక గీతం కీలక ఆకర్షణగా నిలిచింది. ప్రముఖ సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో అందించిన ఊపునిచ్చే సంగీతానికి, గీత రచయిత కాసర్ల శ్యామ్ మాస్ పల్స్ తెలిసిన సాహిత్యాన్ని అందించారు. గాయకులు నకాశ్ అజీజ్, విశాల్ దద్లానీ తమ ఎనర్జిటిక్ గాత్రంతో పాటకు ప్రాణం పోశారు.థియేటర్లలో అభిమానులను ఉర్రూతలూగించిన ఈ పాట పూర్తి వీడియో కోసం ఎదురుచూస్తున్న వారికి చిత్ర యూనిట్ ట్రీట్ అందించింది.ప్రస్తుతం ఈ ఫుల్ వీడియో సాంగ్ సోషల్ మీడియాలో ట్రెండింగ్లో ఉంది. ఇద్దరు లెజెండ్స్ మధ్య కెమిస్ట్రీ, వారి గ్రేస్ ఫుల్ డ్యాన్స్ మూమెంట్స్ అద్భుతంగా ఉన్నాయని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

## నితిన్ 36వ సినిమా షూటింగ్ ప్రారంభం



వైవిధ్యమైన సినిమాలు, పాత్రలతో తనదైన గుర్తింపు సంపాదించుకున్న హీరో నితిన్ తన 36 సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వెర్సటైల్ డైరెక్టర్ వి.ఐ.ఆనంద్ దీనికి దర్శకత్వం వహించనున్నారు. పవన్ కుమార్ సమర్పణలో సక్సెస్ఫుల్ బ్యానర్ శ్రీనివాస సిల్వర్ స్క్రీన్పై శ్రీనివాస చిట్టూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. రథ సప్తమి సందర్భంగా సైఫై ఎంటర్టైనర్ను మేకర్స్ అనౌన్స్ చేశారు.విభిన్నమైన కథలు, కథనాలతో సినిమాలను రూపొందించే దర్శకుడు వి.ఐ.ఆనంద్ మరోసారి ఈ భారీ ప్రాజెక్ట్తో క్రియేటివ్ బౌండరీస్ రేంజ్ను మరింత పెంచటానికి సిద్ధమయ్యారు. సినీ ప్రేక్షకులకు ఇప్పటి వరకు చూడని సరికొత్త సినిమాటిక్ ఎక్స్పీరియెన్స్ను ఇచ్చేలా ఈ క్రేజీ సినిమా రూపొందనుంది. ఊరు పేరు భైరవకోన చిత్రం తర్వాత ఈ విజనరీ డైరెక్టర్ హై కాన్సెప్ట్ సైఫై ఎంటర్టైనర్తో ప్రేక్షకులను మెప్పించనున్నారు.టాలెంటెడ్ యాక్టర్ నితిన్ హీరోగా నటిస్తుండటంతో ఈ మూవీపై ఎగ్జయిట్మెంట్ మరింతగా పెరిగింది. వెర్సటైల్, పవర్ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్తో ప్రేక్షకులను ఆకట్టుకునే నితిన్ వంటి కథానాయకుడితో..క్వాలిటీ సినిమాలను గ్రాండ్ స్కేల్లో సినిమాను రూపొందించే శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ సంస్థ చేతులు కలపటం ఇండస్ట్రీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది.ఈ ప్రెస్టీజియస్ కాంబోను చూస్తుంటే సినిమాపై నిర్మాత శ్రీనివాస చిట్టూరికి ఉన్న ప్యాషన్ కనిపిస్తోంది. ఆదివారం (జనవరి 25) రథ సప్తమి సందర్భంగా ఈ సినిమాను అధికారికంగా అనౌన్స్ చేశారు. త్వరలోనే షూటింగ్ స్టార్ట్ కానుంది. టాలెంటెడ్ హీరో, వైవిధ్యంగా సినిమాను తెరకెక్కించే దర్శకుడు, గ్రాండ్గా సినిమాను నిర్మించే సంస్థ కలయికలో రూపొందబోయే ఈ సైఫై ఎంటర్టైనర్ నితిన్ కెరీర్లో అత్యంత ఆసక్తికరమై ప్రాజెక్ట్స్ లో ఒకటిగా మారనుంది.

## 30న రిలీజ్ కు వస్తున్న 'త్రిముఖ' మూవీ..




యోగేష్ కల్లె హీరోగా, సన్నీ లియోన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా "త్రిముఖ". అకృతి అగర్వాల్, దిःదీ ఆదిత్య శ్రీవాస్తవ, మొట్టా రాజేంద్రన్, ఆశు రెడ్డి, సాహితీ దాసరి, ప్రవీణ్, షకలక శంకర్, సుమన్, రవి ప్రకాష్, జీవా, సమ్మెట గాంధీ, జెమినీ సురేశ్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని అఖిరా డ్రీమ్ క్రియేషన్స్ బ్యానర్ మీద శ్రీదేవి మద్దాలి, రమేష్ మద్దాలి నిర్మిస్తున్నారు. ఈ మూవీకి రాజేష్ నాయుడు దర్శకత్వం వహిస్తున్నారు. ఐదు భాషల్లో ఏకకాలంలో చిత్రీకరించిన ఈ మూవీని భారీ బడ్జెట్తో నిర్మించారు.పాన్ఇండియా ప్రాజెక్ట్గా రానున్న "త్రిముఖ" సినిమానిఈ నెల 30న హిందీ, తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ చేయనున్నారు. ఈ రోజు "త్రిముఖ" సినిమా డేట్ అనౌన్స్ మెంట్ ప్రెస్ మీట్ హైదరాబాద్ ఫిలింఛాంబర్ లో నిర్వహించారు. ఈ సందర్భంగానటుడు జెమినీ సురేష్ మాట్లాడుతూ, స్క్రీన్ ప్లే బేస్డ్ సినిమాలు మనకు తక్కువగా వస్తుంటాయి. అలాంటి మంచి స్క్రీన్ ప్లే బేస్డ్ సినిమా "త్రిముఖ". మంచి కంటెంట్ తో వస్తున్న ఈ సినిమా మీ అందరికీ నచ్చుతుంది. నటుడు ప్రవీణ్ మాట్లాడుతూ,"త్రిముఖ" సినిమా ఈ నెల 30న మీ ముందుకు వస్తోంది. స్ట్రాంగ్ కంటెంట్ ఉన్న చిత్రమిది. మేమంతా మంచి క్యారెక్టర్స్ చేశాం. ది. నటుడిగా నాకు మంచి సంతృప్తినిచ్చిన చిత్రవి అన్నారు. నటి సాహితీ దాసరిమాట్లాడుతూ, థ్రిల్లర్ ఎలిమెంట్స్తో పాటు మంచి ఎంటర్ టైన్ మెంట్ ఇచ్చే చిత్రమిది. ఈ సినిమాలో నేనొక ఇంపార్టెంట్ రోల్. డైరెక్టర్ రాజేశ్ నాయుడు మాట్లాడుతూ, ఒక మంచి కథతో, బలమైన స్క్రీన్ ప్లే తో"త్రిముఖ" చిత్రాన్ని రూపొందించాను.

## పురుష నుండి పాట విడుదల..



భార్యాభర్తల తగువులు, గిల్లికజ్జాలు, సంసారం చుట్టూ అల్లే కథలు ఎప్పటికీ ఆడియెన్స్కి బోర్ కొట్టవు. ఇక ప్రస్తుత ట్రెండ్కు తగ్గట్టుగా భార్యాభర్తల బంధాన్ని వివిధ కోణాల్లో టచ్ చేస్తూ తీస్తున్న చిత్రం 'పురుష'. బత్తుల సరస్వతి సమర్పణలో కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై బత్తుల కోటేశ్వరరావు ఈ'పురుష: సినిమాను నిర్మిస్తున్నారు. వీరు వులవల దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీతో పవన్ కళ్యాణ్ బత్తుల హీరోగా పరిచయం కాబోతున్నాడు. కేవలం పోస్టర్లు, ఫస్ట్ లుక్స్తోనే జనాల్లో ఇంట్రెస్ట్ను క్రియేట్ చేసిన మేకర్స్ రీసెంట్గా టీజర్తో అందరినీ తెగ నవ్వించేశారు.ఇక తాజాగా ఈ చిత్రంలోని థీమ్ సాంగ్ అన్నట్టుగా. మగాడి మీద జాలి కలిగేలా, మగాడి పరిస్థితిపై సానుభూతి పెరిగేలా జాలి పడేదెవ్వడు. మగాడి మీద జాలి పడేదెవ్వడు అంటూ సాగే పాటను రిలీజ్ చేశారు. ఈ పాటను ఎం. ఎం. కీరవాణి అద్భుతంగా ఆలపించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫర్గా సతీష్ ముత్యాల, ఎడిటర్గా కోటి, ఆర్ట్ డైరెక్టర్గా రవిబాబు దొండపాటి వర్క్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి.

## ఫిబ్రవరి 6న 'సై్క' సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్



మురళీ కృష్ణంరాజు, శృతి శెట్టి, ఆనంద్ ప్రధాన పాత్రల్లో వేలార్ ఎంటర్ టైన్ మెంట్ స్టూడియోస్ బ్యానర్ పై నాగిరెడ్డి గుంటక, శ్రీలక్ష్మి గుంటక, మురళీ కృష్ణం. శ్రీరాజు, పృధ్వీ పెరిచర్ల నిర్మిస్తున్న సినిమా 'సై్క' . పృధ్వీ పెరిచర్ల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంతో శివ ప్రసాద్ అనే కొత్త మ్యూజిక్ డైరెక్టర్ ఇండస్ట్రీకి పరిచయమవుతున్నారు. 'సై్క' సినిమా ఫిబ్రవరి 6న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.ఈ రోజు 'సై్క' సినిమా ట్రైలర్ రిలీజ్ చేశారు. ఈ ట్రైలర్ ఎలా ఉందో చూస్తే ఫ్రెండ్స్ మధ్య జరిగే సరదా సన్నివేశాలతో ట్రైలర్ మొదలవుతుంది. హీరో హీరోయిన్స్ మధ్య పరిచయం ప్రేమగా మారడం, వారి ప్రేమలోని ఎమోషన్ ఆకట్టుకునేలా చిత్రీకరించారు. హీరోయిన్ క్యారెక్టర్ స్ట్రాంగ్ గా డిజైన్ చేసినట్లు ట్రైలర్ తో తెలుస్తోంది. హీరో పర్సనల్ లైఫ్ ఫ్లాష్ బ్యాక్ హార్ట్ టచింగ్ గా ఉంది. కొన్ని అపార్థాలతో హీరో హీరోయిన్ ప్రేమలోనూ కొన్ని విబేధాలు వస్తాయి. ఈ జంట ఎలా తిరిగి ఒక్కటయ్యారు ?, హీరో పర్సనల్ లైఫ్ లో తండ్రితో ఉన్న ఫ్లాష్ బ్యాక్ ట్రాజెడీ ఏంటి? అనేది తెరపై చూడాలి.

# ప్రపంచ కప్‌తో కటాఫ్



## బోర్డర్ల గొడవ, బాంబుల భయం

### 30 యేళ్లలో 6 ప్రధాన జట్లు బాయ్‌కాట్

**న్యూఢిల్లీ:** ప్రపంచ క్రికెట్‌లో ఐసిసి టోర్నీలు అంటేనే హై వోల్టేజ్ పోరుకు కేరాఫ్ అడ్రస్. కానీ కొన్నిసార్లు ఆటగాళ్ల టాలెంట్ కంటే రాజకీయ వైషమ్యాలు, భద్రతాపరమైన ఆందోళనలే కీలకంగా మారుతాయి. తాజాగా 2026 టి20 వరల్డ్ కప్ కోసం భారత్ వచ్చేందుకు బంగ్లాదేశ్ సృష్టిస్తున్న రచ్చ ఈ చర్చను మళ్లీఊ తెరపైకి తెచ్చింది. గత 30 ఏళ్లలో వరల్డ్ కప్ ఆడేందుకు నిరాకరించిన ఆరు ప్రధాన ఘటనలు ఉన్నాయి. వీటిలో క్రికెట్ చరిత్రలో తొలిసారిగా ఒక పెద్ద జట్టు 1996, వరల్డ్ కప్ ఆడబోమని తేల్చి చెప్పింది. శ్రీలంక, భారత్, పాకిస్థాన్‌లు సంయుక్తంగా ఈ టోర్నీని నిర్వహించాయి. అప్పట్లో శ్రీలంకలో ఎల్టీటీఈ అంతర్యుద్ధం తారాస్థాయిలో ఉంది. కొలంబోలోని సెంట్రల్ బ్యాంక్ సమీపంలో భారీ బాంబు పేలుడు సంభవించడంతో ఆస్ట్రేలియా, వెస్టిండీస్‌లు లంకలో అడుగుపెట్టేందుకు భయపడ్డాయి. ఐసిసి ఎన్ని హామీలు ఇచ్చినా అవి వినలేదు. ఫలితంగా శ్రీలంకకు వాకోవర్ లభించింది. అలాగే సౌతాఫ్రికా, జింబాబ్వే, కెన్యా వేదికగా 2003లో ఈ టోర్నీ జరిగింది. అప్పట్లో జింబాబ్వేలో రాబర్ట్ ముగాబే పాలనపై తీవ్ర నిరసనలు ఉండేవి. మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని ఆరోపిస్తూ ఇంగ్లండ్ హరారేలో జింబాబ్వేతో ఆడేందుకు నిరాకరించింది.

ఈ నిర్ణయంతో ఇంగ్లండ్ పాయింట్లను కోల్పోయి టోర్నీ నుంచి నిష్క్ర మించాల్సి వచ్చింది. అదే 2003 వరల్డ్ కప్‌లో మరో వివాదం చోటుచేసుకుంది. నైరోబీలో భద్రతా పరిస్థితులు ఏమాత్రం బాగాలేవని, తీవ్రవాద ముప్పు పొంచి ఉందని న్యూజిలాండ్ కెన్యాలో ఆడేందుకు నిరాకరించింది.

ఐసిసి పట్టుబట్టినప్పటికీ న్యూజిలాండ్ వెనక్కి తగ్గలేదు. దీనివల్ల కెన్యాకు పాయింట్లు లభించాయి. 2009 టోర్నీ మిగిలిన వాటికంటే కాస్త డిఫరెంట్. బ్రిటన్‌తో ఉన్న దౌత్యపరమైన విభేదాల కారణంగా జింబాబ్వే ఇంగ్లండ్‌లో జరగాల్సిన వరల్డ్ కప్ నుంచి తన పేరును వెనక్కి తీసుకుంది. జింబాబ్వే క్రికెటర్లకు వీసాలు ఇచ్చేందుకు ఇంగ్లండ్ నిరాకరించడంతో ఈ వివాదం తలెత్తింది. దీంతో ఆ ప్లేస్‌లో స్కాట్లాండ్‌కు అవకాశం వచ్చింది. బంగ్లాదేశ్ వేదికగా 2016 అండర్19 వరల్డ్ కప్‌కు ఆస్ట్రేలియా రాలేదు. తమ దేశ ఇంటలిజెన్సీ హెచ్చరికలతో బంగ్లాదేశ్‌లో ఉగ్రవాద దాడులు జరిగే అవకాశం ఉందని ఆసీస్ భావించింది.

ఐసీసీ అత్యున్నత భద్రత కల్పిస్తామని చెప్పినా ఆసిస్ బహిష్కరించడంతో ఆ ప్లేస్‌లో ఐర్లాండ్ పాల్గొంది. ఇప్పుడు 2026 టీ20 వరల్డ్ కప్‌కు భారత్ రావడానికి బంగ్లాదేశ్ నిరాకరిస్తోంది. దౌత్యపరమైన ఉద్రిక్తతల వల్ల తాము ఇండియాలో ఆడలేమని బంగ్లాదేశ్ ప్రకటించింది. తమ మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలని ఐసీసీని కోరింది. అయితే భద్రతా పరంగా భారత్‌లో ఎలాంటి ఇబ్బంది లేదని ఐసీసీ తేల్చి చెప్పినా బంగ్లాదేశ్ మొండికేస్తోంది.



## టాటా స్టీల్ చెస్ ..

## అర్జున్, గుకేశ్, అరవింద్ ఓటమి

### డ్రా గా ముగించిన ప్రజ్ఞానంద

**న్యూఢిల్లీ:** టాటా స్టీల్ చెస్ విజ్క్ ఆన్ జీ-2026 లో భారత్ గ్రాండ్ మాస్టర్లు ఎరిగైసి అర్జున్, దొమ్మరాజు గుకేశ్, అరవింద్ చితంబరం ఓటమిపాలవ్వగా, ప్రజ్ఞానంద డ్రా గా ముగించాడు. దీంతో వీరు పట్టికలో అట్టడుగు 5 స్థానాలకు పడిపోయారు. నెదర్లాండ్స్‌లో జరిగిన మ్యాచ్‌లో తెల్లటి పావులు కలిగి ఉన్న అర్జున్ రూక్‌బిషప్ ఎండ్ గేమ్‌లో టర్కీకి చెందిన 14 ఏళ్ల యాగిజ్ కాన్ ఎర్డోగ్మస్ చేతిలో ఓడిపోయాడు. గత మూడు ఆటల్లో కేవలం సగం పాయింట్ మాత్రమే గెలిచిన అర్జున్ ఇప్పుడు కేవలం 3/7 పాయింట్లతో 9వ స్థానానికి పడిపోయాడు. టైటిల్ రేసులోకి తిరిగి రావడానికి సుదీర్ఘ విజయాలు సాధించాల్సి ఉంది. అలాగే 7వ రౌండ్‌లో 37మూవ్‌ల మ్యాచ్‌లో హోమ్ ఫేవరెట్ అనిష్ గిరిపై గుకేష్ టోర్నమెంట్‌లో వరుసగా రెండో ఓటమిని ఎదుర్కొన్నాడు.

అంతకుముందు, ఆరో రౌండ్‌లో ఉజ్బెకిస్తాన్‌కు చెందిన నోడిర్‌బెక్ అబ్దుసత్తోరోవ్‌పై గుకేష్ ఇలాంటి పొరపాటు చేశాడు. ఫలితంగా అతని స్టాండింగ్‌లు భారీగా పడిపోయాయి. ఈ ఓటమితో ఇప్పుడు 7 ఆటల్లో కేవలం 3 పాయింట్లతో టాప్ 10 నుండి నిష్క్రమించాడు. నోడిర్బెక్ కంటే 2.5 పాయింట్ల భారీ తేడాతో వెనుకబడి ఉన్నాడు. అలాగే ప్రజ్ఞాన్ తన ఏడవ రౌండ్ మ్యాచ్‌అప్‌లో జర్మనీకి చెందిన మథియాస్ బ్లూబామ్‌తో వరుసగా ఐదవ డ్రా ఆడాడు. డిఫెండింగ్ ఛాంపియన్ ఇప్పుడు 2.5/7 తో ఉన్నాడు. మరోవైపు, గ్రాండ్ మాస్టర్ అరవింద్ చితంబరం డచ్ గ్రాండ్ మాస్టర్ జోర్డెన్ వాన్ ఫారెస్ట్ చేతిలో ఈ టోర్నమెంట్‌లో తన మూడవ ఓటమిని ఎదుర్కొన్నాడు, కేవలం 2 పాయింట్లతో మొత్తం పట్టికలో చివరి స్థానానికి పడిపోయాడు.

## ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో..
## క్వార్టర్ ఫైనల్స్‌కు సబలెంకా


**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియన్ ఓపెన్-2026లో ప్రపంచ నంబర్ 1 అరినా సబలెంకా ఎంబోకోను ఓడించి 13వ గ్రాండ్ స్లామ్ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. మెల్‌బోర్న్‌లో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో సబలెంకా 6-1, 7-6 (1) తేడాతో విక్టోరియా ఎంబోకోను ఓడించి వరుసగా నాలుగో సంవత్సరం కూడా క్వార్టర్ ఫైనల్‌కు దూసుకొచ్చింది. సబలెంకా గ్రాండ్ స్లామ్ స్థాయిలో వరుసగా 20వ టైబ్రేక్‌ను గెలుచుకుంది. 2005 మరియు 2007 మధ్య వింబుల్డన్‌లో వరుసగా 19 టైబ్రేక్‌లను గెలిచిన నోవాక్ జొకోవిచ్ పేరిట ఉన్న దాదాపు రెండు దశాబ్దాల నాటి రికార్డును ఇప్పుడు సబలెంకా అధిగమించింది. సబలెంకా మ్యాచ్‌ను శిక్షార్హమైన ఫామ్‌లో ప్రారంభించి 45 నిమిషాలకు పైగా వ్యవధిలోనే 6-1, 4-1 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. కానీ మూడు మ్యాచ్ పాయింట్లను మార్చడంలో విఫలమైన తర్వాత, 5-4తో సహా రెండవ సెట్‌లో టిప్ సీడ్ సర్వీస్ రెండుసార్లు బ్రేక్ చేయబడింది. తర్వాత, ఎంబోకో 12వ గేమ్‌ను డ్రా గా ముగించడంతో ఆమె మూడవ సెట్‌కు వెళ్లేందుకు రెండు పాయింట్ల దూరంలో ఉంది. కానీ చివరికి, సబలెంకా గ్రాండ్‌స్లామ్‌లో టైబ్రేక్ సెట్‌లో అజేయ పరంపరను 20కి మెరుగుపరుచుకుంది, చివరికి 1 గంట 26 నిమిషాల్లో ఎంబోకో సవాలును అధిగమించి సబలెంకా ఆధిక్యాన్ని సంపాదించింది. ఇక మంగళవారం జరిగే క్వార్టర్ ఫైనల్‌లో, సబలెంకా 29వ సీడ్ ఇవా జోవిక్‌తో తలపడనుంది.

## ఇయు కార్లపై దిగుమతి సుంకాల రద్దుకు కేంద్రం యోచన
## ఇయుతో ట్రేడ్ డీల్ ఖరారు కాగానే అమలుకు నిర్ణయం

**న్యూఢిల్లీ, జనవరి 26:** ఐరోపా కూటమి దేశాలనుంచి దిగుమతిచేసుకుంటున్న కార్లపై సుంకాలను రద్దుచేసేందుకు కేంద్రం కసరత్తులుచేస్తోంది. ప్రస్తుతం ఈయూ కార్లపై 40 నుంచి 110శాతం వరకూ సుంకాలు వేస్తున్నారు. వీటిని భారీగా తగ్గించడం లేదా పూర్తిగా తొలగించడం వంటిచేస్తే వాణిజ్యం మరింత పెరుగుతుందని పారిశ్రామిక రంగ నిపుణులు కేంద్రాలనికి సూచనలచేసారు. అయితే యూరోపియన్ యూనియన్‌తో జరిగే వాణిజ్య ఒప్పందం ఖరారయిన తర్వాత అమలులోకి వచ్చినవెంటనే ఈ సుంకాల రద్దు అమలుచేయాలని నిర్ణఇంచారు. ప్రధానిమోడీ ప్రభుత్వం కొన్ని ఎంపికచేసిన కేటగిరీ కార్లపై 27దేశాల కూటమినుంచి దిగుమతులు చేసుకున్నవాటికి రూ.15వేల యూరోలు అంటే ం17,739 డాలర్లకు పన్నులు తగ్గించేందుకు అంగీకరించారు. ఆ తర్వాత ఈ సుంకాలను 10శాతానికి చేరుస్తారని తెలుస్తోంది. భారతీయ మార్కెట్‌లోకి యూరోపియన్ ఆటోమేకర్లు వోక్స్‌వ్యాగన్, మెర్సిడిసిస్ బెంజ్, బిఎం డబ్ల్యు వంటి వాహనాలు మరింతగా వచ్చేందుకు వెసులుబాటు కల్పించేందుకు కేంద్ర నిర్ణయించింది. అయితే ఈచర్చల దశలోనే ఈప్రతిపాదనలున్నాయని చివరి నిమిషంలో మళ్లీ మార్పులు ఉండవచ్చని కూడా అధికార వర్గాలుపేర్కొం టున్నాయి. స్వేఛ్ఛా వాణిజ్య ఒప్పందానికి సంబంధించి ఈయూ భారత్‌లమధ్య చర్చలుపూర్తి అయ్యాయి. అన్ని డీల్స్‌కు తల్లివంటిది అని పేర్కొంటున్న ఈ డీల్ ముసాయిదాను కూడా విడుదలచేస్తారని అంచనా. ఈ ఒప్పందం అమలుకువస్తే ద్వైపాక్షిక వాణిజ్యం కింద భారతీయ ఉత్పత్తులు టెక్స్‌టైల్స్, జ్యూయెలరీ వంటివాటి ఎగుమతులు మరింత పెరుగుతాయి. అమెరికా, చైనాల తర్వాత భారత్‌మూడో అతిపెద్ద కార్ల మార్కెట్‌గా నిలిచింది. ప్రస్తుతం 70 నుంచి 110శాతం దిగుమతి సుంకాలు వేస్తున్నారు. కంబస్టన్ ఇంజిన్‌కార్లు రెండు లక్షలవరకూ సుంకాలను 40 శాతం తగ్గించింది. విద్యుత్ వాహనాలకు మాత్రం ముందు ఐదేళ్లపాటు ఎలాంటిసుంకాల రాయితీ ఉండదని తెలుస్తోంది. భారత్ ఆటో మార్కెట్‌లో యూరోపియన్‌కార్ల తయారీదారులు నాలుగుశాతం వాటాతో ఉన్నారు. జపాన్‌సుజుకి మోటార్ ఆధిపత్యంతో ఉంది. ఆ తర్వాత మహీంద్ర, టాటా రెండుసంస్థలు కూడా మూడింట రెండొంతుల వాటాలతో ఉన్నాయి. 2030 నాటికి భారత్ కార్లమార్కెట్ 60 లక్షలవరకూ ఉంటుందని అంచనా.

## భారత్‌లోనే బ్రెజిల్ ఎంబ్రాయిర్ విమానాల తయారీ
### అదానీ, ఎంబ్రాయిర్‌ల మధ్య ఖరారవుతున్న ఎంఒయు

**ముంబయి, జనవరి 25:** ఆదానిగ్రూప్ బ్రెజిల్ ఏరోస్పేస్ దిగ్గజం ఎంబ్రాయిర్‌తో కలిసి పౌర విమానాల తయారీ అసెంబ్లింగ్‌యూనిట్‌ను భారత్‌లోనే ఏర్పాటు చేయాలని నిర్ణయించాయి. ఇందుకు సంబంధించి రెండు సంస్థలమధ్య చర్చలు కొలిక్కివచ్చినట్లు సమాచారం. ప్రపంచదేశాలన్నింటితోపాటుగా భారత్‌లో కూడా ఎయిర్‌ట్రాఫిక్ విపరీతంగా పెరుగుతోంది. ఉడాన్ సర్వీసులతో సెకండ్ ఎసి ప్రయాణీకులు ఇపుడు విమానాల్లోనే రావాలని యోచిస్తున్నారు. ఇందుకు సంబంధించి ఆదాని డిఫెన్స్ ఏరోస్పేస్, ఎంబ్రాయిర్ కంపెనీలమధ్య పౌర విమాన యాన మంత్రి రామ్మోహన్ నాయుడు సమక్షంలో ఈనెల 27వ తేదీ ఒప్పందాలు జరగనున్నాయి. ఈఒప్పందం ప్రకారం రెండు సంస్థలు కలిపి ఎంబ్రాయిర్ ఫైనల్ అసెంబ్లీలైన్‌ను భారత్‌లోనే ఏర్పా టుచేస్తాయి. దీనితో బ్రెజిల్ ఎంబ్రాయిర్ కంపెనీ విమానాలు ఇక భారత్‌లోనే తయా రవుతాయి. ఎంబ్రాయిర్ వాణిజ్య విమానాలు 150 వరకూ సీట్లతో ఉంటాయి. ఈ ఫైనల్ అసెంబ్లింగ్‌లైన్, ఆదాని గ్రూప్‌లు ఇప్పటికే ఏవియేషన్ మార్కెట్‌లో శరవేగంగా వెళుతున్న సంస్థలుగా నిలిచాయి. ఇపుడు విమానాల తయారీతో భారత్ మార్కెట్‌లో లీడర్ స్థాయికి ఆదాని ఎంబ్రాయిర్ జాయింట్ వెంచర్ చేరుతుందన్న అంచనాలున్నాయి. ఇప్పటికే బ్రెజిల్ సంస్థ ఢిల్లీలో తన కార్యాలయాన్ని ప్రారంభించింది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.